


'ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 232

SUNDAY Special | ఆదివారం 13-11-2022



ఆఖరి పోరాటం

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో నేడు ఇంగ్లండ్, పాకిస్తాన్ జట్ల మధ్య టి20 ప్రపంచకప్ ఫైనల్. అమీతుమీకి ఇరు జట్లు సిద్ధం. మ్యాచ్‌కు వర్షం ముప్పు. మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం.

- వివరాలు 14లో



తెలుగింటి పాట

ఆమె పాట వినక పోతే తెలుగు వారికి నిదుర వచ్చునా..? స్వచ్ఛ సమీరంలో సుగంధాల నాజూకు ఆమె గొంతు. నవంబర్ 13న సుశీలమ్మ 88వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

- వివరాలు 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విశాఖలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

విశాఖదే వికాసం

రక్షణ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విశాఖ పాత్ర కీలకం: ప్రధాని మోదీ

- వెయ్యేళ్ల క్రితమే ఇక్కడి ఓడరేవు నుంచి పశ్చిమాసియా, రోమ్‌కి ఎగుమతులు
- వేల ఏళ్ల క్రితమే ప్రధాన వాణిజ్య కూడలిగా సాగర నగరి
- ఆధునిక భారత్‌లోనూ అంతే ముఖ్య స్థానం
- మన సముద్ర తీరాలు దేశ శ్రేయస్సుకు 'గేట్ వే' లాంటివి
- శతాబ్దాలుగా దేశాన్ని సుభిక్షంగా నిలిపాయి
- దేశాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య భూమిక
- విద్య, వైద్యంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు
- మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకారం అందిస్తాం
- నగరాల అవసరాలను తీర్చేలా మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ
- ఈ దిశగా ఒక అడుగు ముందుకేసిన విశాఖ
- అభివృద్ధి పరుగులో ఆంధ్రప్రదేశ్ తీరానికి కొత్త ఊపు, శక్తి
- ప్రపంచమంతా సంక్షోభంలో ఉన్నా.. వృద్ధి పథంలో భారత్ దూకుడు
- మన విజయాలను అంతర్జాతీయ సమాజం గుర్తించింది.. అందరి చూపు మనవైపే
- విశాఖలో రూ.10,742 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

2లో



విశాఖపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

"అందరితో కలసి మెలసి స్నేహపూర్వకంగా, సుహృద్భావంతో మెలగడం ఆంధ్రప్రదేశ్ ప్రజల నైజం. విద్య, వైద్య, సాంకేతిక రంగాల్లో తమదంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. దేశాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. వెయ్యేళ్ల క్రితమే పశ్చిమ ఆసియా, రోమ్ నగరాలకు విశాఖ నుంచి ఎగుమతులు జరిగాయి. రక్షణ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తూ విశాఖపట్నం దేశంలోనే ప్రముఖ నగరంగా గుర్తింపు తెచ్చుకుంది" - ప్రధాని మోదీ

అటు సముద్రం... ఇటు జన సముద్రం!

సాగర కెరటాలతో పోటీపడి విశాఖలో ఉప్పొంగిన జన వాహిని! కదలి కదిలి వచ్చినట్లుగా ఏయూ ప్రాంగణం కిక్కిరిసింది. విశాఖలో ప్రధాని మోదీ పాల్గొన్న బహిరంగ సభ అంచనాలకు మించి విజయవంతమైంది. సభా ప్రాంగణంలో మూడు లక్షల మందికి ఏర్పాట్లు చేయగా తెల్లవారుజాము నుంచే జన ప్రవాహం మొదలైంది. లోపల కిక్కిరిసి పోవడంతో భారీ సంఖ్యలో బయటే నిరీక్షించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చినా ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో బాగా ఏర్పాట్లు చేసిందని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఈ స్థాయిలో భారీ సభ గతంలో ఎన్నడూ జరగ లేదని, ఇక ముందూ సాధ్యం కాదని బీజేపీ నేతలు సైతం వ్యాఖ్యానించారు. విశాఖలో రూ.10,742 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వేల ఏళ్ల క్రితమే ప్రపంచ దేశాలతో వర్తక, వాణిజ్య సంబంధాలను నెరపిన ఘన చరిత్ర ఇక్కడి ఓడరేవు సొంతమని ప్రధాని ప్రశంసించారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని పునరుద్ఘాటిస్తూ విభజన హామీలను నెరవేర్చాలని ప్రధానిని సీఎం జగన్ సభా వేదికగా మరోసారి కోరారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- అది మినహా మా ప్రభుత్వానికి మరో అజెండా లేదు.. ఉండదు.. ఉండబోదు
- విశాఖ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ
- విభజన హామీల నుంచి పోలవరం, ప్రత్యేక హోదా వరకూ.. స్టీల్‌ప్లాంట్ నుంచి రైల్వే జోన్ దాకా పలు దఫాలు విజ్ఞప్తులు చేశాం
- సానుకూలంగా పరిగణించి పెద్ద మనసుతో పరిష్కరించాలని కోరుతున్నాం

2లో

'ప్రీమియం' రిజిస్ట్రేషన్ రెడీ

- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో అత్యాధునిక రిజిస్ట్రేషన్ సెంటర్లు
- అవినీతి, డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులకు స్వస్తి
- స్లాట్ విధానం, సింగిల్ విండో రిజిస్ట్రేషన్లు.. విశాఖపట్నం, శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టు
- సీఎం ఆమోదించిన వెంటనే విశాఖ సెంటర్ ప్రారంభం



విశాఖ మధురవాడ మిలీనియం టవర్‌లో సిద్ధమైన ప్రీమియం సర్వీస్ సెంటర్ లోపలి భాగం

సాక్షి, అమరావతి: ఆస్తుల క్రయ విక్రయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఓ పెద్ద ప్రహసనం. అడుగడుగునా అవినీతి, డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువ. ఇటువంటి కష్టాలు, అవినీతి లేకుండా ప్రజలకు సులభంగా, అత్యాధునిక పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించాలన్నది సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఇందుకోసం సీఎం జగన్ నేతృత్వంలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్లకు అధికారులు రూపకల్పన చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, వినియోగదారులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్లను అందుబాటులోకి తెస్తోంది. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో ఇక్కడ సేవలు అందుతాయి. తొలి దశలో 9 సెంటర్లు

మిగతా 15వ పేజీలో ▶



జక్కంపూడిలో జగనన్న ఇళ్లు

ఆ ఇళ్లు.. బడుగుల ఆత్మగౌరవ సౌధాలు

ఒకప్పుడు అవస్థలు, అగచాట్ల మధ్య పూరి గుడిసెల్లోనే దుర్భర జీవనం

- గత ప్రభుత్వంలో ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా పట్టించుకోని వైనం
- ఇప్పుడు వారి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' ద్వారా స్థలాలు మంజూరు.. ఇళ్ల నిర్మాణం
- కష్టాలుపడ్డ చోటే నేడు సొంతిళ్లలో ఆత్మగౌరవంతో జీవనం
- విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ జగనన్న కాలనీపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

12లో

ఎందరో అభాగ్యుల దుర్భర జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం వెలుగులు నింపుతోంది. ఒక్క రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వం వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అలాగే, పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చింది. ఇప్పుడు వీరి జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని జగనన్న కాలనీకి 'సాక్షి' వెళ్లి తెలుసుకుంది.

'సంపాదన'లో సగం వారిదే

ప్రపంచంలో వ్యక్తిగత సంపదలో 50% అమెరికా, చైనా పౌరులదే

- భారత్ పౌరుల వాటా 3.1%
- టాప్–10లో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యూకే, ఫ్రాన్స్, ఇండియా, కెనడా, ఇటలీ, ఆస్ట్రేలియా
- ఈ 10 దేశాల్లోనే వ్యక్తిగత సంపదలో 75 శాతం పోగుబడి ఉంది
- దశాబ్ద కాలంలో చైనాలో రెట్టింపయిన వ్యక్తిగత సంపద.. భారత్‌లోనూ పెరిగింది
- క్రెడిట్ సూయిస్ నివేదిక వెల్లడి
- సంపదను నిరుపేదలకు చేరవేస్తేనే అభివృద్ధి వేగం అందుకుంటుంది: ఆర్థికవేత్తలు

5లో



లేచింది మొదలు పడుకొనే వరకు ప్రపంచంలో ప్రతి మనిషీ జపించే కామన్ జపం 'డబ్బు'. గుండె కూడా లబ్ 'డబ్బు'.. లబ్ 'డబ్బు' అని కొట్టుకుంటుందని కొందరు చమత్కరిస్తుంటారు. ఏ పని చేసినా దాని వెనుక ఉండేది 'సంపాదన'. 'ఎంత సంపాదించావన్నది కాదు.. ఎలా బతికావన్నది ముఖ్యం' అన్న సూత్రం రివర్సయింది. సంపాదనే ముఖ్యమైంది. ఇందులో అమెరికా, చైనా పౌరులు ఆరితేరారు. వ్యక్తిగత సంపాదనలో వారిదే సగం. మిగతా ప్రపంచానిది సగం. క్రెడిట్ సూయిస్ నివేదిక గణాంకాలతో ప్రత్యేక కథనం..



సికింద్రాబాద్ నుంచి విజయవాడకు

నాలుగు గంటల్లో

- సికింద్రాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ త్వరలో 'వందేభారత్' రైలు అందుబాటులోకి రానుంది. నూతన సంవత్సర కానుకగా దక్షిణమధ్య రైల్వేలోనూ వందేభారత్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే వందేభారత్‌ను పట్టాలెక్కించే దిశగా కార్యాచరణ సాగుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

- వివరాలు 12లో ▸

చైనా కార్గో వ్యోమనౌక ప్రయోగం విజయవంతం



చైనా సొంతంగా నిర్మిస్తున్న అంతరిక్ష కేంద్రానికి అవసరమయ్యే సామాగ్రిని పంపడం కోసం ప్రయోగించిన కార్గో వ్యోమనౌక హైనన్ దీవుల్లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్ సైట్ నుంచి టియాన్‌జూ–5 విజయవంతంగా నింగిలోకి దూసుకుపోయింది. - వివరాలు 6లో

న్యూస్‌రీల్

హిమాచల్ ప్రదేశ్‌లో 66 శాతం పోలింగ్



అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కి కఠినమైన సవాళ్లు విసిరిన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 66 శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్టుగా ఎన్నికల సంఘం వెల్లడించింది. గడ్డ కట్టించే చలిని కూడా లెక్క చేయకుండా శనివారం జరిగిన పోలింగ్‌లో ఓటర్లు భారీగా కదిలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వివరాలు 6లో ▸

న్యాయవ్యవస్థలో పురుషాధిక్యత: సీజేఐ



భారతీయ న్యాయవ్యవస్థలో తొలినుంచీ పురుషాధిక్యత వేళ్లూనుకొని ఉందని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. మన దేశంలో న్యాయ వృత్తి ఫ్యూడల్, పితృస్వామ్య తరహాతో, మహిళలను సముచిత వాటా కల్పించని స్వభావంతో కూడుకున్నదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸

విలాస నౌకలో 800 మందికి కోవిడ్



న్యూజిలాండ్ నుంచి వస్తున్న విలాసవంత పర్యాటక నౌక 'మేజిస్టిక్ ప్రిన్సెస్'లోని 3,300 మంది ప్రయాణికులు, 1,300 మంది సిబ్బందిలో శనివారం మొత్తంగా 800 మందికి కోవిడ్ సోకింది. మెల్‌బోర్న్‌కు వెళ్లాల్సిన ఈ నౌక ప్రస్తుతం సిడ్నీలోని సర్క్యులర్ క్వేలో ఆగింది.

వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి





బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం



సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

జన కెరటాలు

ప్రధాని బహిరంగ సభకు పోటెత్తిన జన వాహిని

- ఉత్తరాంధ్ర నలువైపుల నుంచి భారీగా రాక
- సభా ప్రాంగణంలో 3 లక్షల మందికి ఏర్పాట్లు
- దారిలో నిలిచిపోయిన లక్షలాది మంది
- 6 వేల బస్సులు, 12 వేల ఆటోల్లో ఏయూ క్యాంపస్‌కు
- జై జగన్.. జై విశాఖ నినాదాలతో ప్రజాహోరు
- ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

సాక్షి, విశాఖపట్నం: సాగర ఘోషను మించి విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిధ్వనించింది. నగరంలోకి వచ్చిన ప్రతి బస్సు, ఆటో, బైక్.. అన్నీ ఏయూ మైదానం వైపే కదిలాయి. సీఎం, పీఎం నినాదాలతో సాగర తీరం హోరెత్తింది. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం విశాఖ వచ్చిన ప్రధాని మోదీ పాల్గొన్న బహిరంగ సభకు లక్షల సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే వేదికపై కనిపించి తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్థంగా ఏర్పాట్లు చేసింది.

తెల్లవారుజామునే..

విశాఖ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో బహిరంగసభ నిర్వహించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జన సమీకరణ చేపట్టింది. సుమారు 3 లక్షల మందికి సభాస్థలిలో ఏర్పాట్లు చేశారు. సభాప్రాంగణం పూర్తిగా నిండిపోగా లక్షలాది మంది దారిలోనే నిలిచిపోయారు. అనకాపల్లి, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు తూర్పు గోదావరి నుంచి కూడా తరలి వచ్చారు. వేకువ జామున 4 గంటల నుంచే ప్రయాణమై విశాఖ చేరుకున్నారు. 6 గంటల నుంచే సభాస్థలికి రావడం మొదలైంది. ఉదయం 9 గంటలకే సభా ప్రాంగణంలో సీట్లు నిండిపోయాయి. తర్వాత వచ్చిన వారంతా ప్రాంగణానికి ఇరువైపులా నిలుచుని సభ ముగిసేవరకూ ఓపిగ్గా నిరీక్షించడం విశేషం. 6 వేలకు పైగా బస్సులు, 15 వేల పైచిలుకు ఇతర వాహనాల్లో జనం ప్రభంజనంలా తరలివచ్చారు.

సీఎం రాకతో హోరెత్తిన ఏయూ..

ఉదయం 9.40 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభా ప్రాంగణానికి చేరుకోవడంతో సీఎం.. సీఎం.. జై జగన్ నినాదాలతో మార్మోగింది. లక్షలాది గొంతులు ఏకమై ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకడంతో ఏయూ క్యాంపస్ హోరెత్తింది. అనంతరం ప్రాంగణానికి చేరుకున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి జగన్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తారని ప్రకటించిన వెంటనే జై జగన్.. జై విశాఖ నినాదాలతో హోరెత్తింది. ముఖ్యమంత్రి మాట్లాడుతున్నంత సేపూ ప్రజలు హర్షధ్వానాలతో ప్రతిస్పందించారు.

అర్ధరాత్రి నుంచే అల్పాహారం..

సభకు తరలి రావడం నుంచి తిరిగి వెళ్లే వరకూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సిద్ధం చేసిన అల్పాహారాన్ని వేకువ జామున 2 గంటలకే 158 పాయింట్ల వద్దకు తరలించి వస్తున్న ప్రతి ఒక్కరికీ అందజేశారు. ఉదయం 6 నుంచి 8 గంటల మధ్యలోనే ప్రతి ఒక్కరికీ భోజన పార్శిళ్లను కూడా అందజేశారు. లక్షల లీటర్ల మంచినీరు, వేలాది మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఆద్యంతం ఎక్కడికీ కదలకుండా చివరి వరకూ ఉన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 6,700 మంది పోలీసులు గట్టి భద్రతా కల్పించారు. మూడంచెల భద్రతా వ్యవస్థని ఏర్పాటు చేశారు. అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించి భారీ బహిరంగ సభను విజయవంతం చేశారు.

విశాఖ సభ సైడ్ లైట్స్..

- ప్రియమైన సోదరీ సోదరులారా నమస్కారం... గవర్నర్ విశ్వభూషణ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు నమస్కారం..' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ....భారత్ మాతాకీ జై అంటూ అందరితో నినాదాలు చేయించి తన ప్రసంగాన్ని తెలుగులోనే ముగించారు.
- విశాఖను విశేష నగరంగా ప్రధాని అభివర్ణించడంలో సభికుల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమైంది.
- రైల్వే మంత్రి కూడా తన ప్రసంగాన్ని అందరికీ నమస్కారాలు అంటూ తెలుగులో ప్రారంభించారు.
- ఉదయం 9.40 గంటలకు పోర్టు గెస్ట్ హౌస్ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో సభాస్థలికి చేరుకున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో ఉన్న ఐఎన్ఎస్ చోళ సూట్ నుంచి ప్రధాని మోదీ రోడ్డు మార్గంలోనే ఏయూ మైదానానికి వచ్చారు.
- భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నట్లు అంచనా వేసిన అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేసింది. మొత్తం 3 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. ప్రధాని మోదీ ప్రసంగించే సమయంలోనూ ప్రజలు భారీగా తరలి వస్తుండటం విశేషం.
- సభ ముగిసిన తరువాత ప్రధాని, ముఖ్యమంత్రి వేదిక నుంచి దిగుతున్న సమయంలోనూ వేల మంది వస్తుండటం కనిపించింది. అప్పటికే కార్యక్రమం ముగిసిందని పోలీసులు చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.
- సీఎం జగన్ 10 నిమిషాల పాటు మాట్లాడగా ప్రధాని మోదీ 25 నిమిషాలకుపైగా ప్రసంగించారు.
- ప్రధానిని శాలువాతో సత్కరించి శ్రీరాముడి విగ్రహాన్ని సీఎం అందజేశారు.
- ప్రధాని ప్రారంభించనున్న ప్రాజెక్టులకు సంబంధించిన 'ఏవీ'ని ప్రదర్శించారు.
- సభా ప్రాంగణం నుంచి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి జగన్, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వేర్వేరు హెలికాప్టర్లలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.
- ప్రధాని మోదీ 11.26కి ఎయిర్‌పోర్టుకు చేరుకొని ఐఎన్ఎస్ డేగా నుంచి ప్రత్యేక విమానంలో 11.56కి హైదరాబాద్ పయనమయ్యారు.
- ప్రధాని మోదీకి వీడ్కోలు పలికిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ ఐఎన్ఎస్ డేగా నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు విమానాశ్రయానికి చేరుకొని 12.20కి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు.
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు విడదల రజిని, గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజబాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాస్, కరణం ధర్మశ్రీ, మేయర్ హరివెంకట కుమారి తదితరులు ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు పలికారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రధానికి ఘన వీడ్కోలు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): రెండు రోజుల పర్యటన ముగించుకుని శనివారం మధ్యాహ్నం విశాఖ నుంచి తిరుగు పయనమైన ప్రధాని మోదీకి రాష్ట్ర అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, తూర్పు నావికాదళం కమాండ్ ఇన్ చీఫ్ ఫ్లాగ్ అధికారి వైస్ అడ్మిరల్ బిశ్వజిత్‌దాస్ గుప్తా, విశాఖ జేసీ విశ్వనాథ్ తదితరులు ప్రధానికి వీడ్కోలు పలికారు. ప్రధాని మోదీ ఏయూలోని సభా స్థలం నుంచి హెలికాప్టర్‌లో నేరుగా ఐఎన్ఎస్ డేగాకు 11.26 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 11.56 గంటలకు హైదరాబాద్ బయలుదేరారు.



బహిరంగ సభ గ్రౌండ్‌లో కిక్కిరిసిపోయిన జనం



సభా ప్రాంగణం వెలుపల రోడ్లన్నీ ఇలా జన ప్రవాహంతో నిండిపోయాయి..

విశాఖదే వికాసం

రక్షణ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విశాఖ పాత్ర కీలకం ప్రధాని మోదీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోగా భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అందుకనే ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. విశాఖలో రూ.10,742 కోట్లతో చేపట్టిన ఏడు ప్రాజెక్టులు నగర అభివృద్ధితోపాటు ఆంధ్రప్రదేశ్ పురోగతికి దోహదం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా శనివారం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలసి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

వాణిజ్యానికి కేంద్ర బిందువు..

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా మూడు నెలల క్రితం ఏపీలో పర్యటించే అవకాశం నాకు లభించింది. విశాఖపట్నానికి చాలా విశిష్టమైన వర్తక, వ్యాపార సంప్రదాయాలున్నాయి. పురాతన భారతదేశంలో ముఖ్యమైన ఓడరేవుగా విలసిల్లింది. వేల సంవత్సరాల క్రితమే పశ్చిమాసియా, రోమ్‌లకు వాణిజ్య మార్గంలో భాగంగా ఉంది. ఇప్పుడు కూడా దేశ వాణిజ్యానికి కేంద్ర బిందువుగా నిలిచింది. మౌలిక సదుపాయాల కల్పనలో కొత్త కోణాలను ఆవిష్కరించడం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను సాధించేందుకు దోహదం చేస్తుంది. కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన విషయంలో అండగా ఉంటాం.

ఏపీ తీరానికి కొత్త ఊపు..

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సమయంలో దేశం అభివృద్ధి పథంలో సాగుతోంది. సామాన్యుడి అవసరాల ఆధారంగానే మౌలిక సదుపాయాల కల్పన రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నాం. ప్రతిపాదిత ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్ట్‌లోని 6–వరుసల రహదారి, పోర్టు కనెక్టివిటీకి ప్రత్యేక రహదారి, విశాఖ రైల్వే స్టేషన్, ఫిషింగ్ హార్బర్‌ల ఆధునీకీకరణ లాంటి ప్రాజెక్టులు సమగ్ర అభివృద్ధి దృక్పథంలో భాగంగా చేపట్టినవే. ప్రధానమంత్రి గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయడమే కాకుండా ప్రాజెక్టుల వ్యయాన్ని కూడా తగ్గించింది. మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ ప్రతి నగరం భవిష్యత్తు అవసరాలను తీరుస్తుంది. విశాఖ ఈ దిశగా ఒక అడుగు వేసింది. ఈ అభివృద్ధి పరుగు పందెంలో ఏపీ, తీర ప్రాంతాలు కొత్త ఊపు, శక్తితో ముందుకు సాగుతాయి.



పౌరుల ఆకాంక్షలను గుర్తిస్తూ..

ప్రపంచ దేశాలన్నీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ అభివృద్ధిలో భారత్ కొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశం సాధించిన విజయాలను ప్రపంచం గుర్తించింది. భారత్ ప్రపంచానికి ఆశాకిరణంగా మారింది. పౌరుల ఆకాంక్షలు, అవసరాలను గుర్తిస్తూ పని చేస్తున్నందున ఇది సాధ్యమైంది. సామాన్యుల జీవితాన్ని మెరుగుపరిచేలా విధానాలను రూపొందిస్తూ ప్రతి నిర్ణయం తీసుకుంటున్నాం. పీఎల్ఐ స్కీమ్, జీఎస్టీ, ఐబీసీ, జాతీయ మౌలిక సదుపాయాల పైప్‌లైన్ ప్రాజెక్టులు దేశంలో పెట్టుబడులు పెరగడానికి కారణమయ్యాయి. అదే సమయంలో పేదల సంక్షేమం కోసం పథకాలను విస్తృతం చేస్తున్నాం. ఈ అభివృద్ధి ప్రయాణంలో అట్టడుగున ఉన్న ప్రాంతాలు కూడా భాగమయ్యాయి. గత రెండున్నరేళ్లుగా ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయడంతో పాటు ప్రతి రైతు ఖాతాలో ఏటా రూ.6 వేలు చొప్పున జమ చేస్తున్నాం. డ్రోన్, గేమింగ్, స్టార్టప్ రంగాల్లో నిబంధనల సడలింపులతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. మత్స్యకారుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డుల జారీతో పాటు విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ చేపడుతున్నాం. నౌకాయాన రంగంలో రూ.వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నాం. సముద్ర తీరం శతాబ్దాలుగా దేశాన్ని సుభిక్షంగా ఉంచుతోంది. మన సముద్ర తీరాలు దేశ శ్రేయస్సుకు ముఖ ద్వారాలుగా పని చేశాయి.

విశేష నగరం విశాఖ

శుక్రవారమే విశాఖ చేరుకుని ఐఎన్ఎస్ చోళా సూట్‌లో బస చేసిన ప్రధాని మోదీ ఉదయం 10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. గవర్నర్, సీఎం, రైల్వే మంత్రి ఆయనకు స్వాగతం పలికారు. వివిధ ప్రాజెక్టుల స్టాల్స్‌ను పరిశీలించాక సభా వేదికపైకి చేరుకున్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం జగన్ ప్రసంగించాక ప్రధాని మాట్లాడారు. ఆయన ప్రసంగాన్ని ఎమ్మెల్సీ మాధవ్ తెలుగులో అనువదించారు. సుమారు 25 నిమిషాల పాటు సాగిన ప్రసంగంలో ఏపీ ప్రజల మనస్తత్వాన్ని ప్రధాని మెచ్చుకోవడంతో పాటు విశాఖ నగరాన్ని విశేష నగరంగా అభివర్ణించారు. అనంతరం ప్రధాని 11.56 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో బయలుదేరారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- దాదాపు రూ.450 కోట్లతో చేపట్టనున్న విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.
- రూ.150 కోట్లతో చేపట్టనున్న విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ ప్రాజెక్టుతో హ్యాండ్లింగ్ సామర్థ్యం రోజుకు 150 టన్నుల నుంచి 300 టన్నులకు పెరగనుంది.
- విశాఖ– రాయ్‌పూర్ 6 లైన్ల రహదారి పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. రూ.3,750 కోట్లకుపైగా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు వల్ల ప్రయాణ దూరం 14 నుంచి 7 గంటలకు తగ్గడంతో పాటు ఏపీ, ఒడిశాలోని వెనుకబడిన ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగనుంది.
- విశాఖలోని కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలా నగర్ జంక్షన్ వరకు పోర్టు అవసరాల కోసం ప్రత్యేక రహదారికి, రూ.2,658 కోట్లతో గెయిల్ నిర్మిస్తున్న శ్రీకాకుళం–అంగుల్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు.
- రూ.211 కోట్లతో నిర్మించిన పాతపట్నం–నరసన్నపేట 2 లైన్ల రహదారి, రూ.2,917 కోట్లతో పూర్తి చేసిన ఓఎన్‌జీసీ యూ–ఫీల్డ్ అభివృద్ధి ప్రాజెక్టును ప్రధాని జాతికి అంకితం చేశారు.

రాష్ట్రానికి వందే భారత్ రైలు!

త్వరలో ఏపీకి వందే భారత్ రైలును కేటాయిస్తాం. విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో ప్రపంచస్థాయి సదుపాయాలు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. సోలార్ ద్వారా రైల్వేల విద్యుత్ అవసరాలు తీర్చుకుంటున్నాం. వన్ స్టేషన్–వన్ ప్రాడక్ట్ ద్వారా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఏటికొప్పాక బొమ్మలను అందుబాటులో ఉంచాం. ప్రధాని మోదీ హయాంలో ఏపీకి కేంద్రం కేటాయిస్తున్న నిధులు పెరిగాయి. 2004కి ముందు అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు రూ.886 కోట్లు కేటాయించగా ప్రధాని మోదీ ఏకంగా రూ.7,043 కోట్లు కేటాయించారు.

– అశ్విని వైష్ణవ్, రైల్వేశాఖ మంత్రి

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

మా ఆర్థిక వనరుల్లో ప్రతి రూపాయి సద్వినియోగం దిశగా ఖర్చు చేస్తున్నాం : సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: "ఎనిమిదేళ్ల క్రితం తగిలిన అతిపెద్ద గాయం నుంచి మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఇంకా కోలుకోలేదు. విభజన హామీల్లో పోలవరం నుంచి ప్రత్యేక హోదా వరకూ.. స్టీల్ ప్లాంట్ నుంచి రైల్వే జోన్ దాకా పలు అంశాలపై అనేకసార్లు విజ్ఞప్తులు చేశాం. మీరు (ప్రధాని మోదీ) సహృదయంతో వాటిని సానుకూలంగా పరిష్కరించాలని కోరుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాలు మినహా మా ప్రభుత్వానికి మరో అజెండా లేదు.. ఉండదు.. ఉండబోదు" అని సీఎం జగన్ స్పష్టం చేశారు. శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో విభజన హామీలను నెరవేర్చాలంటూ ప్రధాని మోదీని సీఎం జగన్ మరోసారి కోరారు. తొలుత వేదికపైకి ప్రధానికి సాదరంగా స్వాగతం పలుకుతూనే.. రాష్ట్ర పరిస్థితులు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలు, దీర్ఘకాలంగా ప్రజల ఆకాంక్షలను ఆయన ముందుంచారు. ఉత్తరాంధ్ర గడ్డపై నడయాడిన అభ్యుదయ వాదులు గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, వంగపండు సూక్తులను తన ప్రసంగంలో సీఎం జగన్ ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

పున్నమి కెరటాలకు మించి..

ఇక్కడకి వచ్చిన ప్రజలను చూస్తుంటే ప్రజాకవి, గాయకుడు వంగపండు మాటలు, పాటలు గుర్తుకొస్తున్నాయి. 'ఏం పిల్లడో ఎల్దామొస్తవా..!' అంటూ ఈ రోజు మనం తలపెట్టిన ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జనం ప్రభంజనంలా కదలి రావడం కనిపిస్తోంది. ఈ రోజు చారిత్రక ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒకవైపు సముద్రం కనిపిస్తోంది. మరోవైపు జన సముద్రాన్ని తలపిస్తోంది. కార్తీక పౌర్ణమివేళ ఎగిసిపడిన కెరటాలకు మించి జన కెరటాలు ఇక్కడ ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. దేశ ప్రగతి రథసారధి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర మంత్రివర్యులకు, లక్షలాదిగా తరలి వచ్చిన నా అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, అవ్వా తాతలకు ప్రభుత్వం తరపున ఉత్తరాంధ్ర గడ్డ మీద విశాఖలో సాదరంగా స్వాగతం పలుకుతున్నా.

ఆకాంక్షలకు అద్దం..

దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన విజయనగరం వాసి, మహాకవి గురజాడ మాటలు మనందరికీ కర్తవ్య బోధ చేస్తున్నాయి. ప్రజల ఆకాంక్షలకు ఇక్కడకు తరలి వచ్చిన జన సాగరం అద్దం పడుతోంది. ఇదే నేల మీద నడయాడిన మహాకవి శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే "వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. జగన్నాథ రథ చక్రాలొస్తున్నాయ్.." అంటూ కదలివస్తున్న లక్షల జనసందోహం మన ఎదుట కనిపిస్తోంది. దాదాపు రూ.10,742 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న ప్రధాని మోదీకి అశేష జనవాహిని తరపున, రాష్ట్ర ప్రజలందరి తరపున నిండు మనసుతో కృతజ్ఞతలు.

ప్రతి కుటుంబం నిలదొక్కుకునేలా..

ప్రజల ప్రభుత్వంగా గత మూడున్నరేళ్లలో పిల్లల చదువులు, వైద్యం, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించాం. వికేంద్రీకరణ, పారదర్శకత కోసం గడప వద్దకే పరిపాలన లాంటివి మా ప్రాధాన్యతలుగా అడుగులు వేశాం. ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకోవడం అంటే ఈ రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇల్లు, ప్రతి ఒక్క కుటుంబం నిలదొక్కుకోవడమే అని నమ్మి ఇంటింటా ఆత్మ విశ్వాసాన్ని నింపడానికి మా ఆర్థిక వనరుల్లో ప్రతి రూపాయినీ సద్వినియోగం చేశాం. ఒక రాష్ట్ర ప్రభుత్వంగా శక్తి మేరకు మేం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం మరింత సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నా.

ప్రతి రూపాయి పునర్నిర్మాణానికే..

ఎనిమిదేళ్ల క్రితం తగిలిన అతిపెద్ద గాయం నుంచి మా రాష్ట్రం ఇంకా కోలుకోలేదు. మా గాయాలు మానేలా, మా రాష్ట్రం జాతీయ స్రవంతితో కలసి అభివృద్ధి చెందడానికి వీలుగా విశాల హృదయంతో మీరు కేటాయించే ప్రతి సంస్థ, అదనంగా ఇచ్చే ప్రతి రూపాయి ఏపీ పునర్నిర్మాణానికి గొప్పగా ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని ఏపీ కోసం చేసే ఏ మంచి పనైనా రాష్ట్ర ప్రజానీకం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది. కేంద్ర ప్రభుత్వంతో గానీ, ప్రత్యేకంగా ప్రధాని మోదీతో గానీ మా అనుబంధం పార్టీలకు, రాజకీయాలకతీతం. ఏపీకి, రాష్ట్ర ప్రజలకు గత ప్రభుత్వాలు చేసిన అన్యాయాలను ఇక్కడి ప్రజలు గుర్తు పెట్టుకున్నారు.



సభా వేదికపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటామంతి



ప్రధాని మోదీకి జ్ఞాపికను అందిస్తున్న సీఎం జగన్

డీజీపీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందన

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని సీఎం జగన్ శనివారం అభినందించారు. విశాఖలో ప్రధాని రెండు రోజుల పర్యటన సందర్భంగా డీజీపీ.. సీనియర్ ఐపీఎస్‌ల నేతృత్వంలో పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టారు. డీజీపీ పర్యవేక్షణలో తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని నగర పర్యటన, రోడ్ షోకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలు హాజరైనా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖను సీఎం అభినందించారని డీజీపీ కార్యాలయం వెల్లడించింది.

విద్యుదుత్పత్తితో 'శ్రీశైలం'ను ఖాళీ చేస్తున్న తెలంగాణ

- ఆరు రోజుల్లోనే 22 టీఎంసీల నీరు దిగువకు
- రిజర్వాయర్‌లో వేగంగా తగ్గుతున్న నీటిమట్టం
- ఏపీ లేఖలు రాసినా పట్టించుకోని ఆ రాష్ట్ర జెన్‌కో

కర్నూలు సిటీ: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహం మందగించింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ జెన్‌కో శ్రీశైలం ప్రాజెక్టు పవర్ హౌస్‌లో నిరంతరం విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని నాగార్జున సాగర్‌లోకి వదిలేస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం రోజురోజుకు తగ్గిపోతుండడంతో రాయలసీమ జిల్లాల్లోని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు దిగువన ఉన్న నాగార్జున సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589.30 అడుగుల నీటి నిల్వ ఉంది. అదే విధంగా పులిచింతల ప్రాజెక్టులోనూ 99 శాతం నీటి నిల్వలు ఉన్నాయి. ప్రకాశం బ్యారేజీలో 3.07 టీఎంసీలకుగాను పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఈ రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్న సమయంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఎలాంటి విద్యుదుత్పత్తి చేయకూడదు. కానీ ఆరు రోజుల్లోనే తెలంగాణ జెన్‌కో అధికారులు ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సుమారుగా 22 టీఎంసీల నీటిని దిగువకు వదిలేశారు. శ్రీశైలం డ్యామ్‌లో తగినంత నీటి మట్టం ఉంటేనే తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ, అవుకు రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేసి వాటి కింద రబీ ఆయకట్టుకు నీరందించే వీలుంది. శ్రీశైలంలో ప్రస్తుతం నీటి మట్టం 878.40 అడుగులుగా ఉంది. నీటి మట్టం 854 అడుగులకు తగ్గితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని తీసుకోవడం వీలుపడదు.

మూడుసార్లు లేఖలు రాశాం

శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు తగ్గుతున్న మాట వాస్తవమే. తెలంగాణ జెన్‌కో అధికారులు ప్రాజెక్టు ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరాయంగా విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని దిగువకు వదిలేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిలిపి వేయాలని ఇప్పటికే మూడుసార్లు ఈఎన్‌సీ ద్వారా కేఆర్‌ఎంబీకి లేఖలు రాశాం. అయినా ఆపడం లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా అవసరమైన నీటిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీటి లభ్యతను బట్టి వీలైన చోట్ల మాత్రమే రబీ ఆయకట్టు సాగుపై ఆలోచనలు చేస్తున్నాం. – కబీర్ బాషా, జలవనరులశాఖ, సీఈ

ప్రధాని రోడ్డు షో సక్సెస్: సోము వీర్రాజు

సాక్షి, విశాఖపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్డు షో విజయవంతమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. విశాఖలో శనివారం ప్రధాని బహిరంగ సభ అనంతరం వీర్రాజు నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఉత్తరాంధ్ర ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ప్రధాని రోడ్డు షోను విజయవంతం చేసిన ఇన్‌చార్జిలు, వివిధ విభాగాల బాధ్యులను ఆయన అభినందించారు. ప్రధాని మోదీతో కోర్ కమిటీ సమావేశంలో జరిగిన చర్చ, రాజకీయ అంశాల ఆధారంగా భవిష్యత్తులో పార్టీ ప్రగతిపై నేతలతో ఆయన చర్చించారు. వివిధ అంశాలపై వీర్రాజు పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు.

ఏపీ చరిత్రలో ఇలాంటి సభ జరగలేదు: విష్ణుకుమార్ రాజు

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఎన్నడూ ఇలాంటి భారీ బహిరంగ సభ జరగలేదని, ఇకపై జరగబోదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సభని అత్యద్భుతంగా విజయవంతం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏర్పాట్లలో కీలకంగా వ్యవహరించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు.

ప్రధాని సభ అత్యద్భుతం: జీవీఎల్ నరసింహారావు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): విశాఖలో ప్రధాని సభ అత్యద్భుతంగా జరిగిందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రధాని విశాఖ పర్యటన విజయవంతమైందని.. ఊహించిన దానికంటే ప్రజలు అత్యధికంగా హాజరవడంతో ఏయూ గ్రౌండ్ కిక్కిరిసిపోయిందన్నారు. మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ వేలాది మంది సభ బయట ఉండిపోయారని, ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో సభాస్థలికి రాలేకపోయారన్నారు. విశాఖలో ప్రధాని మోదీ పర్యటన గురించి ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు.

ప్రధానితో ఏం మాట్లాడారో పవన్ చెప్పాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్



సాక్షి, అమరావతి: ప్రధాని మోదీని కలిసిన పవన్ కల్యాణ్ భవిష్యత్‌లో రాష్ట్రానికి మంచి జరుగుతుందని చెబుతున్నారని.. అసలు ఆ సమావేశంలో పవన్ ఏం మాట్లాడారో చెప్పాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలకు హాజరయ్యేందుకు బీవీ రాఘవులు శనివారం విజయవాడ వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తనను పిలిపించుకుని ప్రధాని మాట్లాడారని చెబుతున్న పవన్... ఆ వివరాలను చెప్పాలన్నారు. వారి కలయిక వ్యక్తిగత రహస్యమైతే చెప్పనవసరం లేదన్నారు.

పవన్, కారు డ్రైవర్‌పై కేసు నమోదు

బాధ్యతారహితంగా కారు నడిపారని బాధితుడి ఫిర్యాదు



విశాఖలో శుక్రవారం రాత్రి మోదీని సన్మానించి నమస్కరిస్తున్న పవన్



విశాఖ బీచ్‌లో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి, విశాఖపట్నం/తాడేపల్లిరూరల్/కొమ్మాది (భీమిలి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, ఆయన కారు డ్రైవర్‌పై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 5వ తేదీన ఉదయం గుంటూరు జిల్లా తెనాలి మారీస్‌పేటకు చెందిన శివకుమార్ ఇప్పటం నుంచి బైక్‌పై బైపాస్ రోడ్‌కు వస్తున్నారు. అదే సమయంలో పవన్‌కళ్యాణ్ కారుపై కూర్చొని ఉండగా.. కొంతమంది ఆ కారుకు వేలాడుతూ ఇప్పటం వైపు దూసుకొచ్చారు. దీంతో శివకుమార్ కిందపడిపోయాడు. పవన్‌కళ్యాణ్, ఆయన డ్రైవర్ రాష్ డ్రైవింగ్ కారణంగా తనకు ప్రమాదం జరిగిందంటూ శుక్రవారం శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాడేపల్లి పోలీసులు ఐపీసీ 336, రెడ్ విత్ 171, 279/ఎంబీ కింద కేసు నమోదు చేశారు.

రుషికొండ పనులను పరిశీలించిన పవన్: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీర ప్రాంతంలో పర్యటించారు. ముందుగా రామానాయుడు స్టూడియో ఎదురుగా ఉన్న బీచ్‌లో నాదెండ్ల మనోహర్‌తో కలిసి కొద్దిసేపు విహరించారు. అక్కడకు వచ్చిన మత్స్యకారులతో మాట్లాడారు. అనంతరం రుషికొండలో గల కొండపై జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వెళ్లారు. కొండ చుట్టూ బారికేడ్లు ఉండటంతో బయట నుంచే కొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. అయితే ఎవరికి సమాచారం లేకుండా పవన్ వెళ్లడం చర్చనీయాంశమైంది.

పార్టీ ఇన్‌చార్జిలతో పవన్ భేటీ: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శనివారం పార్టీ ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. విశాఖ నగరంలో తాను బస చేసిన హోటల్లో ఆయన వీరితో కాసేపు సమీక్షించారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటన, తనతో భేటీ తదితర అంశాలను చర్చించారు. భవిష్యత్తు ప్రణాళికపై త్వరలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా, విజయనగరం శివారు గుంకలాంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలోని ఇళ్లను ఆదివారం పవన్ పరిశీలించనున్నారు.

సీఎం ప్రసంగం.. మంచి మెసేజ్‌లా ఉంది

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్న జగన్ మాట ఘనం

- అది మంచి నాయకత్వం, ఉత్తమ పరిపాలన విధానానికి నిదర్శనం
- భారీగా తరలివచ్చిన ఉత్తరాంధ్ర వాసులకు ధన్యవాదాలు
- రామోజీది కండ కావరం.. పవన్‌ది అజ్ఞానం
- రుషికొండపై ఈనాడులో విష ప్రచారం
- విశాఖ నగరం, ఉత్తరాంధ్రపై కక్ష, అక్కసు
- మీడియాతో మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స, పక్కన అమర్‌నాథ్, ఎంవీవీ సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: తమకు రాజకీయాలు, పార్టీలు ముఖ్యం కాదని రాష్ట్ర శ్రేయస్సు మాత్రమే ముఖ్యమని సీఎం వైఎస్ జగన్ స్పష్టంచేసిన తీరు మంచి నాయకత్వం, ఉత్తమ పరిపాలన విధానమని.. అలాగే, సీఎం ప్రసంగం రాబోయే తరాలకు మంచి మెసేజ్ ఇచ్చినట్లుగా ఉందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. ప్రభుత్వ విధానాన్ని, పెండింగ్ సమస్యలను ఆయన స్పష్టంగా.. క్లుప్తంగా వివరించి వాటన్నింటినీ పరిష్కరించాలని ప్రధానిని కోరారన్నారు. తాను ఎందరో సీఎంల వద్ద పనిచేసినప్పటికీ ఈ రోజు ముఖ్యమంత్రి ప్రసంగం తీరుచూశాక జగన్‌పట్ల ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి బొత్స మీడియాతో మాట్లాడారు. విశాఖలో ప్రధాని బహిరంగ సభకు తరలివచ్చిన లక్షలాది మంది ఉత్తరాంధ్ర వాసులందరికీ పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పవన్‌ది అజ్ఞానం.. రామోజీ కండ కావరం

నిన్న ఇక్కడికి ఒక సెలబ్రిటీ వచ్చి.. తనను ప్రధాని కలవమన్నారని చెప్పారు. ప్రధానిని కలిసొచ్చిన తర్వాత మీడియాతో.. తాను ప్రభుత్వంపై ఫిర్యాదు చేశానని వెల్లడించారు. అంతేకానీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇవి అడిగానని చెప్పలేదు. అలా చెప్పిఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ, పవన్ ఒక అజ్ఞానిలా ప్రవర్తించాడు. ఇక వారికి వత్తాసు పలికే ఈనాడు పత్రిక 'కొండ కావరం' అని రుషికొండపై మరీ దిగజారి వార్త రాసింది. అది నిజానికి రామోజీరావుకు, ఈ పత్రికకు ఉన్న కండ కావరం. ఉత్తరాంధ్ర భాషలో దానిని ఒళ్లు బలుపు అంటారు. రాష్ట్ర ప్రభుత్వం మీద, ఉత్తరాంధ్రపైనా ఎంత అక్కసు, కక్ష ఉందో ఈ వార్త ద్వారా అర్థమవుతోంది.

రాష్ట్ర ప్రయోజనాలే సీఎంకు ముఖ్యం

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని సీఎం జగన్ చెబుతుంటారు.. అందుకు తగ్గట్లే ఆయన వ్యవహరిస్తున్నారు. సీఎంకి రాష్ట్ర ప్రయోజనాలు చాలా ముఖ్యం. ఆయన ఉత్తరాంధ్ర అభివృద్ధిని కూడా కాంక్షిస్తున్నారు. అభిమానం ఉండబట్టే విశాఖ సభకు లక్షలాది మంది తరలివచ్చారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులు, పచ్చ మీడియా వాస్తవాలు గుర్తించి ప్రజల ఆకాంక్షను గౌరవించాలి.

రుషికొండపై నిర్మాణాల్లో తప్పేమిటి?

రుషికొండపై ఎందుకు వారు తప్పుడు కథనాలు రాస్తున్నారు? రుషికొండ మీద ప్రభుత్వం కొన్ని భవనాలు కడుతోంది. అందులో తప్పేముంది? రుషికొండ మీద గతంలోనే గెస్ట్‌హౌస్ ఉంది. శిథిలమైన దాన్ని తొలగించి ఇప్పుడు కొత్త భవనాలు కడుతుంటే ఏమిటి తప్పు? ప్రభుత్వం ఏమైనా రామోజీ ఫిల్మ్‌సిటీ మాదిరిగా వేల ఎకరాల్లో భవనాలు కడుతోందా? సుమారు రూ.11 వేల కోట్ల పనులకు సంబంధించి శంకుస్థాపనలు జరిగాయి. ఇంకా అభివృద్ధి పనులు జరగాలని ఆలోచించాలే తప్ప ప్రభుత్వం మీద ఫిర్యాదు చేయడమేమిటి?

జగనన్న లేఅవుట్ చూస్తాడట.. చూడనివ్వండి

పవన్‌కళ్యాణ్ ఆదివారం మా జిల్లా విజయనగరానికి వెళ్తాడట. జగనన్న లేఅవుట్ కాలనీ చూస్తాడట. చూడనివ్వండి. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద లేఅవుట్ అది. సుమారు 400 ఎకరాల్లో 12 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వారిలో 10 వేల మందికి ఇళ్లు కూడా మంజూరు చేశాం. పనులు సాగుతున్నాయి. అది కాలనీ కాదు. ఒక ఊరు అని చెప్పాలి. 10 వేల ఇళ్లు అంటే దాదాపు 40 వేల జనాభా. అంటే ఒక పట్టణంలా ఉంటుంది. మా ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే. రాష్ట్రంలో సొంత ఇల్లులేని ఒక్క నిరుపేద కూడా ఉండకూడదు. కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

ప్రధాని విశాఖ పర్యటన శుద్ధ దండగ

- టీడీపీ నేత బండారు విమర్శ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన కోసం రూ.కోట్లు ఖర్చు చేశారని, కానీ, మోదీ రాష్ట్రానికి ఎలాంటి హామీలు ఇవ్వలేదని మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, రైల్వే జోన్, ప్రత్యేక హోదాపై ప్రధాని స్పందించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రధాని పర్యటన శుద్ధదండగని అన్నారు.



యథార్థముగా ప్రవర్తించువాడు రక్షింపబడును.
మూర్ఖ ప్రవర్తన గలవాడు హఠాత్తుగా పడిపోవును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం
తిథి: బ.పంచమి రా.10.04 వరకు తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.8.54 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.10.09 నుండి 11.56 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.50 నుండి 4.36 వరకు, **అమృతఘడియలు:** లేవు

సూర్యోదయం : 6.07
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఏక్‌నాథ్ షిందే (మహారాష్ట్ర సీఎం) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"సంజయ్ రౌత్ జైలు నుంచి బయటికి వచ్చాడట.." అన్నారు దీపక్ కేసర్కర్!

ఆ మాటను ఆయన నాకు బాగా సమీపానికి వచ్చి, మెల్లిగా... నా రెండు చెవుల్లో ఒక చెవికి మాత్రమే వినిపించేలా చెప్పారు.

అప్పుడా సమయంలో చంపాసింగ్ థాపా, మోరేశ్వర్ రాజే నా పక్కన ఉన్నారు. ఒకప్పుడు బాల్ ఠాక్రేజీ పక్కన ముప్పై ఏళ్ల పాటు ఉన్నవాళ్లు.. ఇప్పుడు నెలన్నరగా నా పక్కన ఉంటున్నారు.

ఠాక్రేజీ జీవించి ఉండగా ఆయనకు వచ్చే ఫోన్‌లను థాపా, రాజేలే లిఫ్ట్ చేసేవాళ్లు. ఠాక్రేజీ చెప్పదలచుకుంది కూడా వాళ్లే ఫోన్‌లో అవతలి వైపునకు బట్వాడా చేసేవాళ్లు.

"షిందేజీ, అదేంటంటే.. " అంటూ, వాళ్లిద్దరి వైపు చూస్తూ ఆగారు దీపక్.

"పర్లేదు చెప్పండి దీపక్‌జీ. ఠాక్రేజీ దగ్గర నమ్మకంగా ఉన్న మనుషులు ఆయన కొడుకు ఉద్ధవ్ ఠాక్రే వైపు వెళ్లకుండా మనవైపు ఉండేందుకు వచ్చారంటే.. సంజయ్ గురించే కాదు, ఉద్ధవ్ గురించి కూడా మనం



నిస్సంకోచంగా మాట్లాడుకోవచ్చు.." అన్నాను.

"షిందేజీ! సంజయ్ రౌత్‌ని చూస్తుంటే ఉద్ధవ్ ఠాక్రే కోసం ఏం చేయడానికైనా సిద్ధమై అతడు బెయిల్ సంపాదించినట్లుగా నాకు అనిపిస్తోంది.." అన్నారు దీపక్.

"అతడేమీ దేశభక్తుడు కాదు కదా దీపక్‌జీ.. ఏం చేయడానికైనా సిద్ధమవడానికి.." అని నవ్వాను.

"కానీ షిందేజీ, అతడి మౌనం చూస్తుంటే దేశభక్తుడే నయం అనిపించేలా ఉన్నాడు.." అన్నారు దీపక్!

దీపక్ మునుపెన్నడూ అంత హెచ్చరికగా మాట్లాడ్డం నేను వినలేదు! నా మంత్రివర్గంలో సీనియర్ మినిస్టర్ ఆయన. నాలుగు మినిస్ట్రీలను నడిపిస్తున్నారు. నా కన్నా పదేళ్లు పెద్దవారు.

"దేశభక్తుడిని సైతం జైలు జీవితం మామూలు మనిషిగా మార్చేస్తుందని విన్నాను దీపక్‌జీ! కానీ మీరేం చెబుతున్నారంటే.. జైలుకు వెళ్లిన సంజయ్ రౌత్ అనే ఒక మామూలు మనిషి దేశభక్తుడిగా మారి, జైలు బయటికి వచ్చేశాడని!! అదెలా సాధ్యం?" అని అడిగాను.

"జైలు నుంచి బయటికి రాగానే సంజయ్ రౌత్ నేరుగా సెంట్రల్ ముంబైలోని సిద్ధి వినాయక టెంపుల్‌కి వెళ్లాడు షిందేజీ! ఆ తర్వాత అతడు సౌత్ ముంబైలోని హనుమాన్ టెంపుల్‌కి వెళ్లాడు. తర్వాత శివాజీ పార్క్‌లోని బాల్ ఠాక్రే మెమోరియల్‌కి వెళ్లాడు. ఆ తర్వాతే ఇంటికి వెళ్లాడు! సాయంత్రం 6.50 కి ఆర్థర్ రోడ్ జైలు నుంచి అతడు విడుదలైతే.. నాహర్‌లోని తన ఇంటికి వెళ్లేసరికి రాత్రి 10.20 అయింది. ఈ మూడున్నర గంటల వ్యవధిలో అతడు మాట్లాడిన సమయం తక్కువ. మౌనంగా ఉన్న సమయం ఎక్కువ. అదే నాకు ఆందోళన కలిగిస్తోంది షిందేజీ.. " అన్నారు దీపక్.

"ఆందోళన దేనికి దీపక్‌జీ?!" అన్నాను.

"దేనికంటే.. అతడు మాట్లాడిన ఆ తక్కువ సమయంలోనే ఉద్ధవ్‌తో చాలా ఎక్కువ మాట్లాడాడు. మౌనంగా ఉన్న ఆ ఎక్కువ సమయంలోనే మన గురించి చాలా తక్కువగా మౌనం వహించాడు.." అన్నారు దీపక్.

"అర్థం కాలేదు దీపక్‌జీ.." అన్నాను.

"మూడు నెలలు జైల్లో ఉండి వచ్చాక కూడా ఉద్ధవ్‌దే రియల్ శివసేన అని అతడు అంటున్నాడు షిందేజీ! అంటే మనది రియల్ శివసేన కాదనీ, మీరు రియల్ ముఖ్యమంత్రి కాదనే కదా అతడి ఉద్దేశం!" అన్నారు దీపక్!

చంపాసింగ్ థాపా, మోరేశ్వర్ రాజే మాకు కాస్త దూరంగా నిలబడి ఉన్నారు.

నవంబర్ 17న ఠాక్రేజీ 10వ వర్ధంతి. ఆ సంస్మరణ సభలో వాళ్లిద్దరి చేత మాట్లాడిస్తే?!

వాళ్లే చెబుతారు.. రియల్ శివసేన ఎవరిది కాదో, రియల్ సీఎం ఎవరు కారో?!

దీపక్ నా వైపే చూస్తూ ఉన్నారు.

"దీపక్‌జీ! అసలైన దాన్ని ఎవరూ మార్చలేరు. సంజయ్ రౌత్ అనే ఒక దేశభక్త ఎంపీ మార్చగలడా?" అన్నాను నవ్వుతూ.

'సేనా'పతి రాయబారం!



జనతంత్రం



వర్ధెల్లి మురళి

భారత ప్రధానమంత్రి తెలుగు రాష్ట్రాల్లో పర్యటించారు. ఇది ఈ వారపు ప్రధాన కథా స్రవంతి. ఈ స్రవంతిలోకి కొన్ని ఉపకథల్లాంటి పిల్ల కాలువలూ వచ్చి చేరాయి. తెలంగాణకు సంబంధించినంతవరకు ఉత్కంఠ గానీ, ఉపకథలు గానీ ఏమీ లేవు. ప్రధానమంత్రికి అనుకున్నట్టుగానే ముఖ్యమంత్రి స్వాగతం చెప్పలేదు. ఆయన సభలో పాల్గొనలేదు. ఇది ప్రోటోకాల్ ఉల్లంఘనేనని షరా మామూలుగానే లోకల్ బీజేపీ విమర్శించింది. ఈ ఉల్లంఘన మొదటిసారి కాదు. ఇది నాల్గోసారి! కనుక ఎవరూ ఆశ్చర్యపడలేదు. తెలంగాణలో బీజేపీ – టీఆర్ఎస్ శత్రు శిబిరాలుగా చీలిపోయాయి. ఆ శత్రుత్వం శ్రుతి మించి సంప్రదాయాలను కూడా మింగేసింది. ప్రధానమంత్రి కూడా తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

ఇక ఆంధ్రప్రదేశ్ సంగతి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇన్‌సైడ్ స్టోరీలంటూ ఏమీ ఉండవనేది అందరికీ తెలిసిన విషయం. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తత్వానికి తగ్గట్టుగానే అంతా సాఫ్ సీదా. ఓపెన్ ససేమ్! బ్యాక్‌డోర్ డిప్లొమసీ అంటూ ఏమీ ఉండదు. సాక్షాత్తూ ప్రధాని సమక్షంలోనే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కుండబద్దలు కొట్టడమే ఇందుకు నిదర్శనం. 'కేంద్రంతో మా అనుబంధం రాజకీయాలకు అతీతమైనది. రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మాకు మరో ఎజెండా లేదని, ఉండబోద'ని జగన్ నిర్మొహమాటంగా ప్రకటించారు.

అధికారిక కార్యక్రమమైనప్పటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. తమకు గుర్తున్నంతవరకూ విశాఖ నగరంలో జరిగిన అతిపెద్ద బహిరంగ సభ ఇదేనని వయోధిక రాజకీయ పరిశీలకులు చెప్పారు. సభాస్థలి కిక్కిరిసిపోగా రోడ్లపై కూడా జనం పెద్దసంఖ్యలో నిలిచిపోయారు. కనీసం మూడు నుంచి మూడున్నర లక్షల మంది ఈ సభకు వచ్చి ఉండొచ్చనే అంచనా వెలువడింది. ఉత్తరాంధ్ర ప్రాంతం మీద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న పట్టుకు ఈ సభ అద్దంపట్టింది. ప్రజా వెల్లువను చూసి ప్రధాని సంతోషపడినట్లు వేదిక మీదున్నప్పుడు ఆయన ముఖ కవళికలే చాటి చెప్పాయి. పార్టీలు వేరైనప్పటికీ ఈ దేశ ప్రధానమంత్రిని అపూర్వంగా ఆదరించి, జయజయధ్వానాలతో కూడిన తమ ఆతిథ్య విశిష్టతను ఉత్తరాంధ్ర గడ్డ చాటిచెప్పింది. వారి ఆతిథ్యానికి తగ్గట్టుగా మోదీ కూడా విశాఖపట్టణం ఔన్నత్యాన్ని కొనియాడారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో పిల్లకాలువలూ, పిట్టకథల వంటి కొన్ని చిన్నచిన్న కదలికలు ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష శిబిరంలో కనిపించాయి. ప్రధానమంత్రి విశాఖపట్నం చేరుకొని తన బసకు చేరుకున్న వెంటనే అక్కడ వేచివున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలుసుకున్నారు. జనసేన పార్టీ గత మూడేళ్ల నుంచి బీజేపీతో డేటింగ్ చేస్తున్నది. అటువంటప్పుడు రెండు పార్టీల నాయకులు కలిస్తే వింతేమున్నది? ఏ వింతా ఉండకూడదు. కానీ, ఒకపక్క బీజేపీతో పొత్తులో ఉంటూనే తెలుగుదేశం పార్టీని కూడా ఆయన ప్రేమిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగానే ఆయన కార్యక్రమాలు కూడా ఉంటున్నాయి. బీజేపీతో కంటే తెలుగుదేశంతోనే ఆయన ఎక్కువ సమన్వయంతో ఉంటున్నారు.

ఈ నేపథ్యంలోనే వైసీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వబోమని గతంలో పవన్ చేసిన ప్రకటనను ఒకసారి గుర్తుచేసుకోవాలి. బీజేపీ – టీడీపీ – జనసేన ఒక కూటమిగా ఏర్పడితే తప్ప వైసీపీని ఎదుర్కోవడం సాధ్యం కాదని దీని సారాంశం. వాస్తవానికి ఈ ప్రతిపాదన చంద్రబాబుది. తాను నేరుగా బీజేపీ పెద్దల ముందు ఉంచడానికి మొహం చెల్లదు కనుక ఈ కార్యాన్ని పవన్‌కు అప్పగించారు. మోదీతో భేటీలో 'హిజ్ మాస్టర్స్ వాయిస్' వినిపించడమే పవన్ కల్యాణ్‌కు నిన్నటి టాస్క్. బీజేపీ కండువా కప్పుకున్న టీడీపీ ఏజెంట్ల ద్వారా ఇప్పటికే ఈ విషయంలో కొంత లాబీయింగ్ జరిగింది. కానీ బీజేపీ అధిష్ఠానం బాబును నమ్మేందుకు సుముఖంగా లేదన్న సమాచారంతో పవన్ కల్యాణ్ మీద వారిని ఒప్పించే బాధ్యతను పెట్టినట్టు సమాచారం.

ఆంధ్రప్రదేశ్ బీజేపీలో కూడా ఒక వర్గాన్ని టీడీపీకి అనుకూలంగా మాట్లాడేందుకు దువ్విపెట్టారు. సమయం రానే వచ్చింది. ప్రధానమంత్రి అధికారిక కార్యక్రమంపై విశాఖకు రావడాన్ని వారు ఉపయోగించుకున్నారు. ముందుగా అడిగిన మేరకు పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర బీజేపీ నాయకులకు విడివిడిగా ప్రధాని అపాయింట్‌మెంట్లు లభించాయి. ఈ రాయబారంలో పట్టువిడుపు లేకుండా వ్యవహరించడం కోసం పవన్ కల్యాణ్ మీద టీడీపీ ఒకరకమైన ఒత్తిడిని కూడా ప్రయోగించింది. ఆయన హైదరాబాద్ నుంచి బయల్దేరడానికి ముందే తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ఎల్లో ఛానళ్లకు ఒక లీక్ అందింది. లోకేశంబాబు జనవరి 27 నుంచి ఏపీలో పాదయాత్ర చేస్తారనేది ఆ లీకు. ఈ వార్తను హఠాత్తుగా ఈ సందర్భంలో 'లీకు'గా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎప్పుడైనా అధికారికంగానే ప్రకటించవచ్చు.

ఒక పార్టీ తరఫున ఎన్నికలకు ముందు ఒక నాయకుడు పాదయాత్ర చేస్తున్నాడంటే అతనే ఆ పార్టీకి సర్వసైన్యాధ్యక్షుడి కింద లెక్క. కూటమిలో చేరేందుకు పవన్ బీజేపీని ఒప్పిస్తే వ్యూహం మారవచ్చు. ఈ లీకు వార్తతో తమకు

ప్రధాని పర్యటన నేపథ్యంలో పిల్లకాలువలూ, పిట్ట కథల వంటి కొన్ని చిన్నచిన్న కదలికలు ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష శిబిరంలో కనిపించాయి. ప్రధానమంత్రి విశాఖపట్నం చేరుకొని తన బసకు చేరుకున్న వెంటనే అక్కడ వేచివున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలుసుకున్నారు. జనసేన పార్టీ గత మూడేళ్ల నుంచి బీజేపీతో డేటింగ్ చేస్తున్నది. అటువంటప్పుడు రెండు పార్టీల నాయకులు కలిస్తే వింతేమున్నది? ఏ వింతా ఉండకూడదు. కానీ, ఒకపక్క బీజేపీతో పొత్తులో ఉంటూనే తెలుగుదేశం పార్టీని కూడా ఆయన ప్రేమిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగానే ఆయన కార్యక్రమాలు కూడా ఉంటున్నాయి. బీజేపీతో కంటే తెలుగుదేశంతోనే ఆయన ఎక్కువ సమన్వయంతో ఉంటున్నారు.

ఈ నేపథ్యంలోనే వైసీపీ వ్యతిరేక ఓటును చీల నివ్వబోమని గతంలో పవన్ చేసిన ప్రకటనను ఒకసారి గుర్తుచేసుకోవాలి. బీజేపీ – టీడీపీ – జనసేన ఒక కూటమిగా ఏర్పడితే తప్ప వైసీపీని ఎదుర్కోవడం సాధ్యం కాదని దీని సారాంశం. వాస్తవానికి ఈ ప్రతిపాదన చంద్రబాబుది. తాను నేరుగా బీజేపీ పెద్దల ముందు ఉంచడానికి మొహం చెల్లదు కనుక ఈ కార్యాన్ని పవన్‌కు అప్పగించారు. మోదీతో భేటీలో హిజ్ మాస్టర్స్ వాయిస్ వినిపించడమే పవన్ కల్యాణ్‌కు నిన్నటి టాస్క్. బీజేపీ కండువా కప్పుకున్న టీడీపీ ఏజెంట్ల ద్వారా ఇప్పటికే ఈ విషయంలో కొంత లాబీయింగ్ జరిగింది. కానీ బీజేపీ అధిష్ఠానం బాబును నమ్మేందుకు సుముఖంగా లేదన్న సమాచారంతో పవన్ కల్యాణ్ మీద వారిని ఒప్పించే బాధ్యతను పెట్టినట్టు సమాచారం.

సంబంధం లేదని చెప్పవచ్చు. బీజేపీ లేకుండా వస్తే పవన్ కల్యాణ్‌కు ఉప సేనాపతి పదవే దక్కుతుందని అన్యాపదేశంగా చెప్పడం కావచ్చు. పవన్ కల్యాణ్ సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి బయల్దేరారు. సరిగ్గా అదే సమయానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రామోజీ ఫిలింసిటీలోకి ప్రవేశించారు.

పవన్ వైజాగ్ చేరుకుని తన హోటల్ విడిది నుంచి ప్రధాని బసచేసిన ఐఎన్ఎస్ చోళకు సుమారు 8 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. దాదాపు అంతసేపూ బాబు – రామోజీల సమావేశం కొనసాగింది. ఈమధ్యకాలంలో రాష్ట్ర బీజేపీ నేతలతోనూ, కేంద్ర స్థాయిలో ఉన్న కొందరు శ్రేయోభిలాషులతోనూ తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరిగినట్టు సమాచారం. అనుకున్న ప్రకారం ముందుగా పవన్ కల్యాణ్‌తోనూ, తర్వాత రాష్ట్ర బీజేపీ నేతలతోనూ ప్రధాని సమావేశమయ్యారు.

ఆ సమావేశాల్లో ఏం జరిగిందనే దానిపై ఎల్లో మీడియా విస్తృతమైన కవరేజీ ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉన్నదనీ, ప్రభుత్వమే కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదనీ, ఆర్థిక క్రమశిక్షణ లోపించిందనీ, ఇంకా ఇలాంటి అనేక ఆరోపణలు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధానమంత్రికి పవన్ కల్యాణ్ నివేదించినట్టు ఎల్లో మీడియా రిపోర్ట్ చేసింది. అన్ని ఆరోపణలకూ 'ఐ నో, ఐ నో' (నాకు తెలుసు) అంటూ ప్రధాని తలూపారట! పవన్ కల్యాణ్ ఆరోపణల చిట్టా విప్పినంతసేపూ (సుమారు పది నిమిషాలు) నాదెండ్ల మనోహర్ కూడా సమావేశంలోనే ఉన్నారు. ఆ తర్వాత ఆయన్ను బయటికి పంపించారు. అటు పిమ్మట మరికొంతసేపు ప్రధానితో పవన్ సమావేశం కొనసాగింది. మనోహర్ ఉన్నంతసేపు ఏం జరిగిందనే దానిపై చిలవలు పలవలు రాసిన ఎల్లోమీడియా ఆ తర్వాత భాగంపై మౌనం దాల్చింది.

ఆ తర్వాత రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సభ్యులతో ప్రధాని మాట్లాడారు. వారి మాటలు విన్నారు. సమావేశంపై ఎల్లో మీడియా ఇచ్చిన వివరాలనే పరిశీలిద్దాము. వైసీపీ ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలను ఎండగట్టాలని ప్రధాని సూచించారట. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా ప్రభుత్వంపై ఛార్జిషీట్లు వేసి ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారట. ఇంకా ఏమన్నారంటే... "రాజకీయాల్లో నిదానం అస్సలు పనికిరాదు. మనం వేగంగా ఉండకపోతే ఆ స్థానాన్ని మరో పార్టీ భర్తీ చేస్తుంది. మనకు మన పార్టీ ముఖ్యం. మరో పార్టీ కాదు. సమస్య చిన్నదా పెద్దదా అని చూడకుండా నిత్యం పోరాటం చేయాలి". ఈ వార్తాంశాల అంతస్సారాన్ని (between the lines) చదివితే ఏమర్థమవుతుంది? ఇంకో పార్టీ కోసం ఆలోచించడం మానేసి మీరే ప్రతిపక్షంగా ఎదగడం మీద దృష్టి పెట్టండని స్పష్టంగా ప్రధానమంత్రి రాష్ట్ర బీజేపీ కోర్ టీమ్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ అంతస్సారాన్ని గ్రహించగలిగితే మనోహర్ లేని సమయంలో పవన్‌తో మోదీ ఏం మాట్లాడి ఉంటారనేది అర్థమవుతుంది.

మనోహర్ నిష్క్రమించిన అనంతరం ప్రధానమంత్రి తన మన్‌కీ బాత్‌ను పవన్ కల్యాణ్‌కు ఉపదేశించారట. విశ్వసనీయ సమాచారం ప్రకారం, తెలుగుదేశం నమ్మదగిన పార్టీ కాదనీ, దాని స్థానంలో బీజేపీ – జనసేన కూటమి ప్రతిపక్షంగా ఎదగాలని చెప్పారట! పవన్ కల్యాణ్ ఇప్పటికే టీడీపీతో కమిట్ అయ్యారు కనుక ఈ మాటలు రుచించి ఉండకపోవచ్చు. అయినా గట్టిగా ఎదురుచెప్పలేని పరిస్థితి. సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్నప్పుడు ఆయన ముఖంలో ఈ సంకటస్థితి ప్రతిఫలించింది. ఈ మూడు పార్టీలు కలిస్తేనే వైసీపీతో పోరాడగలమని గట్టిగా నమ్ముతున్న పవన్‌కు నిన్నటి సమావేశం చేదు అనుభవాన్నే ఇచ్చిందని చెప్పవచ్చు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీతో జతగూడి ఉపసేనాపతి పదవి తీసుకోవడమా? లేక బీజేపీ – జనసేన కూటమికి సర్వసేనాధిపతిగా వ్యవహరించడమా? ఈ రెంటిలో ఏదో ఒకటి తేల్చుకోవాల్సిన పరిస్థితి పవన్‌ది. ఆయన నిస్సంశయంగా ఉపసేనాపతి పదవినే తీసుకోవచ్చు. ఆయన ట్రాక్ రికార్డే ఈ నిర్ధారణకు కారణం.

ఆయన విమర్శకులు ఆరోపిస్తున్నట్టుగానే ప్రతి రాజకీయ మలుపులోనూ పవన్ తెలుగుదేశం పార్టీకి ఉపకరించే విధంగానే వ్యవహరిస్తున్నారు. తన సోదరుడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత పవన్ కల్యాణ్ స్వయంగా జనసేను స్థాపించారు. 2014 ఎన్నికలకు ముందు ఇది జరిగింది. పార్టీ పెట్టినప్పటికీ ఆ ఎన్నికల్లో ఆయన పోటీకి దిగలేదు. తెలుగుదేశం – బీజేపీ కూటమిలో భాగస్వామిగా ఉండి ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. అప్పుడు దేశవ్యాప్తంగా వీస్తున్న 'మోదీ వేవ్' తోడవడంతో ఒక్క శాతం ఓట్ల తేడాతో కూటమి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్నినాళ్లూ జనసేన ఒక ప్రతిపక్షంగా కాదు గదా ఒక రాజకీయ పక్షంలా కూడా వ్యవహరించలేదు. వేలకోట్ల రూపాయల కిమ్మత్తు

మనోహర్ నిష్క్రమించిన అనంతరం ప్రధానమంత్రి తన మన్‌కీ బాత్‌ను పవన్ కల్యాణ్‌కు ఉపదేశించారట. విశ్వసనీయ సమాచారం ప్రకారం, తెలుగుదేశం నమ్మదగిన పార్టీ కాదనీ, దాని స్థానంలో బీజేపీ – జనసేన కూటమి ప్రతిపక్షంగా ఎదగాలని చెప్పారట! పవన్ కల్యాణ్ ఇప్పటికే టీడీపీతో కమిట్ అయ్యారు కనుక ఈ మాటలు రుచించి ఉండకపోవచ్చు. అయినా గట్టిగా ఎదురుచెప్పలేని పరిస్థితి. సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్నప్పుడు ఆయన ముఖంలో ఈ సంకటస్థితి ప్రతిఫలించింది. ఈ మూడు పార్టీలు కలిస్తేనే వైసీపీతో పోరాడగలమని గట్టిగా నమ్ముతున్న పవన్‌కు నిన్నటి సమావేశం చేదు అనుభవాన్నే ఇచ్చిందని చెప్పవచ్చు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీతో జతగూడి ఉపసేనాపతి పదవి తీసుకోవడమా? లేక బీజేపీ – జనసేన కూటమికి సర్వసేనాధిపతిగా వ్యవహరించడమా? ఈ రెంటిలో ఏదో ఒకటి తేల్చుకోవాల్సిన పరిస్థితి పవన్‌ది. ఆయన నిస్సంశయంగా ఉపసేనాపతి పదవినే తీసుకోవచ్చు. ఆయన ట్రాక్ రికార్డే ఈ నిర్ధారణకు కారణం. ఆయన విమర్శకులు ఆరోపిస్తున్నట్టుగానే ప్రతి రాజకీయ మలుపులోనూ పవన్ తెలుగుదేశం పార్టీకి ఉపకరించే విధంగానే వ్యవహరిస్తున్నారు.

చేసే అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చినా కిమ్మనలేదు. కాల్‌మనీ సెక్స్ రాకెట్ అభాగినులను కాటేస్తున్నా నోరు విప్ప లేదు. తాసిల్దార్ల దగ్గర్నుంచీ ఐఏఎస్‌ల వరకు మాట వినని అధికారులపై ఎమ్మెల్యేలు బహిరంగంగా దాడులు చేస్తున్నా, దూషిస్తున్నా ఖండించలేదు.

మళ్లీ 2019 ఎన్నికలు వచ్చేసరికి తెలుగుదేశం పార్టీ అనుకూల వైఖరినే జనసేన తీసుకున్నది. తెలుగుదేశం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు గంపగుత్తగా వైఎస్సార్‌సీపీకి పడకుండా చీల్చడం కోసం కమ్యూనిస్టులనూ, బీఎస్పీని కలుపుకొని జనసేన కూటమి కట్టింది. ఈ కూటమికి చీఫ్ ఆర్కిటెక్ట్ చంద్రబాబే నని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. బాబు అప్పగించిన ఈ టాస్క్‌లో పవన్ దారుణంగా విఫలమయ్యారు. ఈ వైఫల్యం పవన్ అహంపై బలమైన దెబ్బకొట్టింది. స్వయంగా తాను పోటీచేసిన రెండు స్థానాల్లోనూ ఓడిపోవడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు. తననూ, తన పార్టీనీ దారుణంగా ఓడించిన వైఎస్సార్‌సీపీపై పీకల్దాకా కోపాన్ని పెంచుకున్నారు. దాంతో తెలుగుదేశం పార్టీతో ఇంతకుముందు నుంచే కొనసాగుతున్న బంధం మరింత బలపడింది. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ ఇచ్చే అసైన్‌మెంట్ల ప్రకారమే ఆయన రాజకీయ కార్యక్రమాలు ఉంటున్నాయనే విమర్శలు వచ్చాయి.

ఇటీవల జరిగిన జసేన పార్టీ సమావేశంలో రాష్ట్ర మంత్రులను ఆవేశంతో ఊగిపోతూ తిట్టడం, ఇప్పటం గ్రామానికి కారు బానెట్‌పై కూర్చుని పూనకంతో వెళ్లడం, వైజాగ్‌లో విపరీత ప్రవర్తన ఇలా చెప్పుకుంటూ పోతే ఓ కొండవీటి చేంతాడు! ఇవన్నీ తెలుగుదేశం – జనసేనల ఫెవికాల్ బంధాన్ని దృఢంగా నిర్ధారిస్తున్నాయి. తమతోపాటు బీజేపీని తీసుకురావడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యపడకపోతే ఈ మిత్రద్వయం కమ్యూనిస్టుల తోడ్పాటు కోసం ప్రయత్నించవచ్చు. మునుగోడు తులాభారంలో ఎర్ర తులసిదళం పోషించిన పాత్ర అందరికీ తెలిసిందే. అయితే బీజేపీ వాళ్ల కాళ్లావేళ్లా పడి, వాళ్ల ఛీపొమ్మని ఛీదరించుకున్న స్థానంలోకి చంకలు గుద్దుకుంటూ వెళ్లడానికి కమ్యూనిస్టులు ఆ మాత్రం నిబద్ధత లేనివాళ్లా ఏమి?

vardhelli1959@gmail.com

నెహ్రూ ఆత్మకథకు పొంగిపోయిన రవీంద్రుడు

సందర్భం




డాక్టర్ దేవరాజు మహారాజు

జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడుపుతున్న దశలో 1934–35 మధ్య కాలంలో తన ఆత్మకథ (టువార్డ్ ఫ్రీడమ్) రాసుకున్నారు. బానిస సంకెళ్లు తెంచుకుని, దేశం స్వేచ్ఛ కోసం తపిస్తున్న దశలో తన అనుభవాల్ని నమోదు చేసుకున్నారు. నెహ్రూ జైల్లో ఉన్నప్పుడు ఆయన భార్య కమలా నెహ్రూ అనారోగ్యంతో మంచానపడి ఉన్నారు. కూతురు ఇందిర చిన్నపిల్ల. ఆమె ఆలనాపాలనా చూసేవారు ఎవరూ లేకపోవడం వల్ల, తరచూ రవీంద్రుడి శాంతినికేతన్‌కు పంపుతుండేవారు. అందరినీ, అన్నింటినీ ప్రేమగా చూసే లక్షణం ఆ బాలికలో ఉందని గ్రహించి రవీంద్రనాథ్ టాగూర్ ఆమెను 'ప్రియదర్శిని' అన్నారు. అప్పటి నుండి ఆమె ఇందిరా ప్రియదర్శిని అయ్యింది.

పండిట్ నెహ్రూకు సాహిత్యం, కళల పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమ జగద్విదితం. ఆయన ఆత్మకథను చదివి 'విశ్వకవి' ప్రశంసల వర్షం కురిపిస్తూ ఉత్తరం రాశారు. 1936 మే 31న శాంతినికేతన్ నుండి రవీంద్రుడు రాసిన ఉత్తరం ఇలా ఉంది: "ప్రియమైన జవహర్‌లాల్!

మీ పుస్తకం చదవడం ఇప్పుడే పూర్తి చేశాను. నిజంగా అది చాలా గొప్ప పుస్తకం. చదువుతూ ఎంతో చలించిపోయాను. మీరు సాధించిన విజయాలు తెలుసుకుని గర్వపడుతున్నాను. అన్నింటినీ మించి అట్టడుగున ప్రవహించే లోతైన మీ మానవత్వపు దృక్కోణం, సంక్లిష్టమైన చిక్కుముడులనన్నింటినీ విప్పుతూ ఉంది. వాస్తవాల్ని నిబ్బరంగా బహిర్గతం చేస్తూ ఉంది. ఇంతవరకూ సాధించిన విజయాలకు మించిన మహోన్నతమైన వ్యక్తిత్వం మీది – అనే విషయం తెలిసిపోతూ ఉంది. సమకాలీన స్థితిగతుల నుంచి నిజాయతీ అయిన ఒక నిఖార్సయిన మీ వ్యక్తిత్వం గోచరిస్తూ ఉంది."

సాహిత్యకారుడు అయిన నెహ్రూకు, అమృతా షేర్‌గిల్, సరోజినీ నాయుడు, ఫ్రెంచ్ సాహిత్యకారుడు రోమా రోలా వంటి దిగ్గజాల నుండి ఉత్తరాలు వస్తుండేవి. ఆ రోజుల్లో లేఖలు రాయడం కూడా ఒక కళగా పరిగణింపబడుతూ ఉండేది. జైలు నుండి నెహ్రూజీ తన కూతురికి రాసిన ఉత్తరాలు ప్రాముఖ్యం



రవీంద్రనాథ్ టాగూర్‌తో జవహర్‌లాల్ నెహ్రూ

సంతరించుకున్నాయి. ఆ ఉత్తరాల్లో సాహిత్య, సామాజిక, చారిత్రక, స్వాతంత్ర్యోద్యమ అంశాలు; దేశ, కాల పరిస్థితుల గురించి చర్చించారు. తరువాత కాలంలో ఆ లేఖలన్నీ పుస్తక రూపంలో వెలువడ్డాయి. పిల్లల పట్ల ఆయనకు గల ప్రత్యేకమైన శ్రద్ధ, ప్రేమల వల్ల ఎన్నో సంస్థలకు, ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. చాచా నెహ్రూగా శాశ్వతత్వం పొందారు. అందుకే ఆయన పుట్టినరోజు 14 నవంబర్‌ను పిల్లల దినంగా జరుపుకొంటున్నాం.

జాతీయ సంస్థల్ని ప్రారంభించి నిలబెట్టింది నెహ్రూజీ అయితే, అన్ని వ్యవస్థల్ని ధ్వంసం చేసింది మోదీజీ. తొలి ప్రధాని నుండి ఇటీవలి కాలం వరకు ఏ ప్రధానీ చేయని 'ఘన'మైన పనులు ఇప్పటి ప్రధాని చేశారు. పటేల్ విగ్రహం నెలకొల్పారు. దాన్ని ఐక్యతా విగ్రహం అన్నారు. బావుంది. ప్రారంభోత్సవ సభలో నేటి హోంమంత్రి కనబడలేదు. విగ్రహం తొలి హోంమంత్రిది కదా? పైగా వేల సంఖ్యలో మత గురువుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అసలది మతానికేం సంబంధం? ఏమీ మాట్లాడలేక వారసత్వ పాలనకు నెహ్రూయే కారణమని నిందిస్తారు. ఆయన మరణానంతరం జరిగిన సంఘటనలకు నెహ్రూ ఎలా బాధ్యులవుతారు?

ఆ రోజుల్లో ఆసేతు హిమాచలం స్వాతంత్ర్య సమర యోధులు లక్షలమంది ఉండి ఉంటారు. వారందరిలోకి నాయకత్వ లక్షణాలు, చురుకుదనం, విశాల భావాలు, అభ్యుదయ ధోరణి, విదేశాంగ విధానాల మీద పట్టు, చదువు, సంస్కారం అన్నీ పుణికిపుచ్చుకుని ఉన్నారు గనుక నెహ్రూ తొలి ప్రధాని కాగలిగారు. సుదీర్ఘ కాలం ఆ పదవిలో మనగలిగారు. మనిషిలో ఎంతో సంయమనం ఉంటేగానీ అలా నిలబడలేరు. ధనం, స్థాయి, స్థోమత ఏమీ లేనివాడు త్యాగం చేయడానికి ఏముంటుంది? కానీ, నెహ్రూజీకి ఇవన్నీ ఉండి కూడా అన్నింటినీ త్యజించి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడం గొప్ప. పైగా కశ్మీరీ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడై ఉండి, నిరీశ్వరవాది కావడం అంతకన్నా గొప్ప!

వ్యాసకర్త రచయిత, సామాజికాంశాల వ్యాఖ్యాత

స్మరిస్తే చాలు

పిల్లలకు, పెద్దలకు, యువతకు ఆదర్శంగా నిలిచే దైవం హనుమంతుడు. పిల్లలు ఏదైనా భీతి కలిగించే దృశ్యం చూసినప్పుడు పెద్దవాళ్ళు 'బుద్ధిర్బలం యశోధైర్యం' శ్లోకం చదువుకోమంటారు. హనుమ ధైర్యాన్ని గురించి ఆసక్తికరమైన కథలు చెప్పి భయం పోగొడతారు.

యువత తాము అనుకున్నవి నెరవేరనప్పుడు మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. ఆలోచనలు పెడదారి పడతాయి. అటువంటప్పుడు హనుమను స్మరిస్తే ఆత్మబలం వృద్ధి చెందుతుంది. హనుమ జీవన విధానం నుంచి నేటితరం ఎంతో స్ఫూర్తి పొందవచ్చు.

హనుమ బలానికి, ధైర్యానికి ప్రతీక. తన కంటే శత్రువు బలవంతుడైనా హనుమ ధైర్యాన్ని కోల్పోడు. తాను ఎంత గొప్ప బలవంతుడైనా, అనుకున్నవి ఎన్ని సాధించినా రామ భక్తుని గానే ఉండిపోయాడు. హనుమ వల్ల వినయం, విధేయత నేర్చవలసివుంది. తలచినంత మాత్రాన అంతులేని ధైర్యం, ఆత్మ విశ్వాసం అనే సంపదలను ప్రసాదించే విశిష్ట దైవం హనుమ.

రాత్రి నిద్రించే ముందు, ప్రయాణాలలో నిర్భయంగా ఉండటానికి హనుమను స్మరిస్తూ ఉండటం పరిపాటి. బుద్ధి, బలం, కీర్తి సొంతం చేసుకోవడానికి హనుమంతుని ధ్యానిస్తారు. ఎక్కడ రాముడుంటాడో, అక్కడ హనుమంతుడు ఉంటాడు. హనుమ ఎక్కడ ఉంటే అక్కడ మనోబలం ఉంటుంది. హనుమంతుడు మధుర భాషణుడు. తన భాషణా చాతుర్యంతో రాముని మనసుని గెలిచాడు. మంచి మాటతీరుకు, ప్రసంగకళకు హనుమ పెట్టింది పేరు. తరచూ అనారోగ్యాలు వేధిస్తున్నప్పుడు హనుమను ప్రార్థిస్తే తొలగుతాయనే నమ్మకం మనకు ఉంది. స్మరణ మాత్ర ప్రసన్నుడు స్మరిస్తే చాలు కోరినవి కురిపించే వరాల దేవుడు హనుమ.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా

రత్నగిరిపై భక్తజనసంద్రం



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు రత్నగిరికి తరలిరావడంతో సత్యదేవుని ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వ్రతమండపాలు, క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 90వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వ్రతాలు 9,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.కోటి ఆదాయం వచ్చినట్లు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆది, సోమవారాలు కూడా ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో సత్యదేవుని దర్శనం, వ్రతాలను తెల్లవారుజాము నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

శ్రీవారి దర్శనానికి 40 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఎస్‌ఎంసీ సర్కిల్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,104 మంది స్వామి వారిని దర్శించుకోగా, 32,351 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.4.66 కోట్లు భక్తులు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు దర్శనానికి 40 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. మరోవైపు తిరుమలలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు వీస్తున్నాయి. చలి తీవ్రత కూడా పెరగడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

విజయవాడ నుంచి హజ్ యాత్రకు అనుమతించాలి

కేంద్ర మంత్రిని కోరిన ఏపీ హజ్ కమిటీ చైర్మన్

సాక్షి, అమరావతి: విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు అనుమతించాలని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజామ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 2023లో హజ్‌యాత్రకు వెళ్లేవారిని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పంపేందుకు వీలుగా పాయింట్‌ను ప్రకటించాలని కోరారు. హజ్ యాత్రకు నెల ముందుగా ఏపీ హజ్ కమిటీ నుంచి ఒక అధికారిక బృందం మక్కా, మదీనా నగరాలకు వెళ్లి అక్కడి వసతిగృహాల్లో యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసేలా సౌదీ ప్రభుత్వ అనుమతిని ఇప్పించాలని కోరారు. ఏపీ హజ్ కమిటీ సభ్యులు ఇషాక్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

రవాణా రంగంపై గ్రీన్ ట్యాక్స్ తగ్గించాలి

లారీ ఓనర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రవాణా రంగంపై గ్రీన్‌ట్యాక్స్ తగ్గించాలని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న డీజిల్ ధరలతో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు.

బహుజనులకు సెంటు భూమిస్తే రాద్ధాంతమా?

776వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: వందల ఎకరాల భూములు రాయితీపై ప్రైవేటు వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలకు కేటాయించిన చంద్రబాబు.. పేదలకు సెంటు స్థలం ఇస్తామంటే ఏడుపుగొట్టు రాద్ధాంతం ఎందుకు చేస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 776వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ తమ స్వార్థ ప్రయోజనాల కోసమే బాబు అండ్ కో ఈ ప్రాంతంలో పేదలను తరిమికొట్టి తరతరాల ఆధిపత్యం కొనసాగించాలని చూస్తుందన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందని తప్పుడు కేసులు వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా సుంకిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



కాకినాడ జిల్లా వన్నెపూడిలోని గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గడప గడపకూ మన ప్రభుత్వం



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



అన్నమయ్య జిల్లా రాయచోటిలో జోరువానలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

'సంపాదన'లో సగం వారిదే

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

ఒక దేశం ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడానికి జీడీపీ (జాతీయ స్థూల ఉత్పత్తి) గణాంకాలు చూస్తాం. ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడంలో మరో కొలమానం వ్యక్తిగత సంపద విలువ. ప్రపంచవ్యాప్తంగా వ్యక్తిగత సంపదను లెక్కగట్టి ఏ దేశ పౌరులు ఎక్కువ సంపాదిస్తున్నారో, ఎవరు విలువైన ఆస్తులు కూడగడుతున్నారో తెలుసుకోవచ్చు. 'క్రెడిట్ సూయిస్' సంస్థ ఏటా గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ విడుదల చేస్తుంది. ఇటీవల 'గ్లోబల్ వెల్త్ రిపోర్ట్-2022' విడుదల చేసింది. ఇందులో 2021 సంవత్సరం గణాంకాలను పేర్కొంది. 2021 ఆఖరునాటికి ప్రపంచంలోని మొత్తం వ్యక్తిగత సంపద 463.6 లక్షల కోట్ల డాలర్లుగా అంచనా వేశారు. అందులో సగం అమెరికా, చైనా పౌరుల సొంతమని, మిగతా సగం అన్ని దేశాల పౌరుల వ్యక్తిగత సంపదగా నివేదిక పేర్కొంది. మొత్తం వ్యక్తిగత సంపదలో అమెరికా పౌరులకు 31.5 శాతం వాటా కాగా, తర్వాత స్థానంలో ఉన్న చైనా పౌరుల వాటా 18.4 శాతం. 3.1 శాతం వాటాతో మనదేశం ఏడో స్థానంలో నిలిచింది. టాప్-10లో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యూకే, ఫ్రాన్స్, ఇండియా, కెనడా, ఇటలీ, ఆస్ట్రేలియా ఉన్నాయి.



సంపద పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

క్రెడిట్ సూయిస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్‌ను పరిశీలిస్తే.. ప్రపంచంలోని 40 శాతం సంపద ఒక శాతం వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమైంది. 10 శాతం ధనికుల వద్ద 82 శాతం సంపద పోగుబడి ఉంది. ఎవరి దగ్గర సంపద ఉందని చెప్పడంకంటే.. ఎవరి దగ్గర లేదో చెప్పడం కూడా ముఖ్యమని నివేదిక రూపకర్త 'ఆంతోనీ షోరాక్' అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని 50 శాతం వ్యక్తులకు 1 శాతం సందప మాత్రమే ఉందనే విషయాన్ని నొక్కి చెప్పారు. సంపద అందరికీ సమానంగా ఉండటం ఊహకు అందని విషయం. కానీ నిరుపేదలకు వేగంగా సందప పంపిణీ జరిగితేనే అసలు సంపదకు అర్థం చేకూరుతుంది. అభివృద్ధి దిశగా సమాజం వేగంగా అడుగులు వేస్తుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రజా ప్రభుత్వాలకు నిజమైన అర్థం ఏదో రూపంలో సంపదను నిరుపేద వర్గాలకు అందించడమేననే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రపంచ వ్యక్తిగత సంపద దేశాల వారీగా వాటా..

దేశం	సంపదలో వాటా (లక్షల కోట్ల డాలర్లు)	శాతం
అమెరికా	145.8	31.5
చైనా	85.1	18.4
జపాన్	25.7	5.5
జర్మనీ	17.5	3.8
యూకే	16.3	3.5
ఫ్రాన్స్	16.2	3.5
భారత్	14.2	3.1
కెనడా	12.4	2.7
ఇటలీ	11.5	2.5
ఆస్ట్రేలియా	10.6	2.3
దక్షిణ కొరియా	10.1	2.2
స్పెయిన్	8.4	1.8
తైవాన్	5.9	1.3
నెదర్లాండ్స్	5.4	1.2
స్విట్జర్లాండ్	4.9	1.1
మిగతా దేశాలు	73.6	15.6
మొత్తం	463.6	100

నివేదికలో ముఖ్యాంశాలు..

- భారీ ఆర్థిక శక్తుల వద్దే వ్యక్తిగత సంపద కూడా కూడుతోంది. అమెరికా, చైనా కలిసి ప్రపంచంలోని వ్యక్తిగత సంపదలో సగం ఉండగా, ఆయా దేశాల జీడీపీ ప్రపంచ దేశాల జీడీపీతో పోలిస్తే కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రపంచంలోని అన్ని దేశాల జీడీపీలో అమెరికా వాటా 24 శాతం కాగా, వ్యక్తిగత సంపదలో 31.5 శాతం ఉండటం గమనార్హం. చైనా అలా లేదు. ప్రపంచ జీడీపీలో చైనా వాటా 19 శాతం, వ్యక్తిగత సంపదలో ఆ దేశం వాటా 18.4 శాతం. అంటే.. అమెరికాలో జీడీపీకంటే వ్యక్తిగత సంపాదన వాటా ఎక్కువ ఉంటే.., చైనాలో ఇది తక్కువ.
- ప్రపంచంలోని వ్యక్తిగత సంపదలో 75 శాతం కేవలం 10 దేశాల్లోనే ఉంది.
- దశాబ్దం క్రితం ప్రపంచ వ్యక్తిగత సంపదలో చైనా వాటా 9 శాతం ఉండగా, ఇప్పుడు రెట్టింపు అయింది.
- 10 లక్షల డాలర్లు, అంతకంటే ఎక్కువ సంపద ఉన్న వ్యక్తుల (మిలయనీర్ల) సంఖ్య 2021లో 7.9 లక్షలు. 2026 నాటికి ఈ సంఖ్య రెట్టింపై 16.23 లక్షలకు చేరుతుందని అంచనా.
- ప్రపంచ వ్యక్తిగత సంపద వాటాలో మన దేశం వాటా అంతగా పెరగలేదు. అయితే దేశంలో వ్యక్తిగత సంపదలో వృద్ధి నమోదవుతోంది. 2020తో పోలిస్తే 2021లో 12 శాతం వృద్ధి నమోదు చేసి 14.2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. మన దేశంలో ఒక్కో వ్యక్తికి ఉన్న సరాసరి సంపద విలువ 2000 సంవత్సరం నుంచి ఏటా 8.8 శాతం పెరుగుతోంది. 2021 ఆఖరుకు అది 15,535 డాలర్లకు చేరింది. అది ప్రపంచ సరాసరి వ్యక్తిగత సంపద (87,489 డాలర్లు)తో పోలిస్తే బాగా తక్కువ.
- ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 6.2 కోట్ల మంది మిలియనీర్లు ఉండగా, 2026 నాటికి వీరి సంఖ్య 8.75 కోట్లకు చేరుతుందని అంచనా.
- ప్రపంచంలోని డాలర్ మిలియనీర్లు మన దేశంలో ఒక శాతం ఉండగా, అమెరికాలో 39 శాతం మంది ఉన్నారు. చైనాలో 10 శాతం మంది, జపాన్, యూకే, ఫ్రాన్స్‌లో 5 శాతం చొప్పున, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియాలో 4 శాతం చొప్పున, ఇటలీ, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, స్పెయిన్‌లో 2 శాతం చొప్పున ఉన్నారు. తైవాన్, హాంకాంగ్, స్వీడన్‌లో ఒక శాతం చొప్పున ఉన్నారు. మిగతా 10 శాతం మంది ప్రపంచంలోని మిగిలిన దేశాల్లో ఉన్నారు.

'కృష్ణా'లో నీటి లభ్యత 2,048 టీఎంసీలే

- జలవనరులపై సీడబ్ల్యూసీ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడి
- 75 శాతం లభ్యత ఆధారంగా 'కృష్ణా'లో 2,060 టీఎంసీల లభ్యత ఉంటుందని తేల్చిన బచావత్ ట్రిబ్యునల్
- సీడబ్ల్యూసీ తాజా లెక్కల ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ తేల్చిన లభ్యత కంటే 12 టీఎంసీలు తక్కువ
- వరద రోజులు తగ్గడం.. గరిష్టంగా వచ్చిన వరదను ఒడిసి పట్టి మళ్లించే సదుపాయాలు లేకపోవడమే కారణం
- ఫలితంగా కడలిపాలవుతున్న కృష్ణా వరద జలాలు

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో ఏటా సగటున నీటి లభ్యత సామర్థ్యం 3,144.41 టీఎంసీలు ఉంటుందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇందులో వాడుకోదగినవి 2,048.25 టీఎంసీలు మాత్రమేనని తేల్చింది. 'కృష్ణా'లో 75 శాతం లభ్యత ఆధారంగా 2,060 టీఎంసీలు (పునరుత్పత్తి జలాలు 70 టీఎంసీలతో కలిపి 2,130 టీఎంసీలు)గా 1976లో బచావత్ ట్రిబ్యునల్ తేల్చింది. బచావత్ ట్రిబ్యునల్ లెక్కగట్టిన దానికంటే ప్రస్తుతం 'కృష్ణా'లో వాడుకోదగినవిగా సీడబ్ల్యూసీ తేల్చిన జలాలు 12 టీఎంసీలు తక్కువగా ఉండటం గమనార్హం. కృష్ణా నదిలో వరద



రోజులు తగ్గడం.. వరద వచ్చినప్పుడు ఒకేసారి గరిష్ఠంగా రావడం.. ఆ స్థాయిలో వరదను ఒడిసిపట్టి మళ్లించే సదుపాయాలు లేకపోవడంవల్ల కడలిలో కలిసే జలాల పరిమాణం అధికంగా ఉందని.. అందువల్లే 'కృష్ణా'లో వాడుకోదగిన జలాల పరిమాణం తగ్గుతోందని నీటిపారుదల రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశంలోని నదులలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ వార్షిక నివేదికను ఇటీవల విడుదల చేసింది. అందులో ముఖ్యాంశాలు ఏమిటంటే..

వాడుకోడానికి అవకాశం ఉన్నది 34.51 శాతమే

- దేశంలోని నీటి లభ్యతలో గంగా నది మొదటి స్థానంలో నిలిస్తే.. గోదావరి రెండో స్థానంలో ఉంది. 'కృష్ణా' మూడో స్థానంలోనూ.. మహానది, నర్మద నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. పెన్నా నది 15వ స్థానంలో నిలిచింది.
- హిమాలయ నదులు, ద్వీపకల్ప నదుల్లో ఏడాదికి సగటున 70,601.08 టీఎంసీల లభ్యత సామర్థ్యం ఉంది. ఇందులో వినియోగించుకోవడానికి అవకాశమున్నది 24,367.12 టీఎంసీలే(34.51 శాతం). వరదలను ఒడిసిపట్టి, మళ్లించే సామర్థ్యం లేకపోవడంవల్ల 65.49 శాతం (46,233.96 టీఎంసీలు) జలాలు కడలిలో కలుస్తున్నాయి.

పెన్నాలో జలరాశులు అపారం

ఇక పెన్నా నది వర్షఛాయ (రెయిన్ షాడో) ప్రాంతమైన కర్ణాటకలోని నందిదుర్గం కొండల్లో పురుడుపోసుకుని.. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల మీదుగా ప్రవహించి 597 కి.మీల దూరం ప్రవహించి నెల్లూరు జిల్లా ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. పెన్నా బేసిన్ 54,905 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. దేశంలో అతిపెద్ద నదుల్లో పెన్నాది 15వ స్థానం. ఈ నదిలో ఏటా సగటున నీటి లభ్యత సామర్థ్యం 389.16 టీఎంసీలని సీడబ్ల్యూసీ అంచనా వేసింది. ఇందులో వాడుకోదగిన జలాలు 243.67 టీఎంసీలని తేల్చింది. గత నాలుగేళ్లగా పెన్నా బేసిన్‌లో విస్తృతంగా వర్షాలు కురుస్తుండటం వల్ల నీటి లభ్యత పెరిగిందని నీటిపారుదల రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

- గంగా నది పరివాహక ప్రాంతం (బేసిన్) 8,38,803 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. గంగాలో నీటి లభ్యత సామర్థ్యం ఏటా 17,993.53 టీఎంసీలు ఉంటుంది. ఇందులో ప్రస్తుతానికి వినియోగించుకోవడానికి అవకాశమున్నది 8,828.66 టీఎంసీలు.
- అలాగే, గోదావరి బేసిన్ 3,12,150 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. ఇందులో నీటి లభ్యత సామర్థ్యం ఏడాదికి సగటున 4,157.94 టీఎంసీలు. ప్రస్తుతానికి వినియోగించుకోవడానికి అవకాశమున్నది 2,694.5 టీఎంసీలే.

మాతృమరణాల తగ్గింపు లక్ష్యం ఏపీలో పూర్తి

- కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అశోక్‌బాబు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్‌బాబు, కమిషనర్, నివాస్, డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం మాతృమరణాల తగ్గింపు (ఎంఎంఆర్) లక్ష్యాలను ఆంధ్రప్రదేశ్ చేరుకుందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అశోక్‌బాబు అన్నారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో 'న్యుమోనియా లేని బాల్యం' లక్ష్యంతో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత న్యుమోనియాకు చికిత్స అందించే నవజాత శిశు సంరక్షణ కేంద్రం, పిల్లల వార్డులను పరిశీలించారు. అనంతరం శుశ్రుత హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఏపీలో ఆశా సిబ్బంది చాలా చక్కగా పనిచేస్తున్నారని, అందువల్లే వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యాలను సాధించి దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన ఆరు వారాల్లోగా శిశువుకు హెల్త్‌పరంగా వైద్య సిబ్బంది సరైన సంరక్షణ ఇవ్వాలన్నారు. నవంబర్ 12న వరల్డ్ న్యుమోనియా డే పురస్కరించుకుని ఇప్పడి నుంచి ఫిబ్రవరి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. న్యుమోనియా సోకకుండా పిల్లలను ఏవిధంగా రక్షించాలి, సోకిన వారికి ఏవిధంగా వైద్యం అందించాలనే విషయాలను తెలియజేసే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, చైల్డ్ హెల్త్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్‌రావు, టీబీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, ఇమ్యూనైజేషన్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్‌దేవి, ఆర్‌బీఎస్‌కే స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ విషాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమానికి పెద్ద పీట

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీచరణ్

తిరుచానూరు: మహిళా శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన అంగన్‌వాడీ ఇన్‌చార్జి సూపర్‌వైజర్లకు మహిళా ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం నాల్గో రోజు మంత్రి ఉషాశ్రీచరణ్ హాజరై ప్రసంగించారు. సమగ్ర ప్రణాళికతో పౌష్టికాహారం అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ జయశ్రీ, మహిళా ప్రాంగణ అధికారి వాసంతి, సీడీపీవోలు సుధారాణి, పద్మజ పాల్గొన్నారు.

ఏనుగుదాడిలో రైతు మృతి

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కళ్లికోట గ్రామానికి చెందిన దాసరి గోవింద్ (48) అనే రైతు ఏనుగుదాడిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్ శుక్రవారం రాత్రి భోజనం చేసి వరి చేనుకు నీరుకట్టేందుకు పొలానికి వెళ్లాడు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా రోడ్డుపై ఒంటిరి ఏనుగుకు తారసపడడంతో ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రివేళ పార్వతీపురం నుంచి వస్తున్న కొంతమంది యువకులు రైతు మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య పోలమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

మంచి చేస్తుంటే చూసి ఓర్వలేరా?

- మా ఇళ్ల వద్ద ఫొటోలు ఎలా దిగుతారు?
- జనసేన నాయకులను నిలదీసిన లబ్ధిదారులు
- చేసేదిలేక తిరుగుముఖం
- కృష్ణాజిల్లా పెడన జగనన్న కాలనీలో ఘటన
- రాజమహేంద్రవరంలో పార్టీ అభిమానితో అసత్యాలు చెప్పించి షూటింగ్

పెడన/రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పక్షాన నిలబడి అర్హులకు స్థలాలిచ్చి, ఇళ్లను నిర్మిస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారా? అంటూ జనసేన నేతలను లబ్ధిదారులు నిలదీశారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గంలోని జనసేన నేతలు రామ్‌సుధీర్, రమాదేవి తదితరులు శనివారం ఉదయం పట్టణ శివారులోని పల్లోటి లేఅవుట్-2 వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారు. అదే సమయంలో అక్కడ ఇళ్లను నిర్మించుకుంటున్న పలువురు లబ్ధిదారులు ఫొటోలు ఎందుకు దిగుతున్నారని ప్రశ్నించారు. దీనిపై జనసేన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. ఇక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులకు, కౌన్సిలర్లకు మాట్లాడే పనిలేదని, మీకు ఇక్కడ ఏం సంబంధం అంటూ నల్లా నాగలక్ష్మి, షాహినాబేగంలను ప్రశ్నించారు. దీంతో వారిద్దరూ ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. 'మీరేం మాట్లాడుతున్నారు.. మేం ఎవరని ప్రశ్నిస్తున్నారేంటి? అసలు మీరెవరు? మా ఇళ్ల దగ్గరకు ఎందుకొచ్చారు? ఫొటోలు ఎందుకు దిగుతున్నారు? లబ్ధిదారులైన మమ్మల్ని ప్రశ్నిస్తున్నారేంటి' అంటూ ఎదురుతిరిగి గట్టిగా నిలదీశారు. దీంతో.. సమస్యలుంటే చెప్పాలని జనసేన నేతలు కోరారు.



పెడనలో లబ్ధిదారులను వేలుచూపిస్తూ బెదిరిస్తున్న జనసేన నేతలు, కార్యకర్త

సమస్యలేమి లేవని లబ్ధిదారులు గట్టిగా బదులివ్వగా చేసేది లేక వారు వెనుదిరిగారు. అనంతరం ఒకటో వార్డులోని పైడమ్మ లేఅవుట్ వద్దకు కూడా వారు వెళ్లి తాపీ పనివారితో వాగ్వాదానికి దిగారు. తోపులాట జరగడంతో స్థానికుల జోక్యంతో సద్దుమణిగింది.

రాజమహేంద్రవరంలో ఇలా..

మరోవైపు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొమ్మూరు టిడ్కో గృహ సముదాయం వద్ద కూడా జనసేన నేతలు ఓవరాక్షన్ చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అర్బన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు శనివారం ఉదయం టిడ్కో గృహ సముదాయంలోని కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడున్న మహిళలను ఉద్దేశించి జనసేన నేతలు 'మిమ్మల్ని ఇప్పుడే పిలిచారా అంటే.. వెంటనే ఆ మహిళలు తమకు ఆగస్టులోనే ఇళ్లు అందజేశారని, కానీ.. తామే ఇంకా దిగలేద'న్నారు. అయినా ఇళ్లను ఎందుకు అప్పగించలేదంటూ అధికారులతో జనసేన నేతలు వాదనకు దిగారు. అక్కడ కొద్దిసేపు నినాదాలుచేసి సీ-బ్లాకు వద్దకు వచ్చారు. అక్కడ ఆ పార్టీ అభిమాని లలితను ఆమె ఫ్లాట్ కాని జీఎఫ్8 వద్ద నిలబెట్టి సమస్యలున్నాయంటూ ఎలక్ట్రానిక్ మీడియాకు చెప్పించారు. తీరా చూస్తే ఇంటి ప్లాన్‌లోనే లేని బాల్కని కావాలని ఆమె సమస్యగా పేర్కొంది. ఆ తర్వాత.. ట్విట్టర్‌లో పెట్టేందుకు అంటూ మళ్లీ అనుశ్రీ సత్యనారాయణ అక్కడకొచ్చి లలితతో మళ్లీ అదే సమస్య చెప్పించి షూట్ చేశారు.

ప్రభుత్వాన్ని అప్రదిష్టపాల్జేస్తున్నారు



వారు స్థలాలివ్వరు. ఇచ్చిన వాటిని సక్రమంగా చూపడంలేదు. పక్కనే చెరువులను చూపి ఫొటోలు దిగుతూ చెరువుల్లో స్థలాలు ఇచ్చారంటూ టీవీలకు చెబుతున్నారు. ఇలా ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలని చూస్తున్నారు.

– నల్లా నాగలక్ష్మి, లబ్ధిదారురాలు, పెడన

వారికేంటి సంబంధం?



మా స్థలాల వద్దకు వచ్చి మీకు సంబంధంలేదని ఎలా అంటారు? పార్టీలకు అతీతంగా అందరికి ఇళ్ల స్థలాలిస్తే వీరికి వచ్చిన బాధ ఏమిటో? మరీ ఇంత అన్యాయంగా ఫొటోలు దిగి టీవీలకు ఫోజులిస్తుంటే వారిని ఏమనాలి?

– షాహినాబేగం, లబ్ధిదారురాలు, పెడన

చైనా కార్గో వ్యోమనౌక ప్రయోగం విజయవంతం



బీజింగ్: చైనా తాను సొంతంగా నిర్మిస్తున్న అంతరిక్ష కేంద్రానికి అవసరమయ్యే సామాగ్రిని పంపడం కోసం ప్రయోగించిన కార్గో వ్యోమనౌక టియాన్‌జూ–5 విజయవంతంగా నింగిలోకి దూసుకుపోయింది. హైనన్ దీవుల్లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్ సైట్ నుంచి ప్రయోగించిన ఈ వ్యోహనౌక నిర్దేశిత కక్ష్యలో ప్రవేశించిందని జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. అంతరిక్ష కేంద్రంలోని డాకింగ్, ఫాస్ట్ ఆటోమేటెడ్ రెండెజవస్ నిర్వహించనుంది. ఈ ఏడాది చివరి నాటికి అంతరిక్ష కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో చైనా ముందడుగు వేస్తోంది.

న్యాయవ్యవస్థలో పురుషాధిక్యత

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ • పితృస్వామ్య, ఫ్యూడల్ తరహా వృత్తి • మహిళలకు ప్రాతినిధ్యం మరింత పెరగాలి • అణగారిన వర్గాలూ న్యాయపాలికలోకి రావాలి హిందుస్తాన్ టైమ్స్ సమిట్‌లో సంచలన వ్యాఖ్యలు • చట్టం అణచివేత సాధనం కారాదన్న సీజేఐ • అది పాలకుల బాధ్యతేనని స్పష్టీకరణ



న్యూఢిల్లీ: భారతీయ న్యాయవ్యవస్థలో తొలినుంచీ పురుషాధిక్యత వేళ్లూనుకొని ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశంలో న్యాయ వృత్తి ఫ్యూడల్, పితృస్వామ్య తరహాతో, మహిళలను సముచిత వాటా కల్పించని స్వభావంతో కూడుకున్నదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఢిల్లీలో హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమిట్‌లో ఆయన మాట్లాడారు. మహిళలు, సమాజంలోని అణగారిన వర్గాల వారు న్యాయ పాలికలోకి మరింత పెద్ద సంఖ్యలో ప్రవేశించాలని అభిప్రాయపడ్డారు. అందుకు వీలుగా మొత్తం న్యాయ వ్యవస్థను మరింత ప్రజాస్వామ్యయుతంగా, ప్రతిభాధారితంగా మార్చాల్సిన అవసరం చాలా ఉందంటూ కుండబద్దలు కొట్టారు. ''ఒక విషయం మనం అర్థం చేసుకోవాలి. న్యాయ వ్యవస్థకు మానవ వనరులను అందించేందుకు మనకు ఒక నిర్ధారిత వ్యవస్థ ఉంది. దాని నిర్మాణం ఇప్పటికీ ఫ్యూడల్, పితృస్వామ్య పోకడలతోనే నిండి ఉందన్నది వాస్తవం. పురుషాధిక్యత మన న్యాయవ్యవస్థ స్వరూపంలోనే గూడుకట్టుకుపోయింది. సీనియర్ లాయర్లున్న ఏ చాంబర్లోకి వెళ్లినా అక్కడ మొత్తం పురుషులే కనిపిస్తారు. మార్పు అక్కడి నుంచే రావాలి. మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులకు ఆ చాంబర్లలో చోటు దక్కాలి. అప్పుడు గానీ న్యాయపాలికలో వారి సంఖ్య పెరగదు! మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తుల ద్వారానే భవిష్యత్తులో మెరుగైన న్యాయవ్యవస్థను నిర్మించుకోగలం'' అన్నారు. ''నేడు న్యాయవ్యవస్థ ముందు ఎన్నో సవాళ్లున్నాయి. వాటిలో మొట్టమొదటిది, అతి ముఖ్యమైనది సుప్రీంకోర్టుపై ప్రజలు పెట్టుకున్న ఆశలు. ఎందుకంటే ప్రతి సామాజిక, న్యాయపరమైన అంశమూ, రాజకీయ అంశమూ సుప్రీంకోర్టు న్యాయ పరిధిలోకి వచ్చేవే'' అని చెప్పారు.

మేము మానసికంగా పక్కా యూత్!

న్యాయమూర్తులు నల్లకోటుతో పాత, రాచరిక కాలపు వస్త్రధారణలో కన్పించి బోరు కొట్టిస్తుంటారని సీజేఐ అన్నారు. ''మా లుక్స్ జనాలకు బాగా విసుగు పుట్టిస్తాయన్నది నిజమే కావచ్చు. కానీ నిజానికి మానసికంగా మాత్రం మేమంతా నవయవ్వనంతో ఉరకలేస్తుంటాం'' అంటూ చమత్కరించారు!

న్యాయమూర్తులకు ఆ నేర్పుండాలి

చట్టం అణచివేతకు సాధనంగా కాక న్యాయమందించే సాధనంగా ఉండాలని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఆ బాధ్యత పాలకులదే తప్ప న్యాయమూర్తులది కాదని స్పష్టం చేశారు. ''మాపై ప్రజలకు ఎన్నో ఆశలు, అంచనాలున్నాయి. కానీ కోర్టుల పరిమితులను కూడా అర్థం చేసుకోవాలి. ''చట్టాలు, న్యాయం కొన్నిసార్లు ఒకే సరళరేఖపై వెళ్లకపోవచ్చు. కానీ చట్టాలున్నది అంతిమంగా న్యాయ వితరణకే. వాటిని అణచివేతకు దుర్వినియోగం చేయొద్దు' అని సీజేఐ అన్నారు. ''దీర్ఘకాలంలో న్యాయవ్యవస్థను నిలబెట్టేది దయా భావన, సహానుభూతితో ప్రజల వేదనను పోగొట్టగలిగిన సామర్థ్యం మాత్రమే. ఎవరూ పట్టించుకోని అణగారిన వర్గాల ఆక్రందన వినగలిగి, వారి బాధలను చూడగలిగి చట్టాన్ని, న్యాయాన్ని నేర్పుగా బ్యాలెన్స్ చేయగలిగిన నాడు న్యాయమూర్తిగా బాధ్యతలను సరిగా నిర్వర్తించినట్టు లెక్క'' అన్నారు

అమెరికాతో పోలికేల...?

మన సుప్రీంకోర్టును అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల అత్యున్నత న్యాయస్థానాలతో పోల్చడం సరికాదని సీజేఐ అభిప్రాయపడ్డారు. ''అమెరికా సుప్రీంకోర్టు ఏడాదంతా కలిపి మహా అయితే 180 పైచిలుకు కేసులు పరిష్కరిస్తుంది. బ్రిటన్‌లోనైతే 85 కేసులు దాటవు! కానీ మన సుప్రీంకోర్టులో ప్రతి న్యాయమూర్తీ సోమ, శుక్రవారాల్లో 75 నుంచి 80 కేసుల దాకా ఆలకిస్తారు. మంగళ, బుధ, గురువారాల్లో 30 నుంచి 40 దాకా కేసులు చూస్తారు. మన సుప్రీంకోర్టు విస్తృతి అంత సువిశాలమైనది! మేం పరిష్కరించే చాలా ముఖ్యమైన కేసుల్లో కొన్ని వార్తాపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో కన్పించకపోవచ్చు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా పెన్షన్, భరణం వంటి చిన్నాచితకా కేసులనూ విచారించాల్సిందేనా అంటే, అవునన్నదే నా సమాధానం. ఎందుకంటే ప్రజలకు నిజమైన భరోసా కల్పించగలిగినప్పుడే న్యాయ వ్యవస్థ పరిఢవిల్లుతుంది'' అన్నారు.

..అందుకే ప్రత్యక్ష ప్రసారాలు

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాల్లో ఒక్కోసారి పారదర్శకత లేమి పెద్ద ప్రమాదంగా మారుతుందని సీజేఐ అభిప్రాయపడ్డారు. దానికి అడ్డుకట్ట వేసేందుకే సుప్రీంకోర్టు విచారణల ప్రత్యక్ష ప్రసారానికి తెర తీసినట్టు చెప్పారు. తద్వారా న్యాయపాలికలో ఏం జరుగుతోందనే పౌరులు తెలుసుకునే అవకాశం దక్కడమే గాక న్యాయవ్యవస్థ మరింత జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు వీలు కలుగుతుందన్నారు. ''కోర్టు విచారణల ప్రత్యక్ష ప్రసారాలు మేం చేపట్టిన ఓ నూతన ప్రయోగం. న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంలో టెక్నాలజీ ఎంత పాత్ర పోషించగలదో దీని ద్వారా అర్థమైంది. న్యాయం కోసం సామాన్యుడు తొలుత ఆశ్రయించే జిల్లా కోర్టుల విచారణలనూ ప్రత్యక్ష ప్రసారం చేయాలి'' అన్నారు.

'సోషల్' సవాలుకు తగ్గట్టు అప్‌డేట్ కావాలి

''కోర్టు గదిలో న్యాయమూర్తులు మాట్లాడే ప్రతి చిన్న మాటనూ రియల్ టైంలో రిపోర్ట్ చేస్తూ సోషల్ మీడియా పెను సవాలుగా విసురుతోంది. న్యాయమూర్తుల పనితీరు నిత్యం మదింపుకు గురవుతోంది'' అని సీజేఐ అభిప్రాయపడ్డారు. ''మనమిప్పుడు ఇంటర్నెట్, సోషల్ మీడియా యుగంలో ఉన్నాం. కనుక న్యాయమూర్తులుగా మనల్ని మనం నిత్యం కొత్తగా ఆవిష్కరించుకోవాలి. ఈ కొత్త తరపు సవాళ్లను ఎదుర్కోవడంలో మన పాత్రపై పునరాలోచించుకోవాలి. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించాలి'' అని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా...

ఈడబ్ల్యూఎస్ కోటాను ఒప్పుకోం: తమిళనాడు

చెన్నై: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన 103వ రాజ్యాంగ సవరణను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ రిజర్వేషన్ పేదల్లో కులవివక్షను మరింత పెంచేలా ఉందని సీఎం ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. దాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలుచేస్తామని శనివారం అన్ని పార్టీల శాసనసభా పక్ష నేతల సమావేశంలో వెల్లడించారు.

రాజీవ్ దోషులకు విముక్తి

నళిని, మరో ఐదుగురు విడుదల

వేలూరు(తమిళనాడు): దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యోదంతంలో దోషులుగా జీవితఖైదు అనుభవిస్తున్న నళిని, ఆమె భర్త శ్రీహరన్, మరో ముగ్గురు సుప్రీంకోర్టు ఆదేశానుసారం శనివారం సాయంత్రం తమిళనాడులోని వేర్వేరు జైళ్ల నుంచి విడుదలయ్యారు. వెల్లూరు మహిళా ఖైదీల జైలు నుంచి నళిని, వెల్లూరు సెంట్రల్ జైల్ నుంచి ఆమె భర్త శ్రీహరన్ అలియాస్ మురుగన్, శంతన్; చెన్నైలోని మరో జైలు నుంచి రాబర్ట్ పయాస్, జయకుమార్; మదురై జైలు నుంచి పి.రవిచంద్రన్ విడుదలయ్యారు. శ్రీలంక జాతీయులైన శ్రీహరన్, శంతన్, పయస్, జయకుమార్‌లను తిరుచిరాపల్లిలోని శరణార్థి శిబిరానికి తరలించారు.

గుజరాత్ ఎన్నికల తర్వాతే పార్లమెంట్ సమావేశాలు?

సాక్షి, న్యూఢిల్లీ: ఏటా నవంబర్ మూడో వారంలో మొదలయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈసారి ఆలస్యమయ్యేలా ఉన్నాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక డిసెంబర్ 6 లేక 7న ప్రారంభమయ్యే కావచ్చని పార్లమెంట్ వర్గాలంటున్నాయి. నవంబర్ మూడో వారంలో సమావేశాలు మొదలవాలంటే ఈసరికే పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం, పాటు ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపుల ప్రక్రియ మొదలయ్యేవి.

టెర్రర్ ఫండింగ్‌పై ఢిల్లీలో అంతర్జాతీయ సదస్సు

సాక్షి, న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి ఆర్థిక సాయాన్ని అడ్డుకోవడంలో దేశాల మధ్య అవగాహన, సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో జరిగే మూడో అంతర్జాతీయ సదస్సుకు ఢిల్లీ వేదిక కానుంది. 'నో మనీ ఫర్ టెర్రర్' అంశంపై కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో సదస్సు జరగనుంది. 75 దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొని విస్తత చర్చలు జరుపనున్నారు.

'ఛాన్స్‌లర్' హోదా కత్తిరింపు... కేరళ గవర్నర్‌కు ఆర్డినెన్స్

తిరువనంతపురం: కేరళలో సీపీఎం ప్రభుత్వానికి, గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు విభేదాలు మరింత ముదిరాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఛాన్స్‌లర్‌గా గవర్నర్‌ను తప్పిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను ఆమోదం కోసం శనివారం గవర్నర్‌కు ప్రభుత్వం పంపించింది. ఆమోదించకుంటే బిల్లుగా అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వం చెబుతోంది.

● డ్రెస్సు అదిరింది...!



కాంబోడియా రాజధాని నాంఫెన్‌లో ఆ దేశ సంప్రదాయ వస్త్రధారణలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, కెనడా ప్రధాని ట్రూడో

మన రాష్ట్రపతి ఎలా ఉంటారు..?!

నోరుజారిన బెంగాల్ మంత్రి

నందిగ్రామ్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రూపురేఖలపై నోరుజారి పశ్చిమబెంగాల్ మంత్రి అఖిల్ గిరి చిక్కుల్లో పడ్డారు. ''నేను చూడడానికి అందంగా ఉండనని బీజేపీ వాళ్లు అంటూంటారు. ఎవరినీ రూపంతో అంచనా వేయలేం. రాష్ట్రపతి పదవికి మనమెంతో గౌరవమిస్తాం. కానీ మన రాష్ట్రపతి చూడటానికి ఎలా ఉంటారు?'' అని నందిగ్రామ్‌లో జరిగిన ర్యాలీలో గిరి ప్రశ్నించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. సొంత పార్టీ నేతలు కూడా తప్పుబట్టడంతో తాను ఉద్దేశపూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదంటూ మంత్రి క్షమాపణ చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతిని క్షమాపణ కోరుతూ శనివారం మరో వీడియో విడుదల చేశారు. ''బెంగాల్‌లో బీజేపీ వాళ్లు నా రూపురేఖల్ని తరచూ విమర్శిస్తూ ఉండడడంతో వాటిని తిప్పికొట్టడానికే రాష్ట్రపతి ప్రస్తావన తెచ్చా తప్ప వేరే ఉద్దేశం లేదు. రాష్ట్రపతిపై నాకు అపార గౌరవముంది'' అన్నారు. గిరిని తక్షణం బర్తరఫ్ చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా డిమాండ్ చేశారు.



భువనేశ్వర్‌లో మంత్రి అఖిల్ గిరి ఫ్లెక్సీ దగ్ధం

విలాస నౌకలో 800 మందికి కరోనా

సిడ్నీ: న్యూజిలాండ్ నుంచి వస్తున్న విలాసవంత పర్యాటక నౌక 'మేజిస్టిక్ ప్రిన్సెస్'లోని 3,300 మంది ప్రయాణికులు, 1,300 మంది సిబ్బందిలో శనివారం మొత్తంగా 800 మందికి కోవిడ్ సోకింది. మెల్‌బోర్న్‌కు వెళ్లాల్సిన ఈ నౌక ప్రస్తుతం సిడ్నీలోని సర్క్యులర్ క్వేలో ఆగింది. కోవిడ్ తొలినాళ్లలో ఇదే తరహాలో రూబీ ప్రిన్సెస్ భారీ విలాసవంత పర్యాటక నౌకలో 900 మందికి కోవిడ్‌సోకి 28 మంది మహమ్మారికి బలయ్యారు. ఆస్ట్రేలియాలో కోవిడ్ కేసులు విజృంభిస్తున్న వేళ మేజిస్టిక్ నౌకలో కోవిడ్ ఉధృతిపై ఆందోళనలు పెరిగాయి. అయితే, ' పరీక్షలో పాజిటివ్‌గా తేలిన వారికి కోవిడ్ లక్షణాలు లేవు. కొద్ది మందికి స్వల్ప లక్షణాలు ఉన్నాయి. పరిస్థితి అదుపులోనే ఉంది. వారిని ఐసొలేషన్‌లో ఉంచాం' అని క్రూయిజ్ ఆపరేటర్ అయిన కార్నివాల్ ఆస్ట్రేలియా అధ్యక్షురాలు మార్గరేట్ ఫిట్జ్‌గెరాల్డ్ చెప్పారు.



సిడ్నీలో లంగరు వేసి ఉన్న మేజిస్టిక్ ప్రిన్సెస్ క్రూయిజ్

తండ్రిని బతికించుకునేందుకు... చిన్నారిని బలివ్వబోయింది!

న్యూఢిల్లీ: మూఢ నమ్మకాల మాయలో ఓ పాతికేళ్ల మహిళ ఒక పసికందునే బలివ్వబోయిన దారుణం ఢిల్లీలో వెలుగుచూసింది. ఇటీవల కన్నుమూసిన తండ్రి నవజాత మగ శిశువును బలిస్తే బతికొస్తాడని ఎవరో చెప్పడంతో ఇంతటి ఘోరానికి పాల్పడబోయింది. మామ్‌రాజ్ మొహల్లా దగ్గర నివసించే దంపతులకు రెండు నెలల బాబున్నాడు. శ్వేత అనే పాతికేళ్ల మహిళ వారితో పరిచయం పెంచుకుంది. ఎన్‌జీవోలో పనిచేస్తానని, పిల్లాడికి ఉచితంగా మందులిస్తానని నమ్మబలికి ఇంటికి రోజూ వచ్చిపోతూ దగ్గరైంది. బుధవారం పిల్లాడిని సరదాగా తిప్పుతానంటూ బయటకు తీసుకెళ్లింది. వెంట వచ్చిన పసికందు బంధువుకు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపిచ్చి వదిలించుకుని బాబుతో పరారైంది. బంధువు బాబు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా శ్వేత జాడ కనిపెట్టారు. ఆమెను అరెస్ట్‌చేసి పసికందును తల్లిదండ్రులకు అప్పజెప్పారు. బాలున్ని కాపాడుతూ కేసును 24 గంటల్లోపే ఛేదించిన పోలీసులకు ప్రశంసలు దక్కాయి.

హిమాచల్ ప్రదేశ్‌లో 66% పోలింగ్

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

సిమ్లా: అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకు కఠినమైన సవాళ్లు విసిరిన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో శనివారం భారీ పోలింగ్ నమోదైంది. చలి పులి వణికిస్తున్నా ఓటర్లు భారీగా వచ్చి ఓటేశారు. 66 శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్టు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. సీఎం జైరాం ఠాకూర్ మండిలో భార్యతో కలిసి ఓటేశారు. బీజేపీ విజయం ఖాయమన్నారు.

శతాధిక వృద్ధులే స్పెషల్ అట్రాక్షన్

శతాధిక వృద్ధులు భారీగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయడం ప్రధానాకర్షణగా మారింది. చంబా జిల్లా చురాలో నారోదేవి అనే 105 ఏళ్ల మహిళ, సిమ్లాలో సర్దార్ ప్యార్ సింగ్ అనే 103 ఏళ్ల వృద్ధుడు ఓటేశారు. ఈసీ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో వందేళ్లకు పైబడిన వారు 1,136 మంది ఉన్నారు. భారత తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగి 106 ఏళ్ల వయసులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశాక ఇటీవలే మరణించడం తెలిసిందే. ఆయన లోటును తీరుస్తూ పోలింగ్ కేంద్రాల్లో వృద్ధుల ఎక్కువగా కనిపించారు.



ఓటేసి వస్తున్న వృద్ధురాలు

10 లక్షల ఉద్యోగాలు, గృహాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్

గుజరాత్‌లో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ శనివారం మేనిఫెస్టోను విడుదల చేసింది. 10 లక్షల ఉద్యోగాలు, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50% రిజర్వేషన్లు, గృహాలకు నెలకి 300 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చింది. పార్టీ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ మేనిఫెస్టోను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గత 27 ఏళ్లలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తామన్నారు. అంతే కాకుండా అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ స్టేడియంలోని నరేంద్ర మోదీ స్టేడియం పేరు మారుస్తామన్నారు. ఈ మేనిఫెస్టోలు అంశాలను తాము అధికారంలోకి వచ్చిన మొదటి కేబినెట్ సమావేశంలోనే నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా ఏమేం హామీలు ఇచ్చిందంటే..

- రాష్ట్రంలో 10 లక్షల ఉద్యోగాల కల్పన
- గృహాలకు నెలకి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- రూ. 3 లక్షల వరకు రైతు రుణ మాఫీ
- గుజరాతీయులందరికీ ఉచిత ఆరోగ్యం. రూ. 10 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్య చికిత్స. రూ. 5 లక్షల వరకు మందులు ఉచితం
- కోవిడ్‌తో మృతి చెందిన కుటుంబాలకు రూ. 4 లక్షల వరకు నష్టపరిహారం
- నిరుద్యోగ యువతకి నెలకి రూ.3 వేలు భృతి
- మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50% రిజర్వేషన్లు, వృద్ధ మహిళలు, వితంతువులు, సింగిల్ వుమెన్‌కి నెలకి రూ.2 వేలు ఆర్థిక సాయం
- గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై రూ.55 సబ్సిడీ
- రాష్ట్రవ్యాప్తంగా 3 వేల ఇంగ్లిషు మీడియం స్కూళ్ల ప్రారంభం, ఆ స్కూళ్లలో అమ్మాయిలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్య
- గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా డిసెంబర్ 1, 5న జరగనుంది. డిసెంబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

మధ్యతరగతి విస్ఫోటం


పెరిగిపోతున్న మధ్యతరగతి జనాభా
2030 కల్లా ప్రపంచంలో 65 శాతం వారే!

డి.శ్రీనివాసరెడ్డి

మధ్య తరగతి జన విస్ఫోటనం. కొంతకాలంగా ప్రపంచమంతటా శరవేగంగా జరుగుతున్న పరిణామమిది! మార్కెట్ల విస్తరణ, ఆదాయ వనరుల పెరుగుదల తదితర కారణాలతో ఏ దేశంలో చూసినా మధ్య తరగతి జనం ఏటా విపరీతంగా పెరుగుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో ఈ ట్రెండ్ మరీ ఎక్కువగా ఉంది. ఇప్పటికే ప్రపంచ జనాభాలో 40 శాతం పైగా వాటా మధ్యతరగతిదే. దాదాపుగా అన్ని దేశాల్లోనూ ప్రభుత్వాలు నడవడానికి వీరి ఆదాయ వ్యయాలే ఇంధనంగా మారుతున్నాయంటే అతిశయోక్తి కాదు!
ప్రఖ్యాత వ్యాపార దిగ్గజాలు కూడా వ్యాపార విస్తరణ ప్రణాళికల్లో మిడిల్ క్లాస్‌ను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది!

ఏటా 14 కోట్ల మంది

ప్రపంచవ్యాప్తంగా మధ్య తరగతి జనాభా ఏటా ఏకంగా 14 కోట్ల చొప్పున పెరిగిపోతోందని, ప్రస్తుతం 320 కోట్లుగా ఉందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. 2030 నాటికి వీరి సంఖ్య 520 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. అంటే ప్రపంచ జనాభాలో ఏకంగా 65 శాతానికి చేరనుందన్నమాట! మొత్తం ప్రపంచ ఆదాయంలో మూడో వంతు ఈ మధ్యతరగతి మహాజనుల నుంచే సమకూరుతోందట!



సింహభాగం ఆసియాదే...

ఈ శతాబ్దారంభంలో అమెరికా తదితర సంపన్న యూరప్ దేశాల్లో అధిక సంఖ్యాకులు మధ్యతరగతి వారే ఉండేవారు. క్రమంగా అక్కడ వారి వృద్ధి తగ్గుతూ ఆసియా దేశాల్లో శరవేగంగా పెరుగుతోంది. వరల్డ్ డేటా లాబ్ అంచనా ప్రకారం వచ్చే ఎనిమిదేళ్లలో కొత్తగా రానున్న 100 కోట్ల మంది మధ్యతరగతి జనంలో ఏకంగా 90 శాతం ఆసియాకు చెందినవారే ఉండనున్నారు! భారత్, చైనా తోపాటు ఇండోనేసియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌వంటి ఆసియా దేశాలు మిడిల్ క్లాస్ జనంతో మరింతగా కళకళలాడతాయట. ఆ దేశాల్లో శరవేగంగా సాగుతున్న పట్టణీకరణే అక్కడ మధ్యతరగతి ప్రాబల్యానికి తార్కాణం. వీరు చైనాలో 2010 నాటికి జనాభాలో 49 శాతముండగా ఇప్పటికే 56 శాతానికి పెరిగారు. 2035 నాటికి చైనా జనాభాలో ఏకంగా 100 కోట్ల మంది పట్టణవాసులే ఉంటారని అంచనా. భారత్‌లోనూ 2035 నాటికి 67.5 కోట్ల మంది (45 శాతం) పట్టణాల్లో నివసిస్తారట. ఆసియాలో ఈ సంఖ్య 300 కోట్లుగా ఉండనుంది.

దేశ, కాలమాన పరిస్థితులను బట్టి కొన్ని తేడాలున్నా మొత్తమ్మీద ఒక వ్యక్తి తన అన్ని అవసరాలకు కలిపి రోజుకు దాదాపు రూ.1,000, ఆ పైన వెచ్చించగలిగితే అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అతన్ని మధ్యతరగతిగా లెక్కిస్తారు. రూ.5 లక్షల నుంచి 30 లక్షల వార్షికాదాయం ఉన్నవారిని మధ్యతరగతిగా పరిగణిస్తారు.

మన దగ్గర కూడా... మధ్యతరగతి మందహాసమే

భారత్‌లో ప్రస్తుతం ప్రతి ముగ్గురిలో ఒకరు మిడిల్ క్లాస్ జీవులే. 2047 నాటికి వీరి సంఖ్య రెట్టింపై ప్రతి ముగ్గురిలో ఇద్దరు వాళ్లే ఉంటారని పీపుల్ రీసెర్చ్ ఆఫ్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైజ్) అంచనా. 2005లో దేశ జనాభాలో కేవలం 14 శాతమున్న మధ్యతరగతి ఇప్పుడు ఏకంగా 31 శాతానికి పెరిగింది. 2035 కల్లా 43.5 శాతానికి వృద్ధి చెందనుంది!

యూఎస్‌లో పాపం మిడిల్‌క్లాస్...

ఒకప్పుడు మధ్యతరగతి ఆదాయ వర్గాల దేశంగా నిలిచిన అమెరికాలో వారి సంఖ్య బాగా తగ్గుతోంది. అక్కడ 35 వేల నుంచి 1.06 లక్షల డాలర్ల వార్షికాదాయముంటే మధ్యతరగతిగా పరిగణిస్తారు. 1971లో దేశ జనాభాలో 61 శాతం మిడిల్ క్లాసే కాగా గతేడాదికి 50 శాతానికి తగ్గిందని ప్యూ రీసెర్చ్ సెంటర్ వెల్లడించింది. ఇక రష్యా, ఉక్రెయిన్లలో యుద్ధం దెబ్బకు ఒక్క ఈ ఏడాదే ఏకంగా కోటి మంది దాకా మధ్య తరగతి నుంచి దిగువ తరగతికి దిగజారినట్టు ప్యూ నివేదిక వెల్లడించింది.

షారుక్ లగేజీలో ఖరీదైన వాచీలు

- విమానాశ్రయంలో అడ్డుకున్న అధికారులు
- రూ.6.88 లక్షల కస్టమ్స్ సుంకం చెల్లింపు



ముంబై: బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ లగేజీలో రూ.18 లక్షల ఖరీదైన వాచీలు బయటపడటం, వాటికి ఆయన దాదాపు రూ.7 లక్షల కస్టమ్స్ సుంకం చెల్లించిన ఘటన శనివారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో జరిగింది. దుబాయ్ నుంచి వస్తున్న షారుఖ్ ఖాన్ తన సహాయకులతో కలసి శనివారం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రత్యేక చార్టర్డ్ విమానంలో దిగారు. మధ్యాహ్నం పన్నెండున్నర ప్రాంతంలో జనరల్ ఏవియేషన్ టెర్మినల్ వద్ద ఆగిన ఈ విమానం నుంచి షారుఖ్, ఆయన మేనేజర్ పూజా, అంగరక్షకుడు రవిశంకర్ సింగ్, మరో ముగ్గురు దిగారు. వారి ఆరు లగేజీ బ్యాగులను విమానాశ్రయ అధికారులు తనిఖీచేయగా రూ.17.86 లక్షల విలువైన ఆరు ఖరీదైన వాచీలు బయటపడ్డాయి. వీటికి రూ.6.88 లక్షల కస్టమ్స్ సుంకం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. లగేజీ చెకింగ్ కోసం గంటపాటు షారుఖ్, ఆయన అనుచరులను బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారు. కస్టమ్స్ సుంకం స్వీకరించే చెల్లింపు కేంద్రం పనిచేయకపోవడంతో వేరే టెర్మినల్‌లో చెల్లింపు జరిగాక పంపించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 13 । నవంబర్ । 2022



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది.



కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): కథలో బలం ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని హీరో రాజ్‌తరుణ్ అన్నారు. శివానితో కలసి తాను నటించిన వెబ్ సిరీస్ అహ నా పెళ్లంట ప్రమోషన్‌లో ఆయన పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డాక్టర్ బుర్రా అనూప్, పూజిత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

18న కేబీఎన్ కళాశాలలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 18వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్‌లోని కాకరపర్తి భావన్నారాయణ (కేబీఎన్) డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, బీ–టెక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగిన వారు ఈ మేళాలో పాల్గొనడానికి అర్హులు అని వివరించారు. ఏడు కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి కంపెనీల్లో వివిధ ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ నెల 18 వ తేదీ ఉదయం 10 గంటల లోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్‌సీకర్ విభాగంలో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98496 90830, 94932 33237, 97000 92606, 96033 68324 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. 18 వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా జరుగుతుందని, విద్యార్హతా పత్రాలతో అభ్యర్థులు మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు జగ్గయ్యపేట స్విమ్మర్లు



జగ్గయ్యపేట అర్బన్: నేపాల్‌లోని పోఖ్రా సిటీలో ఈనెల 16,17,18,19 తేదీలలో జరగనున్న ఏడవ ఎస్‌బీకేఎఫ్ ఇంటర్నేషనల్ ఈతల పోటీలలో పాల్గొనేందుకు జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు వెళుతున్నట్లు టీమ్ కోఆర్డినేటర్ ఎ.కళ్యాణ్ తెలిపారు. అసోసియేషన్ కోచ్‌లు పొట్లూబత్తిన పాండురంగారావు, లక్ష్మి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాస్, కలాలి నరేష్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొనే 11 మంది స్విమ్మర్లు పాండురంగారావు, లక్ష్మి, పి.రమాదేవి, ఈ.సీతారావమ్మ, ఆర్.నిహారిక, వై.శ్రీనివాసరావు, సీహెచ్ మోహనరావు, కె.రామేశ్వరావు, టి.తిరుపతిరావు, యండ్రాతి రామారావు, ఎన్.శ్రీనివాస్ ఈనెల 14 వ తేదీన బయలుదేరి వెళుతున్నట్టు తెలిపారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో కృష్ణా హవా

గుంటూరు వెస్ట్(క్రీడలు): స్థానిక బీఆర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో కృష్ణా, నెల్లూరు, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందగా బాలికల్లో కృష్ణా, గుంటూరు, అనంతపురం వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందాయి. వ్యక్తిగత విభాగంలో బాలమనోజ్(గుంటూరు), జీవన్ గౌతమ్(గుంటూరు), సుదన్వ రఘునందన్ (నెల్లూరు), ప్రథమ, ద్వితీయ, తృతీయ సానాలు గెలుపొందారు. బాలికల్లో యశస్వి సుంకర(కృష్ణా), లావణ్య (కృష్ణా), నీరజ (అనంతపురం) వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు. టీం విభాగంలో విజేతగా గుంటూరు జిల్లా నిలిచింది.

గుండెకు భరోసా

- విజయవాడ జీజీహెచ్‌లో వందకు పైగా ఓసీటీ ప్రొసీజర్లు
- రాష్ట్రంలోనే అత్యధికంగా ఓసీటీ ప్రొసీజర్ల నిర్వహణ
- ఇప్పుడిప్పుడే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఓసీటీ యంత్రాల ఏర్పాటు
- ఓసీటీతో రక్తనాళాల్లో పూడికలు కచ్చితత్వంతో నిర్ధారణ



ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఓసీటీ యంత్రం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): గుండె వైద్యానికి విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) భరోసా ఇస్తోంది. ఆస్పత్రి వైద్యులు గుండె వైద్యంలో నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం అందుబాటులో లేని పరికరాలు ఇక్కడ ఉన్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్న ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ(ఓసీటీ) పరికరం రెండేళ్ల కిందటే జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రిలోనూ చేయనన్ని ఓసీటీ ప్రొసీజర్లను విజయవాడ జీజీహెచ్‌లో నిర్వహించారు. అత్యంత ఖరీదైన ఈ ఓసీటీ ప్రొసీజర్లు ఇప్పటి వరకూ వందకు పైగా జరిగాయి. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి గుండె వైద్య సేవలు అందించడంలో ఆస్పత్రి వైద్యులు ముందంజలో ఉన్నారు.

ఆధునిక టెక్నాలజీ ఓసీటీ

గుండె రక్తనాళాల్లోని పూడికలు, రక్తనాళాల పరిస్థితిని కచ్చితత్వంతో నిర్ధారించడంలో ఆధునిక సాంకేతిక ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) యంత్రాలు కీలకంగా మారాయి. ఒక్కో యంత్రం ధర రూ.కోటిన్నర వరకూ ఉంటుంది. నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇవి ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్నాయి. జీజీహెచ్‌లో రెండు ఓసీటీ యంత్రాలను ఏర్పాటు చేశారు. క్యాథ్ ల్యాబ్‌లో ఉపయోగించే ఈ యంత్రాలపై వైద్యం ఎంతో ఖరీదుతో కూడుకున్నది. అయితే జీజీహెచ్‌లో ఇప్పటికే రాష్ట్రంలోనే అత్యధికంగా వంద మందికి పైగా ఓసీటీ ప్రొసీజర్లను నిర్వహించారు.

కచ్చితత్వంతో నిర్ధారణ

రక్తనాళాల్లో పూడికలు 40 శాతం, 50 శాతం ఉన్నప్పుడు స్టెంట్ వేయాలా.. లేదా అని వైద్యుడు నిర్ధారించడం కష్టం. అలాంటి వారికి ఓసీటీ యంత్రంపై పరీక్షించడం ద్వారా నిర్ధారించుకోవచ్చు. క్యాథ్‌ల్యాబ్‌పై యాంజియోగ్రామ్ చేస్తే రక్తనాళాల్లోని లోపలి వైపు పూడికలే తెలుస్తాయి. ఓసీటీ టెక్నాలజీలో రక్తనాళాల బయటివైపు పరిస్థితిని కూడా తెలుసుకోవచ్చని వైద్యులు చెపుతున్నారు. స్టెంట్ వేసిన తర్వాత దాని అమరిక సరిగా జరిగిందా? లేదా? అనేది కూడా ఓసీటీ టెక్నాలజీతో తెలుసుకునే అవకాశం ఉంది.

వందశాతం సక్సెస్ రేటు

జీజీహెచ్‌లో గుండెపోటుతో వచ్చిన వారికి వందశాతం సక్సెస్‌రేటుతో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీలు నిర్వహిస్తున్నారు. కొందరికి ఆస్పత్రిలో చేరిన రెండున్నర గంటల్లోనే ఎమర్జెన్సీ ప్రైమరీ యాంజియోప్లాస్టీలు నిర్వహిస్తూ పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. ఇప్పటి ఎంతో మందికి ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీలు చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నాలుగైదు లక్షల రూపాయల ఖర్చయ్యే కాల్షియం బ్లాక్స్‌కు సైతం ఇక్కడ ఉచితంగా స్టెంట్‌లు వేస్తున్నారు.

మెరుగైన సేవలు



గుండె వైద్య విభాగంలో అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటంతో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించగలుగుతున్నాం. ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ పరికరంతో అవసరమైన వారికి కార్డియాలజిస్టులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. యాంజియోగ్రామ్‌లు, యాంజియోప్లాస్టీలను వందశాతం సక్సెస్ రేటుతో నిర్వహిస్తున్నాం. ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రోగులకు సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్

జీజీహెచ్‌లో ప్రొసీజర్స్ ఇలా...

ఇప్పటి వరకూ నిర్వహించిన

యాంజియోగ్రామ్స్	3700
యాంజియోప్లాస్టీలు	105
ఓసీటీ ప్రొసీజర్లు	103

కేసుల పరిష్కారంలో జిల్లా ప్రథమస్థానం

- లోక్‌అదాలత్‌లో 30,284 కేసులు పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉభయ కృష్ణాజిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో కేసుల పరిష్కారంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. జిల్లా వ్యాప్తంగా 45 లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసి 30,284 కేసులు పరిష్కరించామన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో 29,394 క్రిమినల్ కేసులు, 236 సివిల్ కేసులు, 272 చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించామన్నారు. 108 మోటారు వాహన ప్రమాద కేసులను పరిష్కరించి రూ.4.99 కోట్లు నష్ట పరిహారంగా చెల్లించేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించాయన్నారు. 274 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించి అవార్డులు జారీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ లోక్‌అదాలత్‌లో మచిలీపట్నం కోర్టులో 2717, విజయవాడ కోర్టులో 12,654 కేసులు, గుడివాడ 2051, నందిగామ 2021, నూజివీడు 983, మైలవరం 811, జగ్గయ్యపేట 1814, బంటుమిల్లి 610, కైకలూరు 1075, తిరువూరు 1884, గన్నవరం 869, అవనిగడ్డ 1086, మొవ్వ 918, ఉయ్యూరు కోర్టులో 791 కేసులు పరిష్కరించారన్నారు.

బీసీలకు దిశా నిర్దేశకుడు ములాయం



ములాయంకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి కారుమూరి, వివిధ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు


- సమైక్యతతోనే బీసీల ఎదుగుదల సాధ్యం
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ములాయం సింగ్ యాదవ్‌కు ఘన నివాళులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): దేశంలో వెనుకబడిన సామాజిక వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి ములాయం సింగ్ యాదవ్ అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బీసీలందరూ సమైక్యంగా ఉంటేనే రాజకీయ, ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమన్నారు. సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ సంస్మరణ సభ శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొని ములాయం సింగ్ యాదవ్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు ములాయం సింగ్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ యాదవులకు, దళితులకు అనుబంధం ఉందని చెబుతూ శ్రీకృష్ణుడు జాంబవతిని పెళ్లి చేసుకున్న వైనాన్ని ఉదహరించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గుర్తుండిపోయే వ్యక్తిత్వం ములాయం సింగ్ యాదవ్ దన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బీసీలు తమకున్న రాజ్యాంగబద్ధమైన హక్కులు సాధించుకోవాలన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ సమసమాజం కోసం ములాయం సింగ్ యాదవ్ పోరాడారన్నారు. సీపీఐ నాయకుడు కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని పదవి దాకా వచ్చి కొద్దిలో తప్పిపోయిన వారిలో జ్యోతిబసు, ములాయం సింగ్ యాదవ్ ఉన్నారన్నారు. మధు బొట్టా ఆధ్వర్యంలో జరిగిన సభలో మాజీ ఎంపీ చిమటా సాంబు, మాజీ మంత్రులు ఎస్.రఘువీరారెడ్డి, పాలేటి రామారావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, కొల్లు రవీంద్ర, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్, యు.పేరయ్య, లాకా వెంగళరావు యాదవ్, జగదీష్ యాదవ్, కేసన శంకరరావు, గౌతు శిరీష, కె.క్రాంతి, మాదాల తిరుపతిరావు యాదవ్, కొలనుకొండ శివాజీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ నాయకులు పాల్గొన్నారు.

నా నగరం..సుమనోహారం

ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్–2022లో ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం

- జీవన ప్రమాణాలు, ఆర్థిక వనరులు, సుస్థిరమైన వసతుల అంశాలపై సర్వే
- దేశ వ్యాప్తంగా లీడ్‌బోర్డులో ద్వితీయస్థానంలో కొనసాగుతున్న వీఎంసీ
- ప్రథమ స్థానంలో నిలపాలని నగర వాసులకు మేయర్, కమిషనర్ విజ్ఞప్తి



వీఎంసీ రూపొందించిన ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్ పోస్టర్

పటమట(విజయవాడ తూర్పు): దేశ వ్యాప్తంగా నగరాల్లో నివసించే వారి జీవన నాణ్యతను, పట్టణాభివృద్ధికి వివిధ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయటానికి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహకల్ప శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్–2022 సర్వే ప్రారంభమయింది. ఇది డిసెంబర్ 23వ తేదీ వరకు కొనసాగుతుంది. నగరాల జీవన ప్రమాణాలు, ఆర్థిక సామర్థ్యం, స్థిరత్వం ఆధారంగా ర్యాంకింగ్ ప్రకటించటానికి అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ కూడా పాల్గొంటోంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సర్వేలో వీఎంసీ లీడ్‌బోర్డులో ప్రస్తుతం 2649 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉంది. దాన్ని ప్రథమ స్థానంలోకి తీసుకురావాలంటే నగరవాసులు అధికంగా ఈ సర్వేలో పాలుపంచుకోవాలి. సర్వేలో పాల్గొనేవారు తప్పనిసరిగా రిఫరల్ కోడ్(వీఎంసీ రిఫరల్ కోడ్–806929)తో రిజిస్టర్ అవ్వాలి. మొత్తం 100 మార్కులకు జరిగే సర్వేలో నగరంలో బిల్‌బోర్డు, హోర్డింగ్‌కు 10, వాల్‌గ్రాఫిటీ(గోడలపై చిత్రాలు) 20, అవగాహన కార్యక్రమాలకు 10, నగరవాసుల అభిప్రాయ సేకరణకు 10, ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియాలో దీనిపై బ్రీఫింగ్‌కు 10, డిజిటల్ మీడియా (ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా గ్రాం పోస్టులకు 10, సృజనాత్మకతకు 20 మార్కులు ఉన్నాయి. సర్వేలో పాల్గొనేవారు హెచ్‌టీటీపీ://ఈవోఎల్2022డాట్‌ఓఆర్‌జీ/సిటిజన్‌ఫీడ్ బ్యాక్‌డాట్ వెబ్‌సైట్ సందర్శించాలి.

ప్రశ్నావళి ఇలా...

పేరు, వృత్తి, లింగంతో పాటు చదువు, ఫోన్ నంబరుతో రిజిస్టర్ అయితే ప్రశ్నావళి సాగుతుంది. 15 రకాల ప్రశ్నలు ఉంటాయి. ఇందులో నగరంలో ఎలా ప్రయాణిస్తారు, సొంత ఇల్లా, అద్దె ఇల్లా, నగరంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందా లేదా, తాగునీటి సదుపాయం సక్రమంగా జరుగుతుందా లేదా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటున్నాయా?,నాణ్యమైన వైద్యం అందుతుందా?, విద్య సదుపాయాలు, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు ఉన్నాయా, నగరంలో వాయు కాలుష్యం ఏ మేరకు ఉంటుంది, నగరం శుభ్రంగా ఉంటుందా, నగరంలో వినోదానికి పార్కులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, థియేటర్/సినిమా హాళ్లు తగినన్ని ఉన్నాయా, నగరం భద్రతపై మీరు ఎలా అభిప్రాయపడుతున్నారు, నగరం జీవన వ్యయం ఎలా ఉంటుంది..? నడక సదుపాయాలు ఎలా ఉన్నాయి, నగరపాలక సంస్థ ప్రతినిధులు స్పందిస్తున్నారా..? మీ స్నేహితులు, బంధువులకు నగరంలో ఉండేందుకు మీరు సిఫార్సు చేస్తారా వంటి ప్రశ్నావళి ఉంటుంది. ఈ ప్రశ్నావళిని పూరిస్తే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్‌ను అందిస్తుంది.

విజయవాడను ప్రథమస్థానంలో నిలుపుదాం



విజయవాడను సుస్థిరమైన, సుందరమైన నగరంగా, జీవన ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వేలో నగర వాసులు ప్రతి ఒక్కరూ పాల్గొని నగరాన్ని జాతీయ స్థాయిలో ప్రథమంగా నిలపాలి.

-రాయన భాగ్యలక్ష్మి, మేయర్, వీఎంసీ

నగర వాసులు విస్తృతంగా సర్వేలో పాల్గొనాలి



ఈ సర్వేలో మైసిటీ మైప్రైడ్ హ్యాష్‌ట్యాగ్‌తో ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పరిశీలనలోకి వెళ్తాయి. ఇందుకోసం వీఎంసీ ఆధ్వర్యంలో క్యూఆర్(క్విక్ రెస్పాన్స్)కోడ్ కూడా రూపొందించాం. దాన్ని స్కాన్ చేసి సర్వేలో పాల్గొనవచ్చు. నగరవాసులందరూ తమ అభిప్రాయాన్ని నమోదు చేయాలి.

-స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ





మన గుడి సంబరాలు

పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పవిత్ర సంగమం వద్ద జరిగిన మనగుడి సంబరాల కార్యక్రమాన్ని పూర్వపు నగర సీపీ సురేంద్రబాబుతో కలసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. -ఇబ్రహీంపట్నం(మైలవరం)

లారీ ఢీకొని రెండేళ్ల బాలుడి దుర్మరణం

కోనేరుసెంటర్: లారీ ఢీకొని రెండేళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన బందరు మండలం కోన గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బందరు మండలం కోన గ్రామానికి చెందిన గంజాల రవి, సాయికుమారి భార్యాభర్తలు. వీరికి ఐదేళ్ల క్రితం వివాహం అయింది. రెండేళ్ల క్రితం వీరికి ఒక బాబు జన్మించాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. శనివారం సాయంత్రం అందరూ పనుల్లో ఉండగా రవి కుమారుడు ఓంస్వరూప్ (2) ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో భారత్‌సాల్ట్ కంపెనీకి చెందిన లారీ వేగంగా దూసుకొచ్చి బాలుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన కుటుంబసభ్యులు అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు లారీని అడ్డుకున్నారు. కొంతసేపటికీ షాక్ నుంచి తేరుకున్న తల్లి సాయికుమారి బాలుడి మృతదేహం వద్దకు పరుగులు తీసింది. బిడ్డను ఒళ్లో పెట్టుకుని బోరున విలపించింది. మృతదేహాన్ని చూస్తూ కుటుంబసభ్యులు, బంధువులు దిక్కులు పిక్కటిల్లేలా విలపించారు. బాలుడి మృతితో కోన గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చేరుకున్న పోలీసులు బాధిత కుటుంబం నుంచి ఫిర్యాదు అందుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ హనుమంతరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం ఔట్ ఏజెన్సీలో జరిగిన రౌడీషీటర్ కోపూరి రమేష్ హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కె.హనుమంతరావు తెలిపారు. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో హత్య కేసులో నిందితుల వివరాలను ఏసీపీ మీడియాకు వెల్లడించారు. భవానీపురం ప్రియదర్శిని కాలనీకి చెందిన గుంటూరు ప్రవీణ్, గంటా సాయి కిరణ్ రెడ్డి అలియాస్ నరేష్, ఔట్ ఏజెన్సీకి చెందిన సుంకర గౌతమ్ అలియాస్ చినబాబు, జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన యర్రాస్వామి సువర్ణరాజు అలియాస్ ప్రసన్న, భవానీపురం ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ము జోసెఫ్‌లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. హతుడు రమేష్ భార్యతో మనస్పర్థల కారణంగా ఆమెను వదిలి అజిత్‌సింగ్‌నగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. కొద్ది నెలలుగా గుంటూరు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నెల 7వ తేదీన రమేష్ సింగ్‌నగర్ నుంచి భవానీపురంలోని ఔట్ ఏజెన్సీలోని ప్రవీణ్ ఇంటికి వచ్చాడు. అప్పటికే ప్రవీణ్ తన స్నేహితులతో కలిసి ఆ ఇంట్లో ఉన్నాడు. రమేష్ అక్కడకు చేరుకున్న తర్వాత మాటల మధ్యలో ప్రవీణ్ తల్లిని దుర్భాషలాడాడు. ప్రవీణ్ కోపంతో రమేష్‌ను కర్రతో, చేతులతో కొట్టాడు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన ప్రవీణ్ స్నేహితులను రమేష్ తీవ్రంగా దుర్భాషలాడాడు. వారంతా అతనిపై దాడి చేశారు. ఆ దాడిలో గాయపడిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్ మృతదేహాన్ని రెండు రోజులపాటు ప్రవీణ్ తన ఇంట్లోనే ఉంచాడు. రమేష్ హత్యకు ఇతర కారణాలేవీ లేవని, కేవలం ప్రవీణ్ తన తల్లిని దూషించాడని దాడి చేయడం వల్లే మృతి చెందాడని తమ దర్యాప్తులో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి రమేష్‌ను హత్య చేసిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. భవానీపురం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఒమర్ పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పసిబిడ్డ మృతదేహం



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): నెలలు నిండకుండా జన్మించిన మగ పసిబిడ్డ మృతదేహాన్ని స్థానికులు డ్రెయిన్‌లో గుర్తించిన ఘటన వించిపేటలో శనివారం వెలుగు చూసింది. ఓ ప్రార్థనా మందిరం సమీపంలోని కాల్వలో అప్పుడే పుట్టిన నెలలు నిండని చిన్నారి మృతదేహాన్ని సమీపంలోని ప్రజలు గమనించారు. పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి కాల్వలో నుంచి ఆ బిడ్డ మృతదేహాన్ని బయటకు తీశారు. మహిళలు చూసి కన్నీటిపర్యంతం అయ్యారు. ఖననం చేసేందుకు కార్పొరేషన్ సిబ్బందికి అప్పగిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 15 లక్షలు వసూలు చేసిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పైలా వారి వీధిలో బంకా రేవంత్ కుటుంబం నివాసం ఉంటుంది. రేవంత్ తమ్ముడు తేజకు పీసుపాటి చైతన్య స్నేహితుడు. తరుచూ చైతన్య తేజ ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తన అన్న వదినలు ఇద్దరూ విదేశాల్లో ఉంటారని, తెలిసిన వారికి ఉద్యోగాలు ఇప్పిస్తారని నమ్మించాడు. దీంతో గత ఏడాది ఆరంభంలో చైతన్య తన అన్న వెంకట రమణ, వదిన రాజ్యలక్ష్మిని రేవంత్ ఇంటికి తీసుకొచ్చాడు. తేజకు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని అందుకు రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఈ క్రమంలో గత ఏడాది మే 7వ తేదీన రూ. 5 లక్షలు , ఆ తర్వాత 7వ నెలలో రూ. 10 లక్షలు ఇచ్చారు. డబ్బులు ఇచ్చినప్పటి నుంచి వెంకట రమణ, రాజ్యలక్ష్మితో పాటు చైతన్య కూడా ఫోన్ ఎత్తడం లేదు. దీంతో తాము మోసపోయామని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రామవరప్పాడు: ఉరేసుకొని వాచ్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కరెన్సీనగర్‌లోని గ్యాస్ గోడౌన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో గుంటూరు శ్రీను (60) తన భార్య, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నాడు. గ్యాస్ గోడౌన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఎనికేపాడులోని తన నివాసం నుంచి శుక్రవారం రాత్రి విధులు నిర్వహించేందుకు గోడౌన్‌ను వచ్చాడు. శనివారం ఉదయం డ్యూటీ నిమిత్తం గోడౌన్‌కు వచ్చిన లారీ డ్రైవర్లు శ్రీను ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రతిభను వెలికితీసేందుకే బాలోత్సవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

రామవరప్పాడు: ఉన్నత విద్యతోపాటుగా విద్యార్థులు అంతర్గత నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇంజినీరింగ్ మహిళ కళాశాలలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు బాలోత్సవ్ బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. వీసీఎస్టీఏ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. వీసీఎస్టీఏ గౌరవ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్, చైర్మన్ మామిడి శ్రీనివాసరావు, గుండెస్లీవ, శ్రీధర్ రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ, కల్చరల్, అకడమిక్ కమిటీ చైర్మన్లు ముదిగొండ శ్రీహరిరావు, ఆరుముళ్ల మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉభయ జిల్లాల్లోని 100 పాఠశాలల నుంచి సుమారు 2వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంతో ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు.

ఘంటసాల సేవలు చిరస్మరణీయం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఘంటసాల శత జయంతి వేడుకలకు అండగా ఉంటామని ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పద్మశ్రీ ఘంటసాల, ఎస్వీ రంగారావు సాంస్కృతిక సేవా సమితి ఉపాధ్యక్షుడు సి. రామకోటేశ్వరరావు అన్నారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శనివారం కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. 26 జిల్లాల్లో శత జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఘంటసాల స్వరం అజరామరమని పేర్కొన్నారు. తెలుగు వారున్నంత వరకు ఆయన స్వరం ఉంటుందని తెలిపారు. ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎస్ గోవిందరాజన్ మాట్లాడుతూ ఘంటసాల పేరుతో నిర్మాణమైన సంగీత కళాశాల వేలాది మంది సంగీత విద్వాంసులను తయారు చేసిందన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు తేజం ఘంటసాల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అప్పిశెట్టి రత్తయ్య, కనకారావు, లక్ష్మితులసి, పద్మావతి, పొత్తూరి మురళీ కృష్ణ, బి.వెంకటేశ్వరరావు ప్రసంగించారు. గీతాలను మధురంగా ఆలపించారు. ప్రతినిధులు ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు.

వయ'సై'న కుర్రాళ్లు

నేటి తరం యువతీ యువకులు క్రీడా సాధన, వ్యాయామానికి దూరంగా ఉండటంతో అనేక ఒత్తిడులకు లోనై అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్న వయస్సులోనే షుగర్, బీపీ, ఊబకాయం బారిన పడుతున్నారు. నడి వయసుకు రాగానే కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులతో నరకయాతన అనుభవిస్తున్నారు. కానీ క్రమం తప్పకుండా వ్యాయామం.. ఏదో క్రీడలో సాధన చేస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని నిపుణులు చెబుతున్నారు. ఏడు పదుల వయసు దాటినా ఇప్పటివరకు ఆసుపత్రి అంటే ఎలా ఉంటుందో తమకు తెలీదని కొందరు వయసైన కుర్రాళ్లు చెబుతున్నారు. ఇప్పటివరకు మందు బిళ్ల మింగకుండా నిత్యం ఆరోగ్యంగా జీవిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకు వీరు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నారు.



విజయవాడలోని రైల్వే స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న మాస్టర్ అథ్లెట్‌లు



ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో హర్డిల్స్ ప్రాక్టీస్ చేస్తున్న సత్యనారాయణ



డిస్కస్‌త్రో ప్రాక్టీస్ చేస్తున్న మాస్టర్ అథ్లెట్ గంగాధరరావు



జావెలెన్‌త్రో ప్రాక్టీస్ చేస్తున్న మాస్టర్ అథ్లెట్ ప్రసాదరావు

- 75 ఏళ్లు పైబడినా క్రీడలపై తగ్గని మక్కువ
- కఠోర శిక్షణతో రాణిస్తున్న వెటరన్ అథ్లెట్లు
- వ్యాయామం, యోగాతో నిత్య ఆరోగ్యవంతులుగా

విజయవాడ స్పోర్ట్స్: వయసు అనేది ఒక సంఖ్య మాత్రమే. వీరు అంకెలు చూసి బెదిరిపోయే రకాలు కాదు. ఏడు పదుల వయసులోనూ కుర్రాళ్లకు మేమేం తీసిపోం అంటూ పూర్తి ఫిట్‌నెస్‌తో అథ్లెట్లుగా రాణిస్తున్నారు. పదుల సంఖ్యలో పతకాలు సాధిస్తున్నారు. కుర్రాళ్లైనా ఏదో ఒక రోజు బద్ధకిస్తారేమో కానీ..వీరి వ్యాయామ సాధనకు సెలవంటూ లేదు. అందుకే మేం ఇంతవరకు ఆస్పత్రి మెట్లెక్కాల్సిన అవసరమే రాలేదంటూ సగర్వంగా చెబుతున్నారు ఈ సీనియర్ కుర్రాళ్లు. టీనేజ్‌లో మొదలెట్టిన సాధన ఇప్పటివరకూ నిరంతరాయంగా సాగుతూనే ఉంది. యుక్త వయసులో రాష్ట్ర, జాతీయ పతకాలతో మెరిసి, క్రీడా కోటాలో ఉద్యోగం సాధించారు. ఉద్యోగ విరమణ చేసినా క్రీడలను వదలకుండా జాతీయ మాస్టర్స్ పోటీల్లో తలపడుతూ పతకాలు సాధిస్తున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు జాగింగ్, వ్యాయామం, అల్పాహారం తీసుకున్న తరువాత రెండు గంటలు విశ్రాంతి, ఆ తరువాత మధ్యాహ్నం భోజనానికి ముందు రెండు గంటలు సాధన, తిరిగి సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 7.30 వరకు సాధన చేయడం వీరి దినచర్య. వీరి క్రీడా సాధనకు వారాంతపు సెలవలు ఉండవు.

క్రీడా సాధన వల్ల కలిగే మేలు

- ఉదయమే నిద్ర లేచే అలవాటు చేస్తుంది
- ఆవేశం, తొందరపాటును నియంత్రిస్తుంది
- చెడు అలవాట్లు (మద్యం, ధూమపానం)ను దరిచేరనివ్వదు
- ఇతరులకు హాని చేయాలనే తలంపు రానివ్వదు
- బద్ధకం వీడిపోయేలా చేస్తుంది
- సమయ పాలనను పాటించేలా చేస్తుంది
- మానసిక ప్రశాంతతను చేకూర్చుతుంది

ప్రతి రోజూ ఆరు గంటలు సాధన చేస్తా



నా వయసు 77 సంవత్సరాలు. నా 15వ ఏట క్రీడా సాధన ప్రారంభించాను. 20వ ఏట నుంచి ట్రిపుల్ జంప్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు సాధించాను. క్రీడా కోటాలో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత సాధన వదల్లేదు. రిటైర్ అయ్యే నాటికి 45 పతకాలు సాధించాను. రిటైర్ అయిన తరువాత మాస్టర్స్ అథ్లెట్‌గా మారి ట్రిపుల్ జంప్, హర్డిల్స్, డిస్కస్‌త్రో జాతీయ మాస్టర్స్ పోటీల్లో ఇప్పటివరకు 17 పతకాలు సాధించాను. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ప్రతి రోజూ ఆరు గంటలు క్రీడా సాధన చేస్తా. దీంతో పాటు ప్రతి రోజూ ఐదు కిలోమీటర్లు సైక్లింగ్ చేస్తా. టిఫిన్, భోజనంతో పాటు ప్రతి రోజూ నట్స్, బాదం, పళ్ల రసాలు తీసుకుంటాను.

– డి.వి.సుబ్బారావు, అథ్లెట్, విజయవాడ

ఇప్పటి వరకు ఆసుపత్రికి వెళ్లలేదు



నా 11వ ఏట నుంచే బేస్ బాల్, ఖోఖో క్రీడల్లో సాధన ప్రారంభించాను. కొన్నేళ్ల తరువాత స్కూల్లో టీచర్ల సలహా మేరకు కబడ్డీ శిక్షణ తీసుకుని సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు సాధించాను. పీఈటీగా ఉద్యోగం చేస్తూనే 53 ఏళ్లు వచ్చే వరకు కబడ్డీ ఆడుతూనే ఉన్నాను. రిటైర్ అయిన తరువాత మాస్టర్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటూ ఇప్పటివరకు 54 రాష్ట్ర, జాతీయ పతకాలు సాధించాను. ఇప్పుడు నాకు 76 ఏళ్లు. ఇప్పటి వరకు ఆసుపత్రి మెట్లు ఎక్కే అవసరం రాలేదు. ఇకపై కూడా రాదనుకుంటున్నా. ఎందుకంటే నా సీనియర్లు ఎవరూ ఆసుపత్రి ముఖం చూడలేదు.

– జి.వి.ప్రసాదరావు, అథ్లెట్, విజయవాడ

ఈ తరం కుర్రాళ్లతోనూ పోటీ పడతా



నా వయసు 84 సంవత్సరాలు. ప్రతి రోజూ ఆరు కిలోమీటర్లు వాకింగ్ చేస్తా. విజయవాడ రైల్వే స్టేడియంలో రోజుకి ఎనిమిది గంటలు సాధన చేస్తుంటా. స్పీడ్ వాక్, హ్యామర్, షార్ట్‌పుట్ పోటీల్లో కుర్రాళ్లతో పోటీ పడగలను. నా యుక్త వయసులో కుస్తీ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ పతకాలతో రాణించా. రైల్వేలో ఉద్యోగం చేస్తూ రిటైర్ అయిన తరువాత మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. షార్ట్‌పుట్, హ్యామర్, డిస్కస్ త్రో పోటీల్లో ఇప్పటివరకు 28 పతకాలు సాధించాను. 2019లో ఢిల్లీలో జరిగిన ఫిట్‌నెస్ కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ సన్మానం చేశారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నా.

– కె.గంగాధరరావు, విజయవాడ

విరబూసిన నాగమల్లి

- కంచల గ్రామంలో అరుదైన నాగమల్లి వృక్షాలు
- శివుడి పరోక్ష రూపమే నాగమల్లి పుష్పం
- కార్తికమాసం నేపథ్యంలో పుష్పాలకు పెరిగిన డిమాండ్





వృక్షానికి పూసిన నాగమల్లి పూలు

నందిగామ: అరుదుగా కన్పించే నాగమల్లి వృక్షానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భూమిపై అతి అరుదుగా కన్పించే ఈ వృక్షాలకు పూసే పువ్వులను కేవలం శివ పూజకు మాత్రమే వినియోగిస్తుంటారు. ఈ పుష్పం కూడా శివలింగంపై నాగాభరణం మాదిరి ఉండటంతో పాటు మధురమైన సువాసన వెదజల్లుతూ ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మొగలి చెట్ల వద్ద ఉన్నట్లుగానే నాగమల్లి వృక్షాల వద్ద కూడా పాములు అధికంగా సంచరిస్తుంటాయి. అందువల్ల ఈ వృక్షాన్ని భక్తులు దైవవృక్షంగా భావిస్తుంటారు. ఈ పూలు శివుని పరోక్ష రూపమని భక్తుల నమ్మకం. ముఖ్యంగా కార్తిక మాసంలో నాగమల్లి పూలతో శివునికి అభిషేకం చేస్తే ఎంతో పుణ్యమని భక్తుల భావన. దీనికి తోడు ఈ వృక్షానికి కార్తిక మాసంలో విరివిగా పూలు పూస్తుంటాయి. సూర్యోదయానికి ముందుగానే విచ్చుకునే నాగమల్లి పూలు ఉదయం 9 గంటలకల్లా రాలిపోతాయి. చూసేందుకు ఎంతో ధృడంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ పువ్వు చాలా సున్నితంగా ఉంటుంది. ఎంతో విలువైన, అరుదైన వృక్ష జాతికి చెందిన నాగమల్లి చెట్లు నందిగామ మండలం కంచల గ్రామంలోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్నాయి. ఈ వృక్షాలు ముత్యాల రాజావారి సమయంలో నాటినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఇవి ప్రస్తుతం మహావృక్షాలుగా మారి దర్శనమిస్తున్నాయి. వీటి వయస్సును కూడా గ్రామస్తులు అంచనా వేయలేని పరిస్థితి. శివుడికి అభిషేకం చేయించుకునేందుకు ఎంతో మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారని గ్రామస్తులు చెబుతుంటారు. ఈ వృక్షాలకు కాయలు కాసినప్పటికీ వాటికి విత్తనాలు రావని అంటున్నారు. ఇవి మన జిల్లాలో ఒకటి రెండు ప్రాంతాల్లోనే తప్ప మరెక్కడ లేవని గ్రామస్తులు తెలిపారు. ఎంతో విలువైన, అరుదైన, పవిత్రమైన నాగమల్లి వృక్షం కంచల గ్రామంలో ఉండటం తమ అదృష్టమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

★ బీఏ చదివి బజ్జీలు అమ్ముతూ...



ఈ చిత్రంలో కన్పిస్తున్న మహిళ పేరు షేక్ నాజిమ్మ. ఈమె బీఏ వరకు చదువుకుంది. తొలుత ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసింది. ఆ తర్వాత కొన్నాళ్లు ఇంటి వద్ద పిల్లలకు ట్యూషన్ చెప్పింది. ఆదాయం సరిపోక జీవనం కష్టంగా ఉండటంతో కుటుంబ పోషణ కోసం చిరు వ్యాపారం ప్రారంభించింది. ఇంటి వద్దే పూర్ణాలు, బజ్జీలు, పునుగులు, వడలు తయారు చేయడం నేర్చుకుంది. ఆ తర్వాత వాటన్నింటిని ఒక ప్లాస్టిక్ డబ్బాలో వేసుకొని వీధి వీధి తిరుగుతూ అమ్ముతుంది. మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో నుంచి బయలుదేరి వన్‌టౌన్ రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ తదితర ప్రాంతాల్లో రాత్రి ఎనిమిది గంటల వరకు నడుస్తూనే సరుకు విక్రయిస్తుంది. ఈ విధంగా ఆమె 17 సంవత్సరాలుగా చేస్తుంది. సరుకు తయారీకి రూ.2 వేలు ఖర్చు అవుతుందని లాభం మాత్రం రూ.500 -700 వరకు ఉంటుందని చెప్పింది. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ఒకరికి పెళ్లి చేయగా మరొకరిని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదివిస్తున్నానని తెలిపింది. వయసు పెరిగి ఆరోగ్యం సహకరించడం లేదని, అయినా కుటుంబ పోషణ కోసం సరుకు అమ్మేందుకు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఎవరైనా దాతలు ఒక తోపుడు బండి అందిస్తే దాన్ని ఒకే ప్రదేశంలో పెట్టుకొని తాను తయారు చేసిన పదార్థాలు అమ్ముకుంటానని తెలిపింది.



–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

- తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రెండో శనివారం, ఆదివారం వరుస శెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. ఏపీతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ. 300, వీఐపీ రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లను ఈవో భ్రమరాంబ పర్యవేక్షించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం....

మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. సాయంత్రం మూడు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వాహనాలతో ఘాట్‌రోడ్డుపై పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్లు ఇతర వాహనాలను కనకదుర్గనగర్‌కు మళ్లించారు. ఉదయం 11 గంటలకే కనకదుర్గనగర్ వాహనాలతో నిండిపోవడంతో వీఎంసీ కార్యాలయం, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పార్కింగ్ చేసుకొని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు.



అమ్మవారి సేవలో హీరో రాజ్‌తరుణ్, శివాని...

హీరో రాజ్‌తరుణ్, హీరోయిన్ శివాని దుర్గమ్మను దర్శించుకున్నారు. త్వరలో విడుదల కాబోయే సినిమా విజయవంతం కావాలంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచనం అందుకోగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందించారు.

ఆర్జిత సేవల్లో ఉభయదాతలు...

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి వారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నటరాజ స్వామి వారి కళావేదిక వద్ద నిర్వహించిన సహస్ర లింగార్చనలో పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య వధూవరుల ఉచిత పరిచయ వేదిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం శివాలయం సమీపంలోని దేసు సుబ్బారావు వెంకట నాగరత్నమ్మ–వాసవీ కళ్యాణ మండపంలో 13వ తేదీ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు వాసవీ సేవా సంఘం విజయవాడ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరిచయ వేదిక జరుగుతుందని, వివరాలకు 80743 59820, 92464 99154, 91823 16636 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ పరిచయ వేదికలో పెళ్లి సంబంధం కుదుర్చుకున్న పేద వధువు, వరుడులకు తమ కమిటీ వారు ఉచితంగా పెళ్లి చేస్తామని తెలియజేశారు.

లోక్ అదాలత్‌లో 20 వేల కేసుల పరిష్కారం

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో శనివారం రాత్రి 11:30 గంటల వరకు సుమారు 20 వేల కేసుల్లో కక్షిదారులు రాజీ పడినట్లు సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 25 వేల కేసుల్లో కక్షిదారులను రాజీ నిమిత్తం కోర్టు ముందుంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఇంకా కొనసాగుతుందన్నారు.

మోదీ పర్యటనకు నిరసనగా ప్రదర్శన

మైలవరం:రాష్ట్ర ప్రజల్ని ప్రధాని నరేంద్ర మోదీ మోసం చేశారని, ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రంలో అడుగు పెట్టారని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ తెలిపారు. మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా మైలవరం బోస్ బొమ్మ సెంటర్‌లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మట్టి ముంతలు, నీటి చెంబులు పట్టుకుని నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు. నూజివీడు రోడ్డులోని గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

సుడిదోమతో అన్నదాత అలజడి

- వరిలో ఉధృతమైన వైనం
- దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం
- రైతుల వెన్నులో వణుకు
- శాస్త్రవేత్తల బృందం పర్యటన



కంకిపాడులో కోతలకు సిద్ధంగా ఉన్న వరి చేలు



వరి దుబ్బులను ఆశించిన సుడిదోమ

కంకిపాడు:ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందే తరుణం ఆసన్నమైంది. మరో రెండు రోజుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. అన్నదాతలు వరి కోతలకు సిద్ధమయ్యే సమయంలో సుడిదోమ రూపంలో పిడుగు పడినట్లయింది. ఉధృతంగా వ్యాప్తి చెందుతుండటంతో రైతుల వెన్నులో వణుకు మొదలైంది. దోమ తీవ్రంగా ఉండటంతో పంట దిగుబడులు 30 శాతం నుంచి 90 శాతం వరకూ కోల్పోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తల బృందం హెచ్చరిస్తుంది. సస్యరక్షణ చర్యలు సకాలంలో తీసుకోవాలని, లేనిపక్షంలో నష్టం అపారంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

రెండు జిల్లాల్లో వరి సాగు ఇలా....

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా జిల్లాలో 3.95 లక్షల ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 1.13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు అయింది. తొలకరి వానలు, సకాలంలో కాలువలకు సమృద్ధిగా సాగు నీరు విడుదల, ఆర్‌బీకేల ద్వారా విత్తనాల సరఫరాతో ఖరీఫ్ వరి సాగు గత సీజన్‌లతో పోలిస్తే ముందుగానే ఆరంభమైంది. పెనమలూరు, గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరి పంట కోతకు చేరింది. దీంతో నవంబరు రెండో వారంలోనే ఉమ్మడి కృష్ణా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు.

కారణాలు ఇవే...

ప్రస్తుత పరిస్థితుల్లో సుడిదోమ వృద్ధి చెందటానికి గల కారణాలను శాస్త్రవేత్తల బృందం అధ్యయనం చేసింది. పురుగు మందులు విచక్షణారహితంగా చల్లటం, నత్రజని ఎరువులు అధిక మోతాదులో వాడటం, కాలిబాటలు తీయకపోవటం, వర్షాల అనంతరం అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావటం వల్ల సుడిదోమ ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. గోధుమ రంగు, బూడిద రంగులో వీపుపై తెల్ల మచ్చల దోమలను సుడిదోమగా గుర్తించాలని సూచించారు. దోమ ఉధృతితో పంట దిగుబడి 30 శాతం నుంచి 90 శాతం వరకూ తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటన....

చేతికి పంట అందనుండటంతో రైతులు వడివడిగా కోతలకు రెడీ అవుతున్నారు. ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.18 వరకూ పెట్టుబడులు పెట్టారు. కోతలకు సిద్ధమవుతున్న క్రమంలో సుడిదోమ వరి చేలల్లో వ్యాప్తి చెందుతుంది. చేలు సుడులు సుడులుగా రంగు మారి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కీటక నివారణ విభాగం శాస్త్రవేత్తల బృందం, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది ఇటీవల ఉమ్మడి కృష్ణా జిల్లాలో విస్తృతంగా పర్యటించింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, నందిగామ, కంచికచర్ల, కృష్ణా జిల్లాలో బాపులపాడు, గన్నవరం, అవనిగడ్డ పరిసరాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో సుడిదోమను బృందాలు గుర్తించాయి.

సస్యరక్షణ చర్యలతో సురక్షితం

దోమ ఉధృతిని గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే దిగుబడులను సురక్షితంగా కాపాడుకోవచ్చు. పొలాన్ని తరచూ ఎండ గట్టాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీసుకోవాలి. పురుగు ఉద్ధృతిని బట్టి యాజమాన్య చర్యలు తీసుకోవాలి. దుబ్బుకి 10–15 పురుగులు గుర్తిస్తే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా, బుప్రోఫెజిన్ 1.6 మిల్లీలీటర్లు, ఇథోఫెన్‌ప్రాక్స్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. దుబ్బుకి 20–25 పురుగులు మించి ఉంటే ఇమిడాక్లోప్రిడ్+ఎథిప్రోల్ 0.25 గ్రాములు, లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 మిల్లీలీటర్లు, లేదా పైమిట్రోజిన్ 0.6 గ్రాములు, లేదా పెక్సలోన్ 0.4–0.5మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవటం ద్వారా దోమను నియంత్రించి పంటను కాపాడుకోవచ్చు.

డాక్టర్ డి.సుధారాణి, సీనియర్ శాస్త్రవేత్త, కీటక నివారణ విభాగం, చెరకు పరిశోధనాస్థానం, ఉయ్యూరు

కలంకారి మ్యూజియంను సందర్శించిన డీఆర్ఎం


కలంకారి మ్యూజియంలో డీఆర్ఎం శివేంద్రమోహన్ దంపతులు

పెడన: పెడన పట్టణంలోని కలంకారి మ్యూజియంను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శివేంద్రమోహన్ సందర్శించారు. శనివారం ఫ్యామిలీతో కృష్ణాజిల్లా పెడన విచ్చేసిన ఆయన ముందుగా పెడన రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ ప్రయాణికులకు, స్టేషన్ పరంగా చేపట్టిన చర్యలు, పరిశుభ్రత తదితర వాటిని పరిశీలించారు. స్టేషన్ మెయింటెన్స్, సిబ్బంది, రోజువారి ప్రయాణికులు తదితర వివరాలను స్టేషన్ ఎస్ఎస్ ఎన్.పోతురాజు డీఆర్ఎంకు వివరించారు. డీఆర్ఎం అనంతరం అక్కడ నుంచి పిచ్చుక శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన కలంకారి మ్యూజియంను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ కుమారుడు వరుణ్ డీఆర్ఎం దంపతులకు కలంకారి గురించి వారికి తెలియజేశారు.

నకిలీ సేల్ ట్యాక్స్ అధికారుల అరెస్ట్

జి.కొండూరు: సేల్ ట్యాక్స్ అధికారులమంటూ ట్రాక్టరు డ్రైవర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ సేల్ ట్యాక్స్ కార్యాలయంలో ఓ అధికారి దగ్గర డ్రైవరుగా పని చేస్తున్న పగిడిపల్లి చిరంజీవి అతని స్నేహితుడు తాళ్లూరి శ్రీరామ్ కారులో వచ్చి జి.కొండూరు మండల పరిధి మునగపాడు గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై శనివారం రాత్రి మాటు వేశారు. రహదారిపై వస్తున్న వాహనాలను ఆపి తాము సేల్‌ట్యాక్స్ అధికారులమంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెల్లటూరు గ్రామానికి చెందిన దొప్పల రాజారావు అనే వ్యక్తి తన కట్టెలలోడు ట్రాక్టరుతో గంగినేని వైపు నుంచి జి.కొండూరు వైపు వస్తున్నాడు. మునగపాడు గ్రామ శివారులోకి రాగానే చిరంజీవి, శ్రీరామ్‌లు ఇద్దరూ ట్రాక్టరును ఆపి తాము సేల్ ట్యాక్స్ అధికారులమంటూ డబ్బులు డిమాండ్ చేశారు. దీనితో అనుమానం వచ్చిన ట్రాక్టరు డ్రైవరు రాజారావు తన పక్కన ఉన్న మరో వ్యక్తి సహాయంతో ఇద్దరిని పట్టుకొని జి.కొండూరు పోలీసులకు అప్పగించారు. ట్రాక్టరు డ్రైవరు రాజారావు పిర్యాదు మేరకు ఇద్దరు నకిలీ సేల్‌ట్యాక్స్ అధికారులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సమస్యలతో తిప్పలు

'పట్టణానికి చెందిన ఓ యువకుడు ఓ రోజు రాత్రి బర్త్‌డే పార్టీకి హాజరయ్యాడు. అతిగా ఆహారం తీసుకున్నాడు. తెల్లవారు జామున ఛాతి నొప్పికి గురయ్యాడు. తొలుత పొట్టలో మంటగా ప్రారంభమైంది. నొప్పి తట్టుకోలేకపోవడంతో ఆందోళనతో ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు చేసి గ్యాస్ట్రోఎంటరాలజీ సమస్యగా గుర్తించారు'. రెండు రోజులుపైగా ఆస్పత్రి ఉండి నెమ్మదిగా కోలుకున్నాడు. ఇలాంటి సమస్యలతో తరచూ ఆస్పత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది.

- పెరుగుతున్న సంబంధిత రోగులు
- జీజీహెచ్‌కు క్యూ కడుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతోనే చెక్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలితో ముప్పు పొంచిఉంది. గ్యాస్ట్రోఎంటరాలజీ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఛాతిలో మంట, గుండెలో మంట వస్తుండటంతో గుండెపోటు వస్తుందేమోననే భయంతో అనేక మంది వైద్యులకు వద్దకు పరుగులు తీస్తున్నారు. సమస్య ఎదుర్కొంటున్న వారు సక్రమంగా కూర్చొలేకపోవడం, తినలేకపోవడం బాధాకరం. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయని పక్షంలో తీవ్ర ప్రమాదానికి దారి తీస్తోంది. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఛాతిలో మంట బాధితుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిఫ్లక్స్ గ్యాస్ సమస్య

సాధారణంగా మనం నోటితో తీసుకున్న ఆహారం ఆహార నాళం ద్వారా కిందకు వెళ్లి పొట్టలోకి చేరుతోంది. ఆ ఆహారం రెండు గంటలపాటు పొట్టలో ఉండి, పొట్టలోని యాసిడ్‌తో కలసి పొట్ట కదలికలతో చిన్న చిన్న ముక్కలుగా చేయబడి తరువాత పైలోరస్ ద్వారం దాటి చిన్నపేగులోకి వెళుతోంది. కొన్ని కారణాల వల్ల పొట్టలో ఉన్న యాసిడ్‌తో కలసిన ఆహారం జీఈ జంక్షన్ ద్వారం దాటి మరలా వెనుకకు పైన ఉన్న ఆహార నాళంలోకి రిఫ్లక్స్ అవుతోంది. తద్వారా రోగికి ఛాతిలో మంట, తేపులు, గొంతులో మంట వస్తాయి.

కారణాలు

ఛాతిలో మంట రావడానికి జీఈ జంక్షన్ ద్వారం వదులుగా మారడం వల్ల ఛాతిలో మంట వస్తుంది. ధూమపానం, ఆల్కాహాల్ వల్ల ద్వారం వదులుగా మారుతోంది. పొట్ట బిగుతుగా ఉండటం వల్ల(కడుపునిండుగా తినడం వల్ల), బిగుతు దుస్తులు, పొట్ట బిగుతు చేసే వ్యాయామం వల్ల, నిండు గర్భిణి పొట్టవల్ల ఛాతిలో మంట వస్తుంది. ఆహారం తిన్న తరువాత రెండు గంటల్లోపు వెల్లికలా పడుకోవడం లేదా ముందుకు వంగడం వంటి పనులు చేయడం వల్ల, పొట్టలోని ఆహారం థైరాయిడ్, షుగర్ వల్ల ఆలస్యంగా ముందుకు కదలడం వల్ల ఛాతిలో మంట వస్తుంది.



సంవత్సరం	రోగులు
2020	6,720 మంది
2021	8,160 మంది
2022	9,600 మంది

లక్షణాలు

గుండెలో మంట, తేపులు, నోటిలో లాలాజలం ఊరడం, గుండెలో, గొంతులో పట్టినట్లు ఉండటం, గొంతులో ఏదో అడ్డుపడినట్లు ఉండటం, గొంతు మంట, గొంతు బొంగరుపోవుట, చెవి, గొంతు, పంటి నొప్పి, గ్యాస్ పైకి తన్నడం, దీర్ఘకాలిక దగ్గు, నోటి దుర్వాసన, రిఫ్లక్స్ గ్యాస్ సమస్య వల్ల కొంత మందికి ఆయాసం కూడా వస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. కొంచెం కొంచెం ఆహారం ఎక్కువ సార్లు తినాలి. తిన్న తరువాత రెండు గంటల వరకు నిటారుగా కూర్చొని లేదా నిలబడి చేసే పనులు చేయాలి. తిన్న తరువాత రెండుగంటల వరకు వంగి చేసే పనులు ఏమీ చేయకూడదు. వేగంగా నడక, సైకిల్ తొక్కడం వంటి వ్యాయామాలు చేయాలి. ఆహార నియమాలు పాటించాలి. పొట్ట పెరగకుండా ఉండేటట్లు చూసుకోవాలి. బరువు తగ్గించుకోవాలి. తల ఎప్పుడూ సాధ్యమైనంత ఎత్తు పెట్టుకుని పడుకోవాలి.

గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



రిఫ్లక్స్ అనేది షుగర్, బీపీలాగా దీర్ఘకాలిక వ్యాధి. ప్రతిఏడాది గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. జాగ్రత్తలు తీసుకోకపోతే అల్సర్లు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వస్తాయి. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జీవన శైలి మార్చుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. జాగ్రత్తలు పాటిస్తూ అప్పుడప్పుడు మందులు వాడితే ఇబ్బంది ఉండదు. రిఫ్లక్స్ గ్యాస్ సమస్య బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్

పాటించాల్సిన ఆహార నియమాలు

బిర్యానీ, చాక్లెట్లు, పచ్చి ఉల్లిపాయలు, మసాలా పదార్థాలు, కాఫీ, నిమ్మరసం, టమోటా సాస్ తగ్గించాలి. ధూమపానం, ఆల్కాహాల్, గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్, నొప్పి మాత్రలు, ఊరగాయ పచ్చళ్లు, తిన్న వెంటనే పడుకోవడం పూర్తిగా మానేయాలి.

వైద్య సేవల్లో దేశంలోనే అగ్రగామి ఆంధ్రప్రదేశ్

హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

గన్నవరం రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలు అందిస్తున్నారని ఏపీ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు చెప్పారు. శనివారం కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జరిగిన ఆపరేషన్ స్మైల్ ప్రాజెక్టు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిసిమ్స్ మెడికల్ కళాశాలలో ఆపరేషన్ స్మైల్, ఇంగా హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రహణం మొర్రి, పెదవి, అంగిలి చీలిక రోగులకు ఉచితంగా 96 శస్త్ర చికిత్సలు చేయటం అభినందనీయమని చెప్పారు. ఇదే కృషి కొనసాగించాలని, గ్రహణం మొర్రి సర్జరీలు నిరంతరం చేయడానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకానికి ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తూ, ప్రతి సంవత్సరం 12 లక్షల మంది ప్రజలకు ఉచితంగా ఆరోగ్య శ్రీ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఎంతో శ్రద్ధ ఉందని, ఒక్క వైద్య ఆరోగ్య శాఖలో సీఎం కొత్తగా 46వేల ఉద్యోగాలు ఏఎన్ఎం నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యుల వరకూ నియమించటం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో వైద్యాన్ని పేదల పరం చేయడానికి 2500 జనాభా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఏఎన్ఎంలు, ఆశాలతో ఆరుగురి సిబ్బందిని నియమించటం జరిగిందన్నారు. దిగువ తరగతి వెనుకబడిన మహిళల్లో దేశవ్యాప్తంగా 58 శాతం మందికి ఎనిమిక్ ఇబ్బందులు ఉండగా రాష్ట్రంలో ఆ శాతం 53గా ఉందన్నారు. దానిని సైతం నివారించేందుకు హెల్త్ సెక్టార్‌లో హాట్‌మీల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, న్యూట్రిషన్ ఫుడ్ గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నట్లు చెప్పారు. మందులను కంటిన్యూస్ సప్లయ్ చేయిస్తున్నట్లు వివరించారు. ఆపరేషన్ స్మైల్ ప్రాజక్టు ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు 96 శస్త్ర చికిత్సలు చేసి వారి కుటుంబాల్లో నవ్వులను నింపారన్నారు. సేవలందించిన ఆపరేషన్ స్మైల్, ఇంగా హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులకు, డాక్టర్‌లకు, నర్సులకు, టెక్నీషియన్లకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కృష్ణబాబును కళాశాల యాజమాన్యం శాలువాలతో సత్కరించి మెమెంటో అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి, ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులు డాక్టర్ మహాశ్వేత దూబే, డాక్టర్ అభిషేక్ సేన్ గుప్తా, డాక్టర్ విజయ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, ఏవో టీవీ సుబ్బారావు పాల్గొన్నారు.


ఆపరేషన్ స్మైల్ ప్రతినిధి శ్వేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

ఉత్కంఠగా రెవెన్యూ ఉద్యోగుల ఆటలు

- క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో పోటాపోటీ ప్రదర్శన
- రెండో రోజూ ఉత్సాహంగా సాగిన క్రీడలు
- నేటితో ముగియనున్న పోటీలు
- ముగింపు సభకు ప్రభుత్వ సలహాదారులు, మంత్రులు హాజరు

ఏఎన్‌యూ: నిత్యం విధి నిర్వహణ, పని ఒత్తిడితో ఉండే రెవెన్యూ ఉద్యోగులు అన్నింటినీ పక్కన బెట్టి ఆటవిడుపుగా గడుపుతున్నారు. ఉద్యోగం, కుటుంబాలకు సంబంధించిన సమస్యలన్నింటినీ పక్కన బెట్టి సంతోష ప్రపంచంలో మునిగితేలుతున్నారు. చిన్నా పెద్దా, అధికారి, సహాయకుడు అనే భేదం లేకుండా వీఆర్ఏ నుంచి డెప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగులందరూ ఒకచోట సరదాగా ఆడిపాడుతున్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీలలో రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పోటీలలో రెండో రోజైన శనివారం పలు అంశాలలో జరిగిన క్రీడల్లో పలు జిల్లాల ఉద్యోగులు పోటాపోటీగా క్రీడాప్రతిభ కనబరిచారు.

పోటీల వివరాలు...

పురుషుల 45 ఏళ్లు పైబడిన కేటగిరీలో.. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, 45 ఏళ్ల లోపు విభాగంలో.. లాంగ్‌జంప్, జావలిన్ త్రో, 400 మీటర్ల పరుగు, 4+400 మీటర్ల పరుగు అంశాల్లో పోటీలు నిర్వహించారు. మహిళల 45 ఏళ్లు పైబడిన కేటగిరీలో.. డిస్కస్‌త్రో, 45 ఏళ్ల లోపు కేటగిరీలో షాట్‌పుట్, జావలిన్‌త్రో, లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగు, త్రోబాల్, 4-400 మీటర్ల పరుగు అంశాలలో పలు జిల్లాల మధ్య పోటీలు జరిగాయి.

నేటితో ముగియనున్న పోటీలు..

రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సభకు రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆర్‌కే రోజా, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజని, ముఖ్య అతిథిగా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారు.


లాంగ్ జంప్ పోటీల్లో క్రీడాకారిణి


కబడ్డీ పోటీలో ఉత్సాహంగా క్రీడాకారులు

కంప్యూటర్స్‌దే క్రేజ్..!

- ముగిసిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్
- ఉమ్మడి కృష్ణాలో 28 కాలేజీల్లో 13,335 సీట్లు
- అన్ని బ్రాంచిలు కలుపుకొని 9,988 సీట్లు భర్తీ
- కంప్యూటర్ సైన్సులో అత్యధికంగా 91.31 శాతం భర్తీ
- ఈ ఏడాది నైపుణ్య కోర్సులకు ప్రాధాన్యత
- విద్యా, వసతి దీవెనతో చదువులకు భరోసా


కృష్ణా వర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు

మచిలీపట్నం: ఇంజనీరింగ్ కాలేజీల్లో 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ ఏడాది కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 28 కాలేజీల్లో ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ అనుమతులు ఇచ్చింది. వీటిలో 13,335 సీట్లు అందుబాటులో ఉండగా, 9,988 సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్స్ సైన్సులోనే అత్యధికంగా 91.31 శాతం భర్తీ అయ్యాయి. మెకానికల్ బ్రాంచ్‌లో కేవలం 23.94 శాతం మాత్రమే సీట్లు నిండాయి. తుది విడత కౌన్సెలింగ్ సైతం ముగియటంతో తరగతుల నిర్వహణపై సాంకేతిక విద్యాశాఖ దృష్టి సారించింది. ఉన్నతాధికారులు ఈ మేరకు వార్షిక క్యాలెండర్ అమలుకు కాలేజీలకు దిశ, నిర్దేశం చేశారు.

నైపుణ్య చదువులకు ప్రాధాన్యత..

ఇంజనీరింగ్ చదువుకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ విద్యాసంవత్సరం నుంచి కోర్సుల నిర్వహణలో సాంకేతిక విద్యాశాఖ సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కించుకునేలా ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. పేరొందిన పారిశ్రామిక, కార్పొరేట్ కంపెనీలతో ప్రభుత్వం చేసుకున్న ముందస్తున్న ఒప్పందంలో భాగంగా ఎక్కువ మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలు పొందేలా సాంకేతిక విద్యాశాఖ తగిన కార్యాచరణతో ముందుకెళ్తోంది. తంథన్‌గా జగనన్న ఫీజుల పథకం అమలౌతుండటంతో విద్యార్థులు దర్జాగా ఉన్నత చదువుల వైపు అడుగులు వేస్తున్నారు.

కంప్యూటర్ బ్రాంచ్‌లకే క్రేజ్..

ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్సు ఎవర్ గ్రీన్‌గా నిలుస్తోంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని 28 కాలేజీల్లో 3,267 సీఎస్ఈ సీట్లు అందుబాటులో ఉండగా, ఇందులో 2,983 భర్తీ కావటం ద్వారా, 91.31 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. కంప్యూటర్స్ అనుబంధ కోర్సులైన ఏఎస్ఈ, సీబీఏ, సీబీసీ, సీఎస్ఈఆర్, సీఎస్‌వో,ఈఐఈ వంటి బ్రాంచ్‌ల్లో నూరుశాతం సీట్లు నిండాయి. ఇక ఎలక్ట్రానిక్స్‌లో 78.12 శాతం, ఎలక్ట్రిల్‌లో 58.54 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

తొమ్మిది కాలేజీల్లో నిల్..

కోర్ బ్రాంచ్‌లుగా ఒకప్పుడు మంచి డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్స్ బ్రాంచ్‌లకు క్రమేపీ ఆదరణ తగ్గుతుంది. సివిల్ ఇంజనీర్ బ్రాంచ్‌లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 28 కాలేజీల్లో 864 సీట్లు ఉంటే, ఇందులో 254 నిండాయి. మెకానికల్ 1,149 సీట్లుకు 275 భర్తీ అయ్యాయి. ఈ రెండు బ్రాంచ్‌ల్లో ఏడు కాలేజీల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. అదే విధంగా ఐదు కాలేజీలు మినహా మిగతా 23 కాలేజీల్లో పది మంది లోపే విద్యార్థులు చేరారు.

నైపుణ్యాన్ని పెంచుకోవాలి..



ఇంజనీరింగ్ విద్యకు మంచి క్రేజ్ ఉంది. పట్టాతో కాలేజీల నుంచి బయటకు వచ్చేసరికి కచ్చితంగా కొలువు దక్కించుకోవచ్చు. విద్యార్థులకు మరింత మేలు చేసేలా ప్రభుత్వం ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉన్నత విద్యలో ఏ కోర్సు ఎంచుకున్నా, దానిలో నైపుణ్యత ఉన్న వారికే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

– డాక్టర్ ఎం.రామిరెడ్డి, రిజిస్ట్రార్, కృష్ణా యూనివర్సిటీ

విద్యార్థులకు నాణ్యమైన చదువులు...



విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపుతారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధ తీసుకుంటాం. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రత్యేక కృషితో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇచ్చేందుకు బెల్ వంటి సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇది శుభ పరిణామం.

– డాక్టర్ బాబురెడ్డి, ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ కాలేజీ, కృష్ణా యూనివర్సిటీ

'గుంటూరు జిల్లా పెద వడ్లపూడికి చెందిన యువతికి బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన యువకుడితో ఐదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరూ చదువుకున్నావారే. ఇద్దరి మధ్య చిన్నపాటి కలతలు ఉన్నా నాలుగేళ్లపాటు నెట్టుకొచ్చారు. కానీ కలతలు పెద్దవి కావడంతో తెగతెంపులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు, పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తిరిగి డొమెస్టిక్ వైలెన్స్ సెంటర్‌కు వెళ్లడంతో అక్కడ కౌన్సెలింగ్ చేసినా కుదరకపోవడంతో శాశ్వత భరణం కోసం యువకుడు రూ.6 లక్షలు యువతికి ఇచ్చేసి తెగతెంపులు చేసుకున్నారు.

'సంతమాగులూరు మండలానికి చెందిన యువతికి గుంటూరు జిల్లా ఫిరంగిపురానికి చెందిన యువకుడితో రెండేళ్ల కిందట వివాహమైంది. ఆ ఇద్దరూ కూడా చదువుకున్నవారే. కానీ పెళ్లయినప్పటి నుంచి ఇరుపక్షాల తల్లిదండ్రుల మధ్య చిన్నపాటి మనస్పర్థలు పెద్దవి కావడంతో డొమెస్టిక్ వైలెన్స్ సెంటర్‌కు వెళ్లారు. అక్కడ కౌన్సెలింగ్ చేసి ఇద్దరిని కలిపారు'

కలహాల కాపురాలు

- పెళ్లయిన ఏడాదిలోనే కౌన్సెలింగ్ సెంటర్లకు
- కలహాలతో విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు
- ఆరు నెలల వ్యవధిలో డొమెస్టిక్ వైలెన్స్ సెంటర్‌కు 38 జంటలు
- నాలుగు జంటలు మాత్రమే కలయిక
- మిగిలిన 31 జంటలు తెగతెంపుల కోసం న్యాయపోరాటం



సాక్షి, బాపట్ల: పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు... వేద మంత్రాల సాక్షిగా ఏడగులు నడిచి ఒకటైన జంటలు అనతి కాలంలోనే కలహాలతో విడిపోయేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు కారణం ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం, దురలవాట్లు, వివాహేతర సంబంధాలు, వరకట్నాలు వెరసి కలహాలతో కాపురాలను నెట్టుకురాలేకపోతున్నారు. జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే డొమెస్టిక్ వైలెన్స్ సెంటర్‌కు గడిచిన ఆరు నెలల వ్యవధిలో 38 జంటలు తెగతెంపుల కోసం ఆశ్రయించాయి. పెళ్లయిన ఏడాది కాలం నుంచి కుటుంబ కలహాలతో విడిపోయేందుకు వచ్చిన జంటలే.. వారిలో ఎక్కువ మంది చదువుకున్న జంటలు కావడం విశేషం.

- ఆరునెలల వ్యవధిలో వచ్చిన 38 జంటలకుగాను 25 జంటలు న్యాయం కోసం కోర్టుకు వెళ్లాయి. అందులో నాలుగు జంటలు మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా మళ్లీ కలుసుకున్నారు. ఇంకా మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- జిల్లాలో అధికంగా అద్దంకి నియోజకవర్గం నుంచే 14 మంది జంటలు కుటుంబ కలహాల నేపథ్యంలో విడిపోయేందుకు ఆశ్రయించాయి. బాపట్లలో ఐదు జంటలు, రేపల్లెలో 4, తెనాలిలో మూడు జంటలు వచ్చాయి.

విడిపోవడానికి కారణాలివే..

కాపురాల్లో కలతలు రావడానికి ప్రధానంగా వివాహేతర సంబంధాలు, మద్యపానం, వరకట్నం, పంతాలకు పోవడం ప్రధాన కారణాలుగా కౌన్సెలింగ్ నిపుణులు చెపుతున్నారు. పాశ్చాత్య పోకడలు, సెల్‌ఫోన్ల ప్రభావం కూడా వారిపై పనిచేస్తోందంటున్నారు.

కౌన్సెలింగ్ ద్వారానే కలపాలని చూస్తాం..

కుటుంబ కలహాలతో ఎక్కువ మంది విడిపోయేందుకు వస్తున్నారు. వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. కౌన్సెలింగ్ ద్వారా కలవకపోతే విడిపోయేందుకు ఇక్కడే పరిష్కారం చూపుతాం. అలా కుదరకపోతే కోర్టులో కేసు ఫైల్ చేస్తాం. చాలా వరకు పంతాలు, పట్టింపులు, వరకట్న వేధింపులు, ఆల్కాహాలు ప్రభావంతో విడిపోతున్నారు. చిన్నపాటి కలహాలతో కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవద్దు.

–ఎం.వినతి, సోషల్ కౌన్సెలర్

కాపురాలు విచ్ఛిన్నం చేసుకోవద్దు



చిన్నపాటి కలహాలతో కాపురాలు విచ్ఛిన్నం చేసుకోవద్దు.. పంతాలకు పోయి విడిపోవడం మంచిది కాదు. పెళ్లంటే నూరేళ్ల కలిసి జీవించేది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు వస్తాయి. వాటిని సరిచేసుకోవాలే తప్ప విడిపోవడం మంచిది కాదు.

– శైలజ, ఇన్‌చార్జి పీడీ, ఐసీడీఎస్

కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు

యువ కథానాయకుడు రాజ్ తరుణ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కథలో బలం ఉంటే ఏ చిత్రమైనా, వెబ్ సిరీస్ అయినా ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని యువ కథనాయకుడు రాజ్ తరుణ్ అన్నారు. సీనియర్ నటుడు రాజశేఖర్ కుమార్తె శివాని, రాజ్‌తరుణ్ జంటగా నటించిన వెబ్ సీరిస్ అహ నా పెళ్లంట ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవా నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ మాట్లాడుతూ తాను తొలిసారిగా వెబ్ సిరీస్‌లో నటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదని, ఓటీటీలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందుకే వెండితెరతో పాటు, బుల్లితెరలో కూడా ప్రేక్షకులను ఆదరించేందుకు వెబ్‌సిరీస్‌లో నటించినట్లు తెలిపారు. అహ నా పెళ్లంట వెబ్ సిరీస్ 8 ఎపిసోడ్‌లతో ముందుకు సాగుతుందని, ఆద్యంతం కామెడీ ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. తొలిసారిగా వెబ్‌సిరీస్‌లో మూడు పాటలను దర్శకుడు రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 17న జీ5లో అహ నా పెళ్లంట వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుందని ప్రేక్షకులు తప్పక ఆదరించాలని రాజ్ తరుణ్ కోరారు. శివానీ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రేక్షకులు ఓటీటీలను ఎంతగానో ఆదరించారని, తన మొదటి చిత్రం అద్భుతం కూడా ఓటీటీలోనే రిలీజై ప్రేక్షకాదరణ పొందినట్లు తెలిపారు. ఈ వెబ్ సిరీస్‌ను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.


హీరో హీరోయిన్లు రాజ్‌తరుణ్, శివానీ

విలేకరులపై కేసు నమోదు

విస్సన్నపేట: వాహనాలు ఆపి, రికార్డులు చూపమని అడగటంతో పాటు నగదు డిమాండ్ చేసిన ముగ్గురు విలేకరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పరిమి కిషోర్ తెలిపిన వివరాల మేరకు... ఏలూరుకు చెందిన ఆర్నెపల్లి తిరుపతి, మరో ఇద్దరు స్నేహితులతో తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుంచి ఏలూరుకు కారులో బయలుదేరారు. కొండపర్వ–నూజివీడు రోడ్డులో వెళుతున్న కారును ఒక దినపత్రిక రిపోర్టర్ (సాక్షి కాదు), రెండు టీవీ చానళ్ల రిపోర్టర్లు (సాక్షి కాదు) ఆపి రికార్డులు చూపించమన్నారు. దీంతో పాటు నగదు డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులు రేషన్ బియ్యం తరలించే వాహనాలను ఆపి డబ్బు డిమాండ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, నేటి తరాలను గ్రంథాలయాలకు సన్నిహితం చేయడమే ధ్యేయంగా ఈనెల 14 నుంచి 20 వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. శనివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, తానేటి వనిత, జోగి రమేష్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ మాట్లాడుతూ 13 జిల్లాల చైర్మన్లు, చైర్ పర్సన్లుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న మొదటి జాతీయ వారోత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఎం.ఆర్.ప్రసన్న కుమార్, డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన శేషగిరిరావు

క్లుప్తంగా

యువజనోత్సవాల్లో నలంద విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట(విజయవాడతూర్పు) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాల్లో పలు అంశాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. వక్తృత్వం, మోడ్రన్ సాంగ్(సోలో), ఒన్ యాక్ట్ ప్లే, జానపద నృత్యం, క్లాసికల్ నృత్యాల్లో బహుమతులు గెలుపొందారన్నారు. వక్తృత్వంలో ప్రథమ బహుమతి పొందిన సబీహ తబసుమ్ రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. 14న జరిగే ప్రారంభోత్సవ సభతో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తామన్నారు. అదే రోజు కేబీఎన్ కళాశాల ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పోటీలు జరుగుతాయని చెప్పారు. 15వ తేదీన కేబీఎన్ కళాశాల డిగ్రీ విద్యార్థులకు, నగరంలోని విద్యా సంస్థలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు స్పెల్‌బీ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 16న కేబీఎన్ సైన్స్ విద్యార్థులకు, నగరంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్, క్విజ్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 17న డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు, 18న డిగ్రీ విద్యార్థులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న జరిగే ప్రారంభోత్సవ సభకు ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా పర్యవేక్షణాధికారి పి.రవికుమార్, 19వ తేదీన జరిగే ముగింపు సభకు ఏపీ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. పూర్తి వివరాలకు 96766 85698 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు నూతన కమిటీ ప్రమాణస్వీకారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ది కృష్ణాజిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ఈడుపుగల్లులోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎందువ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన నేపథ్యంలో సంఘం కృష్ణాజిల్లాకు నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ భవానీ ప్రియతో పాటుగా సంఘం ముఖ్య నాయకులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సంఘం కమిటీ సభ్యులతో పాటు సామాజిక వర్గానికి చెందిన వారందరూ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పశువులను తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పరిమితికి మించి పశువులను తరలిస్తున్న వాహనాన్ని కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కేరళ రాష్ట్రానికి చెందిన నౌషద్ అహ్మద్ జంషీర్ గత కొంతకాలంగా పశువులను కొనుగోలు చేసి విక్రయించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం శ్రీకాకుళంలో 24 పశువులను కొనుగోలు చేసి ఒక కంటైనర్‌లో కేరళ రాష్ట్రానికి తరలిస్తున్నాడు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో కంటైనర్ వారధి మీదుగా గుంటూరు వైపు వెళ్తుంది. వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వారధి వద్ద కంటైనర్‌ను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 15కు మించి పశువులను తరలించకూడదని నిబంధనలు ఉన్నా అంతకు మించి 24 పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను సీజ్ చేసి పశువుల వ్యాపారి జంషీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోశాలకు తరలించి, జంషీర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ క్లయిమ్‌ల సాధనకై పోరాటానికి సిద్ధం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): మూడున్నర దశాబ్దాల కార్మికుల పోరాటాలతో సాధించుకున్న భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండింగ్ క్లయిమ్‌ల సాధనకై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి శశికుమార్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో శశికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ధరలను నియంత్రించి నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని కోరారు. సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రమణారావు, ఆర్‌వి నరసింహారావు, గౌరవాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పిల్లి నరసింహారావు, కోశాధికారి గోపాలరావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, బాబూరావు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ కాలనీలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న రోగులు



హెచ్‌బీ కాలనీ అర్బన్ పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆరోగ్యానికి భరోసా.. అర్బన్ పీహెచ్‌సీలు

విజయవాడ నగరంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయి. పీహెచ్‌సీల్లో డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందిస్తున్నారు. ప్రత్యేకంగా 64 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. అత్యవసర వైద్యం అవసరమైన వారికి క్యాజువాలిటీలో చికిత్స అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. పీహెచ్‌సీల్లో వసతులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రోగుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు



38వ డివిజన్‌లోని పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ఉత్సాహంగా చిల్డ్రన్స్ డే వేడుకలు



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వీర మాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శనివారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు జవహర్‌లాల్ నెహ్రూ వేషధారణతో పాటు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలు చేశారు. హై స్కూల్ ప్రిన్సిపాల్ సీతారామయ్య, జయలక్ష్మితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నెహ్రూ జీవిత విశేషాలను తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరం మరింత కనువిందు చేసేలా రహదారులకు ఇరువైపులా ఆకర్షణీయంగా ఉండే మొక్కలను నాటాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులను కోరారు. నగరం... పచ్చల హారంలో భాగంగా రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంపై శనివారం కలెక్టర్ ఢిల్లీరావు నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి చేరుకునే రహదారులకు ఇరువైపులా కనీసం 100 మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఆకర్షణీయంగా ఉండే పూల మొక్కలైన లాగర్ స్ట్రోమియా, బహునియా, కాసియా ఫిస్టులా, జకరండ ఎవెన్యూ, ఆర్నమెంటల్ బ్యాంబూ, చంపక, రాయల్ పామ్, బూటియా, చెర్రీ ట్రీ రకం మొక్కలను పెంచడం ద్వారా నగరం సుందరీకరణ సంతరించుకుంటుందని కలెక్టర్ అన్నారు. మొక్కలు నాటి వాటిని ట్రీ గార్డుల ద్వారా సంరక్షించాలని చెప్పారు.

భవానీద్వీపంలో 1978 స్టార్స్ ఆత్మీయ కలయిక



భవానీపురం(విజయవాడ పశ్చిమ): బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి పట్టా తీసుకుని నాలుగు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా 1978 బ్యాచ్ విద్యార్థులు బంధం పేరుతో భవానీ ద్వీపంలో ఆటపాటలతో హోరెత్తించారు. కుటుంబ సభ్యులతో హాజరైన 75 మంది పూర్వ విద్యార్థులు అరవైలో ఇరవై మాదిరిగా హోదాలు మరిచి ఆటపాటలతో గడిపారు. డీజీపీలుగా పనిచేసిన జే పూర్ణచంద్రరావు, డీ కనకరత్నం, ఆదాయపు పన్ను శాఖలో చీఫ్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ప్రసాద్, నాబార్డ్ పూర్వ చైర్మన్ చింతల గోవిందరాజులుతో సహా వివిధ శాఖల్లో ఉన్నత పదవులు నిర్వహించిన వారందరూ 'బంధం' వేడుకకు హాజరయ్యారు. ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్ట్స్, బ్యాడ్జెస్ ధరించి బాపట్ల కళాశాలలో చదువుకున్న రోజుల్లోని స్మృతులను నెమరువేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి గతంలో మాదిరిగానే తమ వంతు చేయూత అందించాలని నిర్ణయించుకున్నారు. సమన్వయకర్తలుగా యాగంటి వెంకటేశ్వర్లు, సుందర్, రామకృష్ణ, చిరంజీవి, ఉదయ భాస్కరరెడ్డి, చల్లా సుబ్బారాయుడు వ్యవహరించారు.

రేపటి నుంచి బాలల హక్కుల వారోత్సవాలు



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్ కోటేశ్వరరావు, ఏసీపీ నాయుడు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాల నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ నిర్వాహకుడు బీఎస్ కోటేశ్వరరావు తెలిపారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, చైల్డ్ లైన్ – 1098, అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారంతో వారం రోజుల పాటు బాలల హక్కులపై ప్రజల్లో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హనుమాన్‌పేటలోని తానాభవన్‌లో చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాల పోస్టర్, లోగో, ఫ్లెక్సీలను శనివారం ఆవిష్కరించారు. తొలుత ఫోరం వ్యవస్థాపకుడు విజయవాడ నగర ప్రథమ మేయర్ టి. వేంకటేశ్వరరావు 106 వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టి.వెంకటేశ్వరరావు బాలల హక్కుల పరిరక్షణకు చేసిన సేవలను కొనియాడారు.

హక్కులపై అవగాహన అవసరం

అనంతరం మీడియా సమావేశంలో దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ నాయుడు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణకై గత 25 ఏళ్లుగా వారోత్సవాలను నిర్వహిస్తున్న ఫోరం సభ్యులను అభినందించారు. ప్రతి ఒక్కరికీ బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమం అధికారి రుక్మాందయ్య మాట్లాడుతూ.. బాలలపై వేధింపుల నివారణకు వారోత్సవాల్లో చైల్డ్ లైన్ –1098 సహకారంతో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, పాఠశాలల్లో కూడా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైల్డ్ లైన్ డైరెక్టర్ నోయల్ హార్పర్ మాట్లాడుతూ.. వారం రోజుల పాటు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రాధాకుమారి, డీసీపీఓ రమ, లేబర్ అధికారి రాజేష్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ అరవ రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలి



వ్యాధిగ్రస్తులతో దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మస్క్యులర్ డిస్ట్రోఫీ వంటి అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారు ఆత్మస్థైర్యం కోల్పోరాదని, కుటుంబ సభ్యులు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం మస్క్యులర్ డిస్ట్రోఫీపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 60 మంది అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వీల్‌చైర్‌కే పరిమితమైన వారు వచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. మస్క్యులర్ డిస్ట్రోఫీ వంటి అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి తగిన సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ డి.అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. పుట్టుకతో ఎలాంటి లోపం లేకుండా జన్యుపరమైన కారణాలతో వయస్సు పెరిగే కొద్ది కండరాల వైఫల్యంతో సమస్యలు వస్తాయన్నారు. తొలుత నడుస్తూ తూలిపడటం, క్రమేణా మంచానికే పరిమితమయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి వారికి తొలిదశలో చికిత్స చేయడం ద్వారా కొద్దికాలం వ్యాధి తీవ్రతరం కాకుండా చూడవచ్చని చెప్పారు. ప్రభుత్వ పరంగా ఫిజియోథెరపీ వంటి సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన 60 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, అమరావతి రేర్ డిసీజ్ అసోసియేషన్ అధ్యక్షురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పీటీఐ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కృష్ణలంక(విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని సమగ్రశిక్షలో పని చేస్తున్న పీటీఐ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం రాష్ట్ర పీటీఐ వ్యాయామ ఉపాధ్యా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుల జాబ్‌చార్ట్, మినిమం టైం స్కేల్ అమలుకు, డీఎస్సీలో వెయిటేజీ కల్పించేందుకు, లేనిపక్షంలో భవిష్యత్‌లో రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం రాష్ట్ర పీటీఐ వ్యాయామ ఉపాధ్యాయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వాసా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.ఇస్రాయేలు ప్రసాద్, ట్రెజరర్ అమీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. సమావేశంలో శ్రీనివాసరావు, నాగిరెడ్డి ఉన్నారు.

ఎట్టకేలకు యూజీడీ సమస్యకు పరిష్కారం



యూజీడీ పనులు చేస్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): కస్తూరిబాయిపేట అంబేడ్కర్ కాలనీ ఆర్సీఎం చర్చి రోడ్డులో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న యూజీడీ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక 24వ కార్పొరేటర్ కుక్కల అనిత చొరవతో రూ.20 లక్షల అంచనాతో యూజీడీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ధ్వంసమైన యూజీడీ పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపారని చెప్పారు. యూజీడీ పనులను శనివారం కార్పొరేటర్ కుక్కల అనిత, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మల్లేశ్వరునికి అన్నాభిషేకం

శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన



అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



దుర్గాదేవిగా అమ్మ వారు దర్శనం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన మల్లేశ్వరస్వామి వారికి అన్నాభిషేకం కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో వేంచేసి ఉన్న స్వామి వారికి కార్తిక నక్షత్ర దీక్ష మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం స్వామి వారికి 108 కిలోల అన్నంతో అభిషేకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అదే విధంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర లింగార్చనలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి లక్షబిల్వార్చనను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మ వారికి కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మ వారు దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ప్రేమ పేరుతో వేధింపులపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ప్రేమ పేరుతో యువతిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ ఇందిరానాయక్‌నగర్ ప్రాంతానికి చెందిన మంజులా దేవికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె జాహ్నవి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. ఆమెతో పాటు చదువుకున్న నవీన్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఫార్మశీ విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మచిలీపట్నం కృష్ణా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ చూపారని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిలారు నవీన్ బాబు తెలిపారు. బి.ఫార్మశీ నాల్గవ ఏడాది చదువుతున్న వి.గాయత్రి, సీహెచ్ పవిత్ర, ఎల్ దివ్యసరోజ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఈ ముగ్గురు బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయంలో జరిగే దక్షిణాది అంతర్ విశ్వ విద్యాలయాల పోటీల్లో కృష్ణా విశ్వ విద్యాలయం తరఫున పాల్గొనేందుకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కిలారు నవీన్‌బాబుతో పాటు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో పాస్టర్ రత్నకుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేద మహిళలు స్వయంశక్తి ద్వారా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కుట్టుమిషన్లను అందజేస్తున్నట్లు మెస్సీయ ఫెలోషిప్ పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. స్థానిక జవహర్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని మెస్సీయ చర్చి ఆధ్వర్యంలో 25 మంది పేద మహిళలకు ఆయన శనివారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న మరో 52 మందికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేద మహిళలకు మెస్సీయ ఫెలోషిప్ ద్వారా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చి, మిషన్లను అందజేస్తున్నామని చెప్పారు. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. పేద మహిళలు కుట్టుమిషన్ నేర్చుకోవాలనుకుంటే మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నిరుపేద వృద్ధులకు ప్రతి నెలా ఆర్థిక సహాయం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సజ్జా జ్యోతి, సుచరిత, అరుణ, కన్యా, విజయ, శారద, వసంత పాల్గొన్నారు.

20న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోకరాజు గంగరాజు, నాగలింగం శివాజీ, శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ కల్చరల్: శత సహస్ర లక్ష దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్‌లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు సేవా మండలి వ్యవస్థాపకుడు నాగలింగం శివాజీ తెలిపారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాజీ మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా సేవా మండలి ఆధ్వర్యంలో శత సహస్ర దీపార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 18, 19 తేదీల్లో ఇదే ప్రాంగణంలో కార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నామని, పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామని చెప్పారు. పేర్ల నమోదుకు 92940 55561 నంబరులో సంప్రదించాలని కోరారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. కార్తిక మాసం శివ కేశవులకు ప్రీతి పాత్రమైనదన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, రామశేషు పాల్గొన్నారు.

ఖబర్‌స్తాన్‌కు స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న హిమవలీ, నాగుల్‌మీరా

భవానీపురం(విజయవాడ పశ్చిమ): మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ కాలనీ, జక్కంపూడి ప్రాంతంలో ఖబర్‌స్తాన్ నిమిత్తం మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని సంచార ఫకీర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ హిమవలి, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు శనివారం కలిసి వినతి పత్రం అందచేశారు. వైఎస్సార్ షాదీ తోఫా పథకానికి సంబంధించి వధూవరులు 10వ తరగతి వరకు చదివి ఉండాలన్న ఆంక్షలను ఎత్తి వేయాలని కోరారు. ముస్లిం మైనార్టీ వర్గంలోని పేద కుటుంబాల్లో 10వ తరగతి వరకు చదివే పరిస్థితి ఉండదని, అలాగే మదరసా పాఠశాలల్లో చదువుకునే ఆడపిల్లలకు టెన్త్ సర్టిఫికెట్లు ఉండని కారణంగా టెన్త్ అర్హత లేకుండా షాదీ తోఫా ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇస్లామిక్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసి పేద ముస్లింలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ముస్లిం మైనార్టీలకు పెద్ద పీటవేసి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తమ విజ్ఞప్తులను తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ ఆదం షరీఫ్, షేక్ ఇర్ఫాన్ పాషా, వీ రంగారావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

యువ సంగీత సమ్మేళనం ప్రారంభం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే యువ సంగీత సమ్మేళనం శనివారం శివరామ కృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ప్రారంభమయ్యాయి. యువ సంగీత కళాకారులు నిర్వహించిన కచేరీలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. ద్వైతా మహాలక్ష్మి, ద్వైతా నాగఫణి శర్మ వీణపై పలు సంప్రదాయ కీర్తనలను పలికించారు. వీ.రామ్ వైభవ్ మృదంగంపై సహకరించారు. ఎ.కామాక్షి వయోలిన్‌పై త్యాగరాజ స్వామి కృతులను పలికించారు. చివరిగా చెన్నైకి చెందిన గాయత్రి విభావరి నిర్వహించిన గాత్ర కచేరిలో పలు సంప్రదాయ కీర్తనలు చోటు చేసుకున్నాయి. కార్యక్రమాలను సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ప్రారంభించారు. సంగీత సమితి కార్యదర్శి సీవీ.రావు మాట్లాడుతూ నేటి తరానికి సంగీత, సాహిత్య విలువల పట్ల అవగాహన కలిగించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పెనమలూరు తహసీల్దార్‌కు రిమాండ్

పెనమలూరు: అక్రమార్జనతో ఆదాయానికి మించిన ఆస్తులు కూడగట్టిన కేసులో కృష్ణా జిల్లా పెనమలూరు తహసీల్దార్ జి.భద్రుకు కోర్టు రిమాండ్ విధించింది. ఏసీబీ డీఎస్పీ బి.శ్రీనివాస్ శనివారం వివరాలు విలేకరులకు వెల్లడించారు. ఆయన మాటల్లో.. తహసీల్దార్ జి.భద్రు అక్రమార్జనతో ఆస్తులు కూడబెట్టడంతో శుక్రవారం ఆయన ఇల్లు, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. రూ.2 కోట్ల విలువ చేసే స్థిర, చరాస్తులు అక్రమార్జనతో కూడగట్టినట్లు నిర్ధారించారు. కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసిన అధికారులు ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు భద్రుకు రిమాండ్ విధించింది.

బలహీనపడిన అల్పపీడనం

- నేడు అరేబియా సముద్రంలో విలీనం
- దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వానలు

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతం, ఉత్తర కోస్తా తమిళనాడు, పుదుచ్చేరి పరిసర ప్రాంతాలపై కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం శనివారం అల్పపీడనంగా బలహీనపడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అయితే, అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ తమిళనాడు, కేరళ మీదుగా ప్రయాణించి ఆదివారం తూర్పు మధ్య అరేబియా సముద్రంలో విలీనమవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉత్తర కోస్తాంధ్రలో వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు ఈ నెల 16న ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడనుందని ఐఎండీ తెలిపింది. కాగా, అల్పపీడనం ప్రభావంతో శనివారం నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కారేడులో 5.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పొదిలి, కావలి, చీమకుర్తి, లింగసముద్రం, ఉలవపాడు, నగరి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

లోక్ అదాలత్‌లో 1,11,232 కేసుల పరిష్కారం

సాక్షి, అమరావతి : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యాయి. 1,11,232 కేసులు పరిష్కారం కాగా, రూ.46.06 కోట్ల పరిహారం అందజేశారు. పరిష్కారం అయిన కేసుల్లో 97,455 పెండింగ్ కేసులు కాగా, 13,777 ప్రీ లిటిగేషన్ కేసులున్నాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ మార్గదర్శకత్వంలో లోక్ అదాలత్ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా కింది కోర్టుల్లో 418 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాజీకి ఆస్కారం ఉన్న కేసులను ఇందులో పరిష్కరించారు. ఇదిలా ఉంటే హైకోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 511 కేసులను పరిష్కరించారు. రూ.4.01 కోట్ల పరిహారం అందజేశారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి, జస్టిస్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ నేతృత్వంలో కేసుల విచారణ జరిగింది.

24 గంటల్లో 78 పబ్బుల్లో తాగాడు...



'నాక్కొంచెం తిక్కుంది.. దానికో లెక్కుంది' అంటున్నాడు ఆస్ట్రేలియాకు చెందిన హెన్రిచ్ డి విలియర్స్. 24గంటల్లో 78 పబ్బుల్లో తాగి అత్యధిక 'పబ్ క్రాల్' (లైసెన్సులున్న పబ్బులను సందర్శించి అన్నింట్లోనూ ఆల్కహాల్ తాగడం) చేసిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఒక్కరోజులో 78 పబ్బులా? ఎంత తాగి ఉంటాడో అనే కదా సంశయం. ఒక్కో పబ్బులో 125 ఎంఎల్ మాత్రమే తాగాలని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ రూల్. ఆ ప్రకారమే తాగాడు. అంత తాగిన తరువాత స్టడీగా ఉన్నాడా? అంటే.. అందుకే తనకు సహాయంగా తమ్ముడు రువాల్డ్ డి విలియర్స్‌ను, ఫ్రెండ్.. వెస్సెల్ బర్గర్‌ను వెంట బెట్టుకు వెళ్లాడు. అయినా సరే... 24 గంటల్లో 78 పబ్బులకు వెళ్లడమంటే.. సాధారణ విషయం కాదు. రికార్డు కోసం మెల్‌బోర్న్‌లోని బార్స్ గురించి బాగా రీసర్చ్ చేసి.. ముగ్గురూ పక్కాగా రూట్‌మ్యాప్ ప్లాన్ చేసుకున్నారు. జీపీఎస్ ట్రాకింగ్‌తో గమ్యస్థానాన్ని చేరుకుని రికార్డ్ బ్రేక్ చేశారు.

ముహూర్తం ముందరున్నది

మూఢం ముగియగానే పెళ్లి సందడి

- నవంబర్ 28 నుంచి పెళ్లి ముహూర్తాలు మొదలు
- వచ్చే మే వరకు సుమారు 42 ముహూర్తాలు
- రాష్ట్రంలో 1.50 లక్షలకుపైగా వివాహాలు జరుగుతాయని అంచనా





సాక్షి, అమరావతి: ''మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది.. మా అమ్మాయి జాతకానికి మీ అబ్బాయి జాతకం బాగా కుదిరింది.. మనం ఇప్పుడే ఒక మాట అనుకుని పెళ్లి ఖాయపర్చుకుంటే మూఢం వెళ్లగానే మంచి ముహూర్తం చూసి పెళ్లి చేసేద్దాం'' రాష్ట్రంలో ప్రస్తుతం పెళ్లీడుకొచ్చిన పిల్లల తల్లిదండ్రులు మధ్య సాగుతున్న సంభాషణ ఇది. దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత వస్తున్న శుభ ముహూర్తాలకు తమ పిల్లల వివాహాలు జరిపించేందుకు పెద్దలు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ నెలాఖరు వరకు సరైన ముహూర్తాలు లేవు. దీంతో వివాహాలు జరిపించేందుకు శుభలగ్నం కోసం ఎదురుచూస్తున్నారు. మూఢం ముగియడంతో నవంబర్ 28 నుంచి శుభ ముహూర్తాలు రానున్నాయి. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12 వరకు ఏడు బలమైన ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. డిసెంబర్ 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం (సంక్రాంతి నెల) కావడంతో వివాహాలు చేయరు. దీంతో వచ్చే ఏడాది జనవరి 19 నుంచి మార్చి 9 వరకు 18 శుభముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. ముందుంది ముహూర్తం అంటూ.. పెళ్లి ఏర్పాట్లలో వధూవరుల కుటుంబాలు బిజీ అవుతున్నాయి.

మార్కెట్‌లకు పెళ్లి కళ..

ప్రస్తుత శుభకృత్ నామ తెలుగు సంవత్సరం నవంబర్ నుంచి వచ్చే మార్చి వరకు దేశ వ్యాప్తంగా 35 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఏపీలోనే లక్షా 50 వేలకుపైగా వివాహాలు జరుగుతాయని భావిస్తున్నారు. ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో మార్కెట్లకు కూడా పెళ్లి కళ వచ్చింది. ఇప్పటికే ఇళ్ల మరమ్మతుల కోసం సిమెంట్ పనులు, ఇళ్లకు రంగులు తదితర అలంకరణ పనులు ఊపందుకుంటున్నాయి. సరికొత్త శ్రేణి ఆభరణాలతో బంగారం షాపులు రెడీ అవుతున్నాయి. మారిన ట్రెండ్‌కు అనుగుణంగా రెడీమేడ్ దుస్తుల షాపులు, పాదరక్షల షాపులు, పెళ్లి శుభలేఖల షాపులు సిద్ధమయ్యాయి. చాలా చోట్ల కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు, హోటళ్లు, బాంక్వెట్ హాళ్ల అడ్వాన్సు బుకింగ్‌లు అవుతున్నాయి.

మే వరకూ శుభ ముహూర్తాలు..

నాలుగు నెలల తర్వాత మంచి బలమైన ముహూర్తాలు వస్తున్నందున పెళ్లి బాజాలు మోగించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మూఢం లో వివాహాలు జరిపించరు. మూఢం వెళ్లగానే మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు చేస్తారు. ప్రస్తుత శుభకృత్ నామ సంవత్సరం తర్వాత వచ్చే శోభకృత్ నామ సంవత్సరం 2023 మే నెల వరకు శుభలగ్నాలు ఉన్నాయి. 2023 ఉగాది అయ్యాక చైత్రం, వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో మంచి ముహూర్తాల్లో వివాహాలు జరిపిస్తారు. మొత్తంగా ఈ నెల నుంచి వచ్చే ఏడాది మే వరకు దాదాపు 42 ముహూర్తాలు ఉన్నాయి.

– కొత్తపల్లి సూర్యప్రకాశరావు(లాలూ), పురోహితుడు, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

మైనింగ్ సంస్కరణలతో మరింత పారిశ్రామికాభివృద్ధి

- సిమెంట్ పరిశ్రమను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్
- ఇండియా సిమెంట్స్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి/చెన్నై: గనుల లీజుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు చేపడితే మరింత పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. ఇండియా సిమెంట్స్ ఏర్పాటై 75 ఏళ్లుపూర్తయిన సందర్భంగా చెన్నైలో శనివారం నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మంత్రి బుగ్గన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నపురాయి వంటి కీలక ఖనిజాల లీజులకు సంబంధించి కేంద్ర ఎంఎండీఆర్ పాలసీలో కొద్దిపాటి మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. 1946లో 1.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మొదలైన ఇండియా సిమెంట్స్ ప్రస్థానం... ఇప్పుడు 6 మిలియన్ టన్నులకు చేరిందని, దృఢమైన భారతజాతి నిర్మాణంలో ఈ సంస్థ కీలక భాగస్వామిగా నిలిచిందని అన్నారు. ఇండియా సిమెంట్స్‌కు ఆంధ్రప్రదేశ్‌కు పటిష్టమైన బంధం ఉందని, రాష్ట్రంలో సిమెంట్ పరిశ్రమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఇండియా సిమెంట్స్ ఎండీ ఎన్.శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని తదితరులు పాల్గొన్నారు.



చెన్నైలో ఇండియా సిమెంట్స్ ఎండీ శ్రీనివాసన్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

నాలుగు గంటల్లో విజయవాడకు..

వందేభారత్ రైలు

• తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–విజయవాడ మధ్య దూరాన్ని తగ్గిస్తూ త్వరలో 'వందేభారత్' రైలు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఉత్తరాదిలో పరుగులు తీస్తున్న వందేభారత్ రైళ్లు తాజాగా చెన్నై–మైసూర్ మార్గంలో దక్షిణాదిలోకి ప్రవేశించాయి. నూతన సంవత్సర కానుకగా దక్షిణమధ్య రైల్వేలోనూ వందేభారత్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే వందేభారత్‌ను పట్టాలెక్కించే దిశగా కార్యాచరణ సాగుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. హైదరాబాద్ నుంచి దూర ప్రాంతాలకు ఈ రైలును నడపాలని తొలుత భావించారు. ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే సికింద్రాబాద్–విశాఖ, సికింద్రాబాద్–తిరుపతి, కాచిగూడ–బెంగళూరు, హైదరాబాద్–ముంబై మార్గాలను అధికారులు పరిశీలించారు. కానీ వందేభారత్ రైల్లో బెర్తులు లేకపోవడం, కేవలం కూర్చొని ప్రయాణించేలా వీలుగా సీట్లు ఉండటం వల్ల 13–15 గంటలపాటు ప్రయాణికులు కూర్చొని ప్రయాణం చేయడం సాధ్యం కాదని నిర్ణయించారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలకు వందేభారత్‌ను అందుబాటులోకి తేవడంతోపాటు రెండు రాజధానులను సైతం దగ్గర చేసేలా సికింద్రాబాద్–విజయవాడ రూట్‌లో వందేభారత్‌ను నడపాలని యోచిస్తున్నారు.

హైడెన్సిటీ నెట్‌వర్క్ రూట్‌లో...

ఉమ్మడి రాష్ట్రం విభజన అనంతరం ఉద్యోగుల రాకపోకల కోసం ఇంటర్‌సిటీ రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఇరు రాష్ట్రాల్లోని ఉద్యోగులు రాకపోకలు సాగించేలా ఈ రైళ్లు నడుస్తున్నాయి. ఐదు ఇంటర్‌సిటీ రైళ్లతోపాటు, విజయవాడ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవి సుమారు 20 రైళ్లు ఉన్నాయి. రోజూ 25 వేల మందికి పైగా ప్రయాణికులు సికింద్రాబాద్–విజయవాడ మధ్య రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఈ రెండు నగరాల మధ్య ప్రయాణికుల డిమాండ్ బాగానే ఉంది. మరోవైపు సికింద్రాబాద్ నుంచి కాజీపేట్ మీదుగా విజయవాడ మార్గాన్ని హైడెన్సిటీ నెట్‌వర్క్ పరిధిలోకి తెచ్చారు. 130 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేందుకు వీలుగా ట్రాక్ సామర్థ్యాన్ని పెంచారు. ట్రాక్ సామర్థ్యాన్ని పెంచిన సికింద్రాబాద్–కాజీపేట్–విజయవాడ మార్గంలో వందేభారత్‌ను నడపడం వల్ల 4 గంటల్లోనే విజయవాడకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో హైదరాబాద్– విజయవాడ మధ్య నిత్యం రాకపోకలు సాగించే వేలాది మందికి ఊరట లభించనుంది.

దేశంలో 'భారత్' బ్రాండ్ యూరియా

నకిలీల నుంచి రక్షణ కోసం దేశవ్యాప్తంగా ఒకే బ్రాండ్ యూరియా

- తెలంగాణలోని రామగుండం సభలో ప్రకటించిన ప్రధాని మోదీ
- ఆర్ఎఫ్‌సీఎల్, భద్రాచలం–సత్తుపల్లి రైలు మార్గం జాతికి అంకితం
- మూడు నేషనల్ హైవేల పనులకు శంకుస్థాపన
- అబద్ధాలు చెప్పే వ్యాపారులను హైదరాబాద్‌లోనే ఉంచేయండి!

సాక్షి, హైదరాబాద్/సాక్షి, రామగుండం : దేశంలోని రైతులను నకిలీ ఎరువులు, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యల నుంచి గట్టెక్కించేందుకు దేశవ్యాప్తంగా ఒకేలా 'భారత్' బ్రాండ్‌తో యూరియాను అందిస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. నాణ్యత, తక్కువ ధరతో ఈ యూరియాను కేంద్రం అందిస్తోందని తెలిపారు. శనివారం రామగుండం ఎన్టీపీసీ మహాత్మాగాంధీ స్టేడియంలో ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్, భద్రాచలం–సత్తుపల్లి కొత్త రైలు మార్గాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మూడు జాతీయ రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ భారత్‌లో పెంచలేదు. ప్రతి యూరియా బస్తాపై రూ.1472, డీఏపీ బ్యాగ్‌పై రూ.2,500 రైతులకు కేంద్రం సబ్సిడీ అందిస్తోంది. కరోనా, యుద్ధాల ప్రభావం దేశం, ప్రపంచంపై ఉన్న ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉద్భవించే దిశలో వేగంగా పరుగులు పెడుతోంది. గత 8 ఏళ్లలో దేశం అన్ని రంగాలలో అద్భుతమైన పురోగతి సాధించింది.2030 నాటికి అనేక రంగాల్లో ఏర్పర్చుకున్న లక్ష్యాలను పూర్తిచేసే దిశగా కొనసాగుతున్నాం' అని ప్రధాని చెప్పారు.

సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనే లేదు

సింగరేణిని ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని మోదీ చెప్పారు. 'తెలంగాణలో కొందరు రాజకీయ స్వార్థంతో సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారంటూ ప్రచారం చేస్తున్నారు. సింగరేణిలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం. కేంద్రం వాటా 49 శాతం. కేంద్రం ఎలా విక్రయిస్తుంది? ఏమైనా చేస్తే రాష్ట్ర ప్రభుత్వమే చేయాలి. ఇలా అబద్ధాలు చెప్పే వ్యాపారులను హైదరాబాద్‌లోనే ఉంచండి' అని అన్నారు.

అంధకారంలోఉన్న తెలంగాణకు బీజేపీ వెలుగులిస్తుంది

'చీకటి పడినప్పుడే కమలం వికసిస్తుంది. తెలంగాణ రాష్ట్రం అవినీతి, కుటుంబ పాలనతో అంధకారంలో చిక్కుకుంది. ఈ అంధకారాన్ని పారద్రోలేందుకు కమలం వికసిస్తుంది. తెలంగాణ ప్రజలకు వెలుగును అందిస్తుంది. తెలంగాణ ప్రజలు ఒక కుటుంబ అభివృద్ధిని కాకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాల అభివృద్ధిని కోరుకుంటున్నారు. అలాంటి సుపరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుంది ' అని ప్రధాని చెప్పారు. శనివారం బేగంపేటలో బీజేపీ ఏర్పాటు చేసిన స్వాగత సభలో ఆయన ప్రసంగించారు. 'బీజేపీని, నన్ను ఎన్ని తిట్టినా భరిస్తాం. కానీ ప్రజలకు అన్యాయం చేసినా, వారి ఆశలను వమ్ముచేసినా ఊరుకునేది లేదు. పేదల సొంతింటి కలను సాకారం చేసే ప్రధాన మంత్రి ఆవాస్ యోజనను పలు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేస్తున్నాం. తెలంగాణలో ఇక్కడి ప్రభుత్వం వైఖరి కారణంగా అమలు చేయలేకపోయాం. రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వండి. అన్ని వర్గాలను, అన్ని రంగాలను అభివృద్ధి చేసి చూపిస్తాం' అని మోదీ చెప్పారు.

ప్రతిభ లేకుండా ఎవరూ రాణించలేరు

తెలంగాణ మంత్రి కేటీఆర్

బంజారాహిల్స్(హైదరాబాద్): ప్రతిభ లేకుండా రాజకీయాల్లో ఎవరూ రాణించలేరని తెలంగాణ ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో వారసత్వం ఎంట్రీ కార్డ్‌గా మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. సామర్థ్యాన్ని నిరూపించకోలేకపోతే ఏ వారసత్వాన్నీ ప్రజలు భరించరన్నారు. ఇందిరాగాంధీ వంటి మహానేతలనే ప్రజలు ఓడించారని ఆయన గుర్తుచేశారు. సిరిసిల్లలో తొలిసారి పోటీ చేసిన తాను కేవలం 150 ఓట్ల తేడాతో గెలిచానని.. తన పనితీరుతో ప్రతి ఎన్నికల్లోనూ మెజారిటీ పెంచుకుంటూ వచ్చానని చెప్పారు. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ స్టేట్ 'మీడియా ఇన్ తెలంగాణ పాస్ట్–ప్రజంట్–ఫ్యూచర్' అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమం సహా టీఆర్ఎస్ స్థాపన సమయంలో తమకు మీడియా మద్దతు లభించలేదని చెప్పారు. ముఖ్యంగా 2001లో టీఆర్ఎస్‌ను స్థాపించిన సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నారని.. కొన్ని పత్రికలు మాత్రం ఆయన గురించి ఆహా... ఓహో అంటూ, ఇంద్రుడు, చంద్రుడు అంటూ రాసేవని గుర్తుచేశారు.

5.5 కేజీల బంగారం పట్టివేత

శంషాబాద్ (హైదరాబాద్): ఇద్దరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దుబాయ్ విమానంలో దిగిన ఇద్దరు ప్రయాణికుల కదలికలను అనుమానించిన అధికారులు వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. వారి లోదుస్తుల్లో పేస్టు రూపంలో దాచిన 5.5 కేజీల బంగారాన్ని బయటికి తీశారు. బంగారం తీసుకొచ్చిన వారు నగరానికి చెందిన అమీర్‌ఖాన్, మహ్మద్ ఖురేషీలుగా గుర్తించారు. బంగారం విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. బంగారాన్ని ఎవరికి చేరవేస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తనిఖీలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడైన నందు అలియాస్ నందకుమార్ ఇంట్లో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఫిలింనగర్‌లోని ఆదిత్యా హిల్‌టాప్ అపార్ట్‌మెంట్‌లో నందు ఇంటికి రాజేంద్రనగర్ ఏసీపీ, మొయినాబాద్ పోలీసులతో పాటు వెస్ట్‌జోన్ టాస్క్ ఫోర్సు పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. కొన్నిరోజులుగా నందకుమార్ ఇంటికి ఎవరెవరు వచ్చారో ఆరా తీశారు. అతని కుటుంబ సభ్యులతో మాట్లాడిన పోలీసులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆ ఇళ్లు.. బడుగుల ఆత్మగౌరవ సౌధాలు

'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' ద్వారా స్థలాలు మంజూరు.. ఇళ్ల నిర్మాణం..

కష్టాలుపడ్డ చోటే నేడు సొంతిళ్లలో ఆత్మగౌరవంతో జీవనం



ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి గ్రామంలో జగనన్న ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో నిర్మిస్తున్న ఇళ్ల పురోగతి ఇలా..

నిర్మాణ దశ	ఇళ్ల సంఖ్య
బేస్మెంట్ లెవల్ దిగువ	7,82,962
బేస్మెంట్ లెవల్	2,75,265
రూఫ్ లెవల్	72,897
రూఫ్ కాస్ట్	1,08,594
నిర్మాణం పూర్తి	1,67,739
ప్రారంభించాల్సినవి	4,56,105
మొత్తం	18,63,562



రోజంతా నా భర్త వెంకటేశ్వరరావు కూలికెళ్తే వచ్చే డబ్బు ఇద్దరు పిల్లల పెంపకం, కుటుంబ పోషణకే సరిపోయేది. దీంతో చాలా సార్లు అద్దె ఇంట్లోకి వెళ్దామనుకున్నా ఆర్థిక స్థోమత సహకరించక ఆ ప్రయత్నం విరమించుకున్నాం. గుడిసెల్లో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాం. వర్షం వస్తే పైకప్పు నుంచి నీరు ధారలా కారుతుండేది. దీంతో పిల్లలను నేను, నా భర్త ఒళ్లో పడుకోబెట్టుకుని, పురుగు పుట్రా వస్తుందేమోనని బిక్కుబిక్కుమంటూ బతికాం. మా పరిస్థితి చూసి బంధువులెవరూ పెద్దగా ఇంటికి వచ్చేవారు కాదు. కానీ, ఇప్పుడా అవస్థలు మాకులేవు. మేం ఉంటున్న గుడిసెలను ఖాళీ చేయించి ఇక్కడే మాకు ప్రభుత్వం ఇళ్ల పట్టా ఇవ్వడమే కాక ఇంటిని కూడా నిర్మించి ఇచ్చింది. ప్రస్తుతం అందులో దర్జాగా ఉంటున్నాం. ఇదంతా తల్చుకుంటే నిజంగా కలలాగే ఉంది. కేవలం మాకు గూడు కల్పించడమే కాదు.. నా బిడ్డల చదువుకు అమ్మఒడి పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇస్తోంది. అంతేకాక.. వైఎస్సార్ ఆసరా పథకం కింద రెండుసార్లు రూ.10వేల చొప్పున లబ్ధి పొందాను. గతంలో ఏ ప్రభుత్వం మాకు ఇంతలా సాయపడలేదు. మా బతుకు చిత్రాన్నే మార్చిన ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కవిత, జక్కంపూడి, విజయవాడ రూరల్ మండలం



పూరి గుడిసెల్లో ఉన్నప్పుడు ఏటా రెండుసార్లు పైకప్పు మార్చాల్సి వచ్చేది. ఇందుకు రూ.20వేలకు పైగానే ఖర్చయ్యేది. నా భర్త కొన్నేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇద్దరు పిల్లలను చూసుకుంటూ నేను కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి. కుటుంబ పరిస్థితులు సరిగాలేక నా కొడుకు పదో తరగతితో చదువు మానేసి ఫ్యాక్టరీలో పనికెళ్తున్నాడు. అమ్మాయి ఇంటి వద్దే ఉంటుంది. దీనావస్థలో ఉన్న మమ్మల్ని ప్రభుత్వం ఆదుకుంది. పక్కా ఇంటిని నిర్మించి ఇచ్చి ఎంతో మేలు చేసింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద రెండుసార్లు రూ.17 వేల చొప్పున ఆర్థిక సాయం అందింది. సున్నా వడ్డీ, ఇతర పథకాలు మమ్మల్ని ఎంతో ఆదుకుంటున్నాయి''.

– వి. పద్మ, జక్కంపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం

.. ఇలా ఎంతో మంది పేదల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం వెలుగులు నింపుతోంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అలాగే పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చింది.

టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు



నా భర్త చాలా ఏళ్ల క్రితం చనిపోయాడు. మేం కూడా పూరి గుడిసెలో ఉండే వాళ్లం. గత ప్రభుత్వ హయాంలో స్థలం, ఇంటి కోసం చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మాకు స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాకే నాకు వితంతు పింఛన్ మంజూరైంది. పూరిగుడిసెల్లో ఉన్నప్పుడు వర్షం కారుతుండేది. పాములు, తేళ్లు కుట్టి ఆస్పత్రులకు వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అంతేకాదు.. మా కాలనీ వద్దకే రేషన్ బండి కూడా వస్తోంది.

– అవనిగడ్డ లక్ష్మి, జక్కంపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం

మా కష్టాలు తీరాయి..



నాకు పెళ్లి కాకముందు నుంచి నా భర్త కుటుంబం పూరి గుడిసెలో ఉంటోంది. నాకు ఇద్దరు పిల్లలు. బాలింతగా ఉన్న సమయంలో చలికాలం, వర్షాకాలం చిన్న పిల్లలతో గుడిసెలో చాలా ఇబ్బందులు పడ్డాను. ఐదు, ఆరు మంది చిన్న గుడిసెలో ఉండేవాళ్లం. మేం పడ్డ కష్టాలు పగవాడికి కూడా రాకూడదు. ఉండటానికి ఇల్లులేక, అద్దెలు కట్టడానికి స్థోమత లేని మాలాంటి నిరుపేదల కష్టాలు అనుభవించే వారికే తెలుస్తుంది. జగనన్న పుణ్యమా అని మా కష్టాలన్నీ తీరాయి. సొంతింట్లో ఉంటున్నాం. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– వి. సీతమ్మ, జక్కంపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం

ఇప్పుడు వీరి జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని జగనన్న కాలనీకి 'సాక్షి' వెళ్లింది. అక్కడి ఎస్టీ మహిళలతో మాట్లాడితే వారు పైవిధంగా స్పందించారు. అంతా కలలా ఉందని చెబుతుంటే వారి కళ్లల్లో ఎంతో సంతోషం సాక్షాత్కరించింది.

42 ఇళ్ల నిర్మాణం పూర్తి..

జక్కంపూడి గ్రామంలోని జగనన్న కాలనీలో పేదలకు 156 ప్లాట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 136 ఇళ్ల నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. ఇప్పటికే 42 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఈ 42 ఇళ్లలో 20కు పైగా ఇళ్లు గతంలో ఇక్కడే పూరిగుడిసెల్లో నివాసం ఉండే ఎస్టీలకు సంబంధించినవి. మరో 30 ఇళ్లు శ్లాబ్ దశ పూర్తయి ఫినిషింగ్ దశల్లో ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోంది. ఇక్కడ చుట్టుపక్కల ప్రాంతాల్లో సెంటు స్థలం మార్కెట్ విలువ రూ.3 లక్షల మేర ఉంటుంది. ఇంత ఖరీదైన స్థలాలను ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇచ్చింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తోంది. ఉచితంగా ఇసుక, మార్కెట్ ధరల కన్నా తక్కువకు నిర్మాణ సామగ్రి అందిస్తోంది. మూడు శాతం వడ్డీకి రూ.35వేల బ్యాంకు రుణాలు అందిస్తూ అదనపు సాయం సమకూరుస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేదలకు గూడు

జక్కంపూడి గ్రామానికి చెందిన ఎస్టీలు, ఇతర నిరుపేద కుటుంబాల తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది నిలువ నీడలేని పేదలకు సీఎం జగన్ ప్రభుత్వం సొంత గూడు కల్పిస్తోంది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఏకంగా 30 లక్షల మందికి పైగా పేదలకు పక్కా గృహాలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా.. 30.25 లక్షల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులివ్వగా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. జక్కంపూడి గ్రామంలోని ఎస్టీల తరహాలో ఇళ్లు నిర్మించుకునే స్థోమతలేని నిరుపేదల కోసం ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే ఆప్షన్‌ను ఇచ్చారు. దీనిని రాష్ట్రవ్యాప్తంగా 3.24 లక్షల మంది ఎంచుకున్నారు. లాభాపేక్ష లేకుండా ఈ ఇళ్లను నిర్మించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన కాంట్రాక్టర్లకు 10–20 మంది లబ్ధిదారులను గ్రూప్‌గా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు.

(జక్కంపూడి జగనన్న కాలనీ నుంచి సాక్షి ప్రతినిధి వడ్డే బాలశేఖర్)

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 13-11-2022



ఇంటికొచ్చిన అతిథి ఇష్టాయిష్టాలు తెలుసుకోవడం...
నచ్చిన వంట వండి పెట్టడం...
భారతీయులకు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు!
మరి.. మన దేశానికో కొత్త అతిథి వస్తే...?
వారికేమిష్టమో కూడా తెలుసుకోవాలి కదా...
అందుకే.. 'ఫ్యామిలీ' గారెత్ ఓవెన్‌కు హలో చెప్పింది!
ఎవరీయన అనుకునేరు... నిత్యం మీటింగ్‌లు, చర్చల్లో
బిజీబిజీగా గడిపే
బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఈయన!
చిరంజీవి పెట్టిన ఆవకాయ అన్నం రుచినీ..
మిర్చిబజ్జీలు, హైదరాబాద్ బిర్యానీ వెరైటీలనూ
నెమరేసుకున్న ఆయన ఇంకా ఏమన్నారంటే....

హైదరాబాద్ తిండి తెగ నచ్చేసింది!

● బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ ఓవెన్

సమోసా, బోండాలు నచ్చేశాయి

''హైదరాబాద్ వచ్చి రెండు నెలలే అయ్యింది. కానీ.. ఉదయాన్నే ఫ్యామిలీతో కలిసి నడక సాగిస్తూంటా. నేనో భోజనప్రియుడిని. థాయ్‌లాండ్‌లో రెడ్ కర్రీ తదితర స్ట్రీట్‌ఫుడ్‌ను కూడా బాగా ఎంజాయ్ చేశా. హైదరాబాద్ ఫుడ్ కూడా బాగా నచ్చేసింది. ముఖ్యంగా చెప్పాల్సింది బోండాల గురించి! పిల్లలు వాటిని డోనట్‌లని పిలుస్తున్నారు. సమోసాలు, మిర్చిబజ్జీలూ రుచి చూశా. బోర్ కొట్టినప్పుడల్లా మసాలా చాయ్‌లు లాగించేస్తున్నా. ఇక హైదరాబాదీ బిర్యానీల్లో ఉన్న వెరైటీకి ఇప్పటికే ఫిదా అయిపోయా''

హైదరాబాదీ హడావుడి బాగుంది

''రోజంతా హడావుడిగా ఉండే నగరం తెగనచ్చేసింది. స్ట్రీట్‌ఫుడ్ కోసం లేదా వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఒకచోట నిలబడి చుట్టూ జరుగుతున్న హడావుడిని గమనిస్తూ ఉండిపోవడం చాలా ఇష్టం. కొన్ని రోజుల క్రితం చార్మినార్‌కు వెళ్లా. ఓల్డ్‌సిటీలోనూ తిరిగా... వెస్ట్ మిడ్‌ల్యాండ్ మేయర్‌తో కలిసి వెళ్లా అక్కడికి! అబ్బో.. ఎంత కళకళలాడుతుంటుందో అక్కడ. భలే బాగుంటుంది. ఇంకో మూడేళ్లు ఇక్కడే ఉంటాను కాబట్టి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాలన్నీ తిరగాలి.''

నా సైకిల్ వచ్చేస్తోంది

''కోవిడ్ నేర్పిన అతిపెద్ద పాఠం శారీరక వ్యాయామాన్ని అస్సలు మరచిపోవద్దూ అని. నాకూ శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం అంటే ఇష్టం కూడా. హైదరాబాద్‌లో బోలెడన్ని సైక్లింగ్ గ్రూపులు ఉన్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా నా సైకిల్ కూడా లండన్ నుంచి వస్తోంది. ఆ తరువాత నేనూ హైదరాబాద్ రోడ్లపై సైకిల్‌లో తిరిగేస్తా. హుస్సేన్ సాగర్ చుట్టూ రౌండ్లు కొట్టేస్తా. ఫిట్‌నెస్ కోసం నేను చేసే ఇంకో పని పంచింగ్ బ్యాగ్‌తో బాక్సింగ్ చేయడం! నిరాశా, నిస్పృహలను వదిలించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది ఇది''

ఆంధ్ర కారం పరీక్ష పెట్టింది

''ఈమధ్యే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రితో భోంచేస్తున్నా. రకరకాల వంటలు వడ్డించారు. బ్రిటిష్ వాడిని, నా శరీరం అన్నింటినీ బాగానే తట్టుకుంటుందని అనుకున్నా కానీ, అక్కడ వడ్డించిన ఓ వంటకం నిజంగానే నాకు పరీక్ష పెట్టింది. కొంచెం రుచి చూడగానే అర్థమైపోయింది. అది మన తాహతుకు మించి మరీ కారంగా ఉందీ అని. అక్కడితో ఆపేశా. ఏమాటకామాట చెప్పుకోవాలి. మంత్రితో సమావేశం, విందూ రెండూ తృప్తినిచ్చాయి''

చిరంజీవి ఆవకాయ అన్నం వడ్డించారు

''సినిమాలు, సంగీతం, నాట్యం వంటివి ఇష్టమైనప్పటికీ హైదరాబాద్‌లో ఇంకా వాటిని పెద్దగా ఆస్వాదించలేదు. కాకపోతే... ఈ మధ్యే టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని కలిశా. ఆయన నాకు స్వయంగా వడ్డించారు కూడా. అందులో ఆవకాయ బాగా నచ్చింది. నాలుగు గంటల పాటు చాలా విషయాలు మాట్లాడుకున్నాం. నిజం చెప్పాలంటే అతిపెద్ద టాలీవుడ్ స్టార్‌తో గడిపానని అస్సలు అనిపించలేదు''

పిల్లలూ కలిసిపోయారు

''నాకు పదకొండేళ్ల అలిసియా, తొమ్మిదేళ్ల థామస్‌లు ఉన్నారు. ఇక్రిశాట్‌లో ఉన్న స్కూల్‌లో చేరారు. ఈ ఏడాది కొంచెం ఆలస్యంగానే స్కూలుకెళ్లారు కానీ.. వెళ్లిన వెంటనే పిల్లలతో కలిసిపోయారు. ఉదయాన్నే ఏడు గంటలకల్లా వాళ్లను స్కూల్‌కు వదిలేస్తూంటాం. కొంచెం దూరమే కానీ.. అక్కడి వాతావరణం బాగా నచ్చింది.''

గానకోకిల @ 88

'ఏమని పాడెదనో ఈ వేళ'
ఏ వేళ ఏ పాట పాడినా ప్రసాదమే.
'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది'
తెలుగింటికి ఈ పాట వచ్చిన గడియ ఎంత శ్రావ్యమైనది!
'నీ వుండేదా కొండపై నా స్వామి నేనుండేదీ నేలపై'...
కోవెలకు వెళ్లి దణ్ణం పెట్టాలా... ఈ పాట ప్లే చేస్తే
పూజ పూర్తయినట్టు కాదూ?
'నిన్నటి దాకా శిలనైనా నీ పదము సోకి నే గౌతమినైనా'
ఈ పాట తాకి ఎందరి మొద్దు మనసులు ద్రవించి ప్రవహించలేదూ?
'నీవు రావు నిదుర రాదు'
ఆ పాట వినక తెలుగువారికి నిదుర వచ్చునా?
పి.సుశీలమ్మ తెలుగువారి కోయిలమ్మ.
స్వచ్ఛసమీరంలో సుగంధాల నాజూకు ఆమె గొంతు.
నవంబర్ 13న ఆమె 88వ ఏట అడుగుపెడుతున్నారు. శతగానం భవతి.

తెలుగింటి పాట


పి.సుశీల

భర్త ఊళ్లో లేడు. కాని ఆమెకు భర్త తలపులే ప్రతి నిమిషం గుర్తుకొస్తున్నాయి. కొత్త సంసారం. విరహం. ఉదయ సాయంత్రాల్లో తెలియక కమ్ముకుంటున్న బద్ధకం. ఒక పాట పాడాలి. ఎలా పాడాలి. ఏ గొంతుతో పాడాలి. సుశీలమ్మ గొంతు ఉందిగా.

'నీవు లేక వీణ పలకలేనన్నది'...

'డాక్టర్ చక్రవర్తి'లో సావిత్రి ఈ పాటను అభినయిస్తున్నప్పుడు సావిత్రే కనిపిస్తుంది. సుశీల ఆ క్షణాన సావిత్రే అవుతుంది.

సుశీల సినిమా సంగీతంలో ప్రవేశించేనాటికి లీల, జిక్కి వంటి సీనియర్లు ఉన్నారు. ఉత్తరాదిన లతా అప్పటికే పెద్ద గీత గీసేసింది. ఇప్పుడు ఉత్తరాదిన సుదీర్ఘకాలం కొనసాగే సత్తా ఆమెకే ఉందని తేలిపోయింది. ఇంజన్‌కు మొదటి డబ్బా. ఆ వెనుక ఆశా చేరింది. తెలుగులో కూడా ఆ మాటకొస్తే దక్షిణాది ప్లేబ్యాక్ సింగింగ్‌కి మొదటి డబ్బా సుశీల అయ్యింది. ఆ వెనుకే రెండో డబ్బాగా జానకి నిలబడింది. ప్రకృతి చెక్కిన అసామాన్యమైన గాత్రాలు ఇవి. ప్రకృతి వీటిని గొప్ప యశస్సుతో, ఆయుష్షుతో ఆశీర్వదించింది. దీర్ఘంగా వీచే గాలి, ఎత్తుగా నిలబడిన కొండ, ఎప్పుడూ పారే నది ప్రకృతికి ఎలా అవసరమో సుదీర్ఘమైన కెరీర్‌ను కొనసాగించగలిగే కళాకారులు కూడా అంతే అవసరం. వాళ్లను అట్లా కాపాడుకుంటుంది. సుశీలను కాపాడుకున్నట్టు. అందుకే ఆమె ఇలా సాగింది.

ఆకులో ఆకునై పూవులో పువ్వునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై...

నోటి పలుకుకు చెవి తమ్మెకు బెత్తెడు దూరమే. కాని నోటి పలుకు స్పష్టంగా లేకపోతే అంత దగ్గర ఉన్న చెవి తమ్మెకు కూడా అయోమయం కలుగుతుంది. సుశీల గొంతుకు స్పష్టత వశమైంది. ఉచ్చారణ ఆమెకు బానిసైంది. తీగ వంటి స్వరం వరమైంది. పాట పట్ల శ్రద్ధ విజయమైంది. రాశిపోస్తే పరవశమైన పాట అయ్యింది.

పాడనా తెలుగు పాట... పరవశనై...

లతా వచ్చాక ఏ రేంజ్ పాటైనా పాడించవచ్చు అని సంగీతదర్శకులు నిశ్చయించుకుని ప్రయోగాలు చేశారు. సుశీల వచ్చాక దక్షిణాదిన కూడా అలానే జరిగింది. తెలుగులో, తమిళంలో ఆమె పాట ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఏనాటి బంధమో ఈనాడు మరొక ముడి పాటతో వేసింది.

ఈనాటి ఈ బంధం ఏనాటిదో
ఏనాడు పెనవేసి ముడి వేసెనో...

డ్యూయెట్ అంటే ఘంటసాల, సుశీల. ఆ కాలపు యువతీ యువకుల కలలకు వీరు గొంతు ఇచ్చారు. సాయంత్రాలకు వెలుగు ఇచ్చారు. కాలక్షేపానికి గొప్ప కరకరలాడే మిర్చి బజ్జీలు కోశారు.

వెంగావి రంగు చీర
కట్టుకున్న చిన్నది...

రాను రాను సుశీల ఒక మనిషి జీవన సందర్భాలకు, భావోద్వేగాలకు సరిపోయే సకల పాటల వజ్రాల భరిణెగా మారింది. **దేశభక్తి** 'బలే తాత మన బాపూజీ', **ఆరాధన** 'బృందావనమది అందరిది గోవిందుడు అందరి వాడేలే', **సన్నిధి** 'పాల కడలిపై శేషతల్పమున', **లాలిత్యం** 'అనురాగం విరిసేనా', **విన్నపం** 'అందాలబొమ్మతో ఆటాడనా', **అభిజాత్యం** 'మీరజాల గలడా నా యానతి', **నిర్వేదం** 'ఇది మల్లెల వేళయని ఇది మల్లెల మాసమని', **నిరీక్షణ** 'వస్తాడు నా రాజు ఈరోజు', **శోకం** 'పెను చీకటాయే లోకం', **భయం** 'నిను వీడని నీడను నేనే', **విరహం** 'నీవు రావు నిదుర రాదు'....

ఈ పాటలన్నీ ఈమె పంచింది. గాలిలో ఎగరేసి ఆ గంధాన్ని నిలకడగా ఉంచింది.

కాలం మారినా సినిమాలు మారినా ఆమె పాట మారలేదు. బాలూతో సుశీల గొప్ప డ్యూయెట్స్ పాడింది. చక్రవర్తి సంగీతంలో 'కుశలమా నీకు కుశలమేనా', మహదేవన్‌తో 'సీతాలు సింగారం', సత్యంతో 'కురిసింది వానా', రమేశ్ నాయుడుతో 'పారుగింటి దొరగారికి దూకుడెక్కువ', రాజన్ నాగేంద్రతో 'లేత చలిగాలులు', ఎం.ఎస్.విశ్వనాథన్‌తో 'సరిగమలు గలగలలు'... ఎన్నని.

'సుశీలమ్మ' అని అందరూ పిలుచుకున్న ఈ పాటలమ్మ కలకాలం చల్లగా ఉండాలి. రుతువులు మళ్లీ మళ్లీ తాజాగా పలకరించినట్టు తరాలను పలకరిస్తూ ఉండాలి ఆమె పాటపై మన ప్రేమలా!

చినుకులా రాలి నదులుగా సాగి
వరదలై పోయి కడలిగా పొంగు
నీ ప్రేమ నా ప్రేమ నీ పేరే నా ప్రేమ.

హెల్త్

మామోగ్రామ్‌తో గుండెజబ్బూ తెలిసిపోనుంది!

నలభై ఏళ్లు దాటాక మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పును ముందే తెలుసుకునేందుకు మామోగ్రామ్ చేయించుకొమ్మని డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు. కుటుంబ ఆరోగ్య చరిత్రను బట్టి రిస్క్ ఉన్న చాలామంది ఇటీవల డాక్టర్ల సిఫార్సుతో ఏడాదికో లేదా రెండేళ్లకో ఈ పరీక్ష చేయించుకోవడం పరిపాటి అయ్యింది. ఇక కొద్దిరోజుల్లోనే మామోగ్రామ్ చేయించుకుంటే రొమ్ముక్యాన్సర్ ముప్పుతో పాటు... గుండెజబ్బుల ముప్పు అందునా ప్రత్యేకంగా గుండెకు రక్తం చేరవేసే రక్తనాళాలు బిరుసుగా మారే అథెరో స్క్లిరోసిస్ కార్డియో వాస్క్యులార్ డిసీజ్ గురించి కూడా తెలిసిపోయే అవకాశం రానుంది. ఫలితంగా కేవలం ఒకే పరీక్షతో రెండు మూడు రకాల సమస్యల గుట్టుమట్లు తెలిసిపోనున్నాయి. ఆ వివరాలివి...



మన దేశంలో ప్రతి వేయి మంది మహిళల్లో ఇద్దరికి క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. అయితే ప్రతి వందమందిలో 11 మందికి రొమ్ముల్లోని రక్తనాళాలు సైతం గట్టిగా బిరుసుబారిపోయి బ్రెస్ట్ ఆర్టీరియల్ క్యాల్సిఫికేషన్ జరిగే అవకాశముంది. అలాగే రొమ్ముల్లోని రక్తనాళాలతో పాటు ఇతర రక్తనాళాల్లోనూ క్యాల్షియమ్ చేరడంవల్ల, అవి ఫ్లెక్సిబుల్‌గా కాకుండా గట్టిగా, బిరుసుగా మారే అవకాశాలుంటాయి. ఇలా జరగడం వల్ల 'కార్డియో వాస్క్యులార్ డిసీజ్' వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండెకు రక్తాన్ని చేరవేసే కరోనరీ ఆర్టరీల్లో ఈ పరిణామం చోటు చేసుకుంటే అవి బిరుసెక్కిపోయి గుండెకు సరిగా రక్తం అందనందున 'గుండెపోటు' వచ్చే రిస్క్ ఉంటుంది. ఇలా రక్తనాళాలు బిరుసుబారడాన్ని 'అథెరోస్క్లిరోటిక్ కార్డియో వాస్కులార్ డిసీజ్' అని కూడా అంటారు.

రెండు జబ్బుల గురించి తెలిసేది ఇందుకే/ఇలాగే...

మామోగ్రామ్‌తో రొమ్ముక్యాన్సర్ ఎలాగూ తెలుస్తుంది. దాంతోపాటు గుండెజబ్బుల ముప్పు ఎలా తెలుస్తుందో తెలియాలంటే రక్తనాళాల గురించి కాస్త అవగాహన అవసరం. రక్తనాళం ఎటుపడితే అటు ఒంగిపోయేలా చాలా మృదువుగా, సరళంగా ఉంటుంది. రక్తప్రవాహానికి వీలుగా రక్తనాళం అలలు అలలుగా కదులుతుంటుంది. మణికట్టు దగ్గర నాడి పట్టుకుని చూసినప్పుడు తెలిసే విషయం నిజానికి అలలు అలలుగా కదిలే రక్తనాళమే. దీన్నే 'పల్స్'గా మనం చెప్పుకుంటాం.

రక్తనాళం ఇలా మృదువుగా ఉండితీరాలి. అప్పుడే రక్తప్రవాహంలోని ఒడిదుడుకులకు తట్టుకోవడం, ఒక్కోసారి రక్తప్రవాహ వేగం పెరిగినా చాలావరకు తట్టుకోవడం జరుగుతుంది. ఈ రక్తనాళం మూడు పొరలతో నిర్మితమై ఉంటుంది. రక్తం ప్రవహించే లోపలి పొరను 'ఇంటిమా' అనీ, మధ్యపొరను 'మీడియా' అనీ, బయటి పొరను 'అడ్వంటీషియా' అని అంటారు. రక్తం ప్రవహించే సమయంలో జరిగే ప్రమాదాల వల్ల అప్పుడప్పుడూ 'ఇంటిమా' దెబ్బతింటుంది. కానీ మన శరీరంలో ఏ భాగమైనా దెబ్బతింటే దాన్ని రిపేరు చేసుకునే శక్తి దేహానికి ఉంటుంది.

ఈ క్రమంలో ఇలా రిపేర్ జరిగే సమయంలో ఒకవేళ ఇంటిమాలోని దెబ్బతిన్న భాగం కొవ్వులతో (లైపిడ్స్‌తో) రిపేర్ అయితే అక్కడ క్రమంగా కొవ్వు పాచిలా పేరుకుపోయి, ఉండలాగా మారి రక్తప్రవాహానికి అడ్డుపడవచ్చు. ఒకవేళ పీచు కణాలతో రిపేర్ జరిగితే, అక్కడ సన్నబారిపోవచ్చు. ఇలా సన్నబడిపోవడాన్ని 'స్టెనోసిస్' అంటారు. ఒకవేళ రిపేర్ సమయంలో ఆ భాగంలో క్యాల్షియమ్ పేరుకుపోతే... మృదువుగా ఉండాల్సిన రక్తనాళం గట్టిగా బిరుసెక్కి ఎటూ వంగని గట్టి పైప్‌లా మారుతుంది. వీటిల్లో ఏది జరిగినా రక్తప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. అలా వచ్చే రక్తనాళాల సమస్యనే అథెరోస్క్లిరోసిస్ అంటారు. ఒకవేళ ఇవి గుండెకు రక్తాన్ని అందించే కరొనరీ ఆర్టరీలో జరిగితే... గుండెకండరానికి పోషకాలు, ఆక్సిజన్ అందక గుండెపోటు వస్తుంది.

మామోగ్రామ్‌తోనే గుండె, రక్తనాళాల పరీక్షలిలా...

మామోగ్రామ్ సహాయంతో రొమ్ములోని రక్తనాళాల్లో క్యాల్షియమ్ చేరడాన్ని (బ్రెస్ట్ ఆర్టీరియల్ క్యాల్సిఫికేషన్) కూడా గుర్తించవచ్చు. నిజానికి... రొమ్ము కండరాల్లోని రక్తనాళాలతో పాటు గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో జరిగే క్యాల్సిఫికేషన్‌ను అంచనా వేసేందుకు అవకాశముందా అనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా అనేక అధ్యయనాలు జరిగాయి. దానివల్ల రేడియేషన్‌కు గురికాకుండా ఉండటంతో పాటు, కేవలం ఒక పరీక్షకు అయ్యే ఖర్చుతోనే రెండుమూడు అంశాలను తెలుసుకునే అవకాశం ఉందంటూ వైద్యశాస్త్రవేత్తలు, అధ్యయనవేత్తలు ఈ ప్రయత్నాలు చేశారు. మామోగ్రామ్ నిర్వహించినప్పుడు ఆ పరీక్ష తాలూకు స్కోర్స్‌తోనే... రాబోయే ముప్పు ఏదీ లేదు అనీ, హానికరం కాని గడ్డలు రావచ్చనీ, క్యాన్సర్ ముప్పు ఉందనీ.. ఇలా అంచనా వేస్తుంటారు.

అయితే అదే పరీక్షతో వచ్చే క్యాల్షియం స్కోర్ ఆధారంగా కొన్ని దేశాల్లో గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లోని క్యాల్సిఫికేషన్‌ను సైతం తెలుసుకున్నారు. రక్తనాళాలు గట్టిబారడం వల్ల వచ్చే కార్డియోవాస్క్యులార్ డిసీజ్, అథెరో స్క్లిరోటిక్ కార్డియోవాస్క్యులార్ డిసీజ్‌తో పాటు గుండెపోటుకు గల అవకాశాలనూ లెక్కగట్టారు. ఈ లెక్కల ద్వారా ఇప్పటికే స్వీడన్‌లో ఒక్క మామోగ్రామ్ పరీక్షతోనే ఇటు రొమ్ముక్యాన్సర్ ముప్పునూ, అటు కార్డియో వాస్క్యులార్ జబ్బు / గుండెపోటు ముప్పునూ తెలుసుకోగలుగుతున్నారు.

అయితే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల వ్యక్తులూ, మరెన్నో దేశాల ప్రజల్లో అందరికీ సరిపోయేలాంటి ప్రామాణికత ఇంకా సాధించనందున ఈ పరీక్షలు అన్ని దేశాల్లోనూ జరగడం లేదు. కానీ ప్రామాణికతలు రూపొందించడం కోసం విరివిగా ప్రయత్నాలు మాత్రం జరుగుతున్నాయి. ఇవి నేడో, రేపో సాకారం కానున్నాయి కూడా. ఇదే జరిగితే... కేవలం మరికొద్ది రోజుల్లోనే మన దేశంలోనూ కేవలం మామోగ్రామ్ అనే ఒక్క పరీక్షతోనే రొమ్ముక్యాన్సర్ ముప్పులూ, రక్తనాళాల ఆరోగ్య పరిస్థితి, గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల ఆరోగ్యం, గుండెపోటుకు గల రిస్క్... ఇవన్నీ తెలిసిపోనున్నాయి.

క్యాన్సర్‌కూ, గుండెజబ్బులకూ ఒకేలాంటి రిస్క్ ఫ్యాక్టర్లు...

కొన్ని ఒకేలాంటి రిస్క్ ఫ్యాక్టర్లు ఇటు క్యాన్సర్‌కూ, అటు గుండెజబ్బులకూ కారణమవుతాయి. ఉదా: పెరిగే వయసు, స్థూలకాయం, హైబీపీ, అదుపులో లేని డయాబెటిస్ లాంటివి... ఇటు క్యాన్సర్‌నూ, అటు గుండెజబ్బులనూ తెచ్చిపెట్టవచ్చు. పెరిగే వయసు లాంటి మన ప్రమేయం లేని వాటిని మినహాయించి, మిగతా అంశాలను నివారించడం లేదా అదుపులో పెట్టుకోవడం వల్ల క్యాన్సర్‌నూ, గుండెపోటునూ, రక్తనాళాల సమస్యలనూ నివారించుకోవచ్చు. మిగతా సమస్యలెలా ఉన్నా రెండో దశ దాటిపోతే క్యాన్సర్ ప్రాణాంతకంగా మారే అవకాశముంది. ఒకవేళ అది రొమ్ముక్యాన్సర్ అయితే దాన్ని మొదటి లేదా రెండో దశలో తెలుసుకుంటే దాన్ని సమూలంగా నయం చేసుకునే వైద్యపరిజ్ఞానం ఇప్పుడు పూర్తిగా అందుబాటులో ఉంది. అందుకే కుటుంబంలో రొమ్ముక్యాన్సర్ చరిత్ర ఉండటం, అందునా తల్లి లేదా తల్లిగారి అక్కచెల్లెళ్లలో ఎవరికైనా క్యాన్సర్ ఉండటం, బీఆర్‌సీఏ వంటి జన్యుపరీక్షల్లో క్యాన్సర్ ముప్పు ఉన్నట్లు తేలడం వంటివి జరిగితే... నిర్దిష్ట సమయాల్లో మామోగ్రామ్ పరీక్ష చేయించుకొమ్మంటూ డాక్టర్లు ఇచ్చే సలహా మేరకు మహిళలు తరచూ ఆ పరీక్ష చేయించుకుంటూ ఉంటారు.

రక్తనాళం ఆరోగ్యాన్ని తెలుసుకునే పరీక్షలివి...

కెరోటిడ్ డాప్లర్ అనే పరీక్షతో దేహంలోని రక్తనాళాల పరిస్థితిని, ఇంటిమా తాలూకు ఆరోగ్యాన్ని పరోక్షంగా తెలుసుకునేందుకు వీలవుతుంది. మూత్రపిండాల వంటి అతి సున్నితమైన, దేహంలో చాలా లోపలికి ఉండే కీలక అవయవాల రక్తనాళాల కండిషన్‌ను నేరుగా తెలుసుకునేందుకు అవకాశం ఉండదు. అందుకే మెడకు ఇరువైపులా ఉండే 'కెరోటిడ్' రక్తనాళాలను పరీక్షించడం ద్వారా లోపలి కీలక అవయవాల్లోని రక్తనాళాల ఆరోగ్యాన్ని అంచనా వేస్తారు.

అలాగే ఇక గుండెకు రక్తాన్ని అందించే నాళాల పరిస్థితిని తెలుసుకునేందుకు యాంజియోగ్రామ్... ఇందులోనూ రేడియేషన్ వల్ల తెలుసుకునే సీటీ యాంజియో వంటి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. అటు కెరోటిడ్ డాప్లర్‌గానీ లేదా సీటీ యాంజియో వంటి పరీక్షలను తరచూ చేయించడానికి అంతగా అవకాశం ఉండదు. కానీ మహిళల విషయానికి వస్తే వారిలో మామోగ్రామ్ పరీక్ష మాత్రం తరచూ చేయించుకునేందుకు వారికి అవకాశం ఉంటుంది.


కెరోటిడ్ డాప్లర్ పరీక్ష


డాక్టర్ సురేశ్ ఏవీఎస్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్

సాధారణంగా గుండె... మిగతా మానవ శరీరమంతటికీ తన నుంచి వెలువడే రక్తనాళాల ద్వారా రక్తాన్ని సరఫరా చేస్తుంటుంది. ఈ రక్తనాళాలను ధమనులు అంటారు. మళ్లీ కొన్ని రక్తనాళాల ద్వారా గుండెకు రక్తం చేరుతుంది. ఇలా గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్ని సిరలుగా చెబుతారు. కాళ్ల దగ్గర ఉండే ఈ సిరలు దెబ్బతినడం, లేదా పై వైపునకు వెళ్లాల్సిన రక్తం సాఫీగా ప్రవహించకపోవడంతో కాళ్ల కింది భాగంలో, ప్రధానంగా పిక్కల వంటి చోట్ల రక్తనాళాలు ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. ఇలా కనిపించడాన్ని 'వేరికోస్ వెయిన్స్' అంటారు. ఆ కండిషన్‌పై అవగాహన కోసం... సంక్షిప్తంగా ఈ కథనం.

వేరికోస్ వెయిన్స్ బాధిస్తుంటే..



ఇతర శరీర భాగాల విషయంలో ఎలా ఉన్నప్పటికీ కాళ్ల విషయానికి వస్తే భూమి ఆకర్షణ శక్తి వల్ల గుండెకు చేరాల్సిన రక్తప్రసరణ కాస్త ఆలస్యమవుతుంది.

అంతేకాదు... వయసు పైబడటం, స్థూలకాయం, కుటుంబ చరిత్ర వంటి అంశాలతోనూ, ట్రాఫిక్ పోలీసులు, బస్ కండక్టర్లు వంటి వృత్తుల్లో ఉన్నవారు అదే పనిగా నిలబడే ఉండటం వంటి కొన్ని వృత్తిపనుల్లో రక్తప్రసరణ ఆలస్యం అవుతుంది. మహిళల్లో గర్భం దాల్చడం, హార్మోన్ల ప్రభావం వంటి అంశాలూ రక్తప్రసరణను ఆలస్యమయ్యేలా చేయవచ్చు. ఈ సమస్య శరీరంలో ఏ భాగానికైనా రావచ్చు. కానీ సాధారణంగా మోకాలి కింది భాగం నుంచి పాదాల వరకు వచ్చినప్పుడు ఈ పరిస్థితి చాలా ఇబ్బంది పెడుతుంది. ఈ సమస్య వచ్చినప్పుడు డాక్టర్‌ను సంప్రదించి, పడుకునే సమయంలో కాలిని కాస్త ఎత్తుగా ఉండేలా కాలికింద దిండు వేసుకుంటే సరిపోతుంది. కానీ వేరికోస్ వెయిన్స్ బాధిస్తుంటే డాక్టర్ సహాయం అవసరం.

● **వేరికోస్ వెయిన్స్ అంటే:** కొన్ని సందర్భాల్లో మాత్రం పరిస్థితి ఇంకాస్త తీవ్రంగా ఉంటుంది. కాలి రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినా; లేదా మోకాలి కింద ఉండే రక్తనాళాలు దెబ్బతిన్నా లేదా అవి బలహీనపడ్డా, ఆ రక్తనాళాల్లో రక్తాన్ని కిందికి పోకుండా నిలిపే కొన్ని కవాటాలు బలహీనపడటం వల్ల ఒక్కోసారి గుండెకు చేరాల్సిన రక్తసరఫరా సాఫీగా సాగదు. అలాంటప్పుడు మోకాలి కింది రక్తనాళాలు ఉబ్బినట్టుగా ఉండటం, సాలీడు కాళ్లను పోలిన ఉబ్బుతో కనిపించడం, అలా ఉబ్బిన రక్తనాళాలు నీలం, ఎరుపు రంగులో కనిపిస్తుంటే ఆ కండిషన్‌ను 'వేరికోస్ వెయిన్స్'గా చెబుతారు.

● **చికిత్సలు:** పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పుడు లేదా అప్పటికే రక్తనాళాలు ఉబ్బి బాగా బయటికి కనిపిస్తూ, తీవ్రమైన నొప్పి వస్తున్నప్పుడు శస్త్రచికిత్స ద్వారా పరిస్థితిని చక్కబరచాల్సి వస్తుంది. ఇందులో దెబ్బతిన్న రక్తనాళాలను శస్త్రచికిత్సతో తొలగిస్తారు. ఈ ప్రక్రియను 'వీన్ లైగేషన్ అండ్ స్ట్రిప్పింగ్' అంటారు. అయితే ఇప్పుడు శస్త్రచికిత్సను అంతగా ఉపయోగించడం లేదు. వైద్యశాస్త్రంలో వచ్చిన గణనీయమైన పురోగతి వల్ల ఇప్పుడు వేరికోస్ లేజర్ చికిత్సలు, గ్లూ చికిత్సల వంటి ఇతర అధునాతన ప్రక్రియలు, చికిత్స మార్గాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అది కూడా కోత పెట్టడంతో కాకుండా కేవలం రక్తనాళాల్లోకి (ఇంట్రావీనస్) కాన్యులా పంపడం వంటి సులువైన ప్రక్రియలతోనూ చికిత్స సాధ్యమవుతోంది.

నిర్ధారణ పరీక్షలు

వేరికోస్ వెయిన్స్ నిర్ధారణ కోసం కొన్ని పరీక్షలు చేస్తారు. వీనస్ అల్ట్రాసౌండ్, లోపలి రక్తనాళాలను చూస్తూ పరిస్థితి తెలుసుకునేందుకు సీటీ, ఎమ్మారై, 'వీనోగ్రామ్' వంటి పరీక్షలు చేస్తారు.


డాక్టర్ శ్రీధర్‌రెడ్డి బద్దం
సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులార్ అండ్ ఆంకో ఇంటర్వెన్షనల్ స్పెషలిస్ట్



గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నీ విజేత మను గండాస్

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 2022 గోల్ఫ్ టోర్నీలో న్యూఢిల్లీకి చెందిన మను గండాస్ విజేతగా నిలిచాడు. నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో 126 మంది గోల్ఫర్లు పాల్గొన్నారు. విజేతకు రూ.6 లక్షల ప్రైజ్‌మనీ దక్కింది. హైదరాబాద్‌కు చెందిన మిలింద్ సోనికి 'బెస్ట్ అమెచ్యూర్' అవార్డు దక్కింది. తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ బహుమతులు అందజేశారు. చారిత్రక గోల్కొండ కోటకు అనుబంధంగా ఉన్న హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరించిందని, భవిష్యత్తులో గోల్ఫ్ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామని మంత్రి వ్యాఖ్యానించారు.

ఇంగ్లండ్... ఈసారైనా!

టైటిల్ ఫేవరెట్‌గా మాజీ చాంపియన్ ● గ్రూప్ 'బి'లో ఇరాన్, అమెరికా, వేల్స్‌తో పోరు



ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ప్రతిసారీ భారీ అంచనాలతో అడుగు పెడుతుంది. ఈసారీ ఆ జట్టు టైటిల్ ఫేవరెట్‌గా ఉంది. గ్రూప్ 'బి'లో ఇరాన్, అమెరికా, వేల్స్ జట్లతో పోటీపడనున్న ఇంగ్లండ్ స్థాయికి తగ్గట్టు ఆడితే గ్రూప్ దశను సులువుగా దాటుతుంది.

ఇంగ్లండ్

ప్రపంచకప్ అత్యుత్తమ ప్రదర్శన: విజేత (1966)
ఇతర ఘనతలు: యూరో కప్ రన్నరప్ (2020)
'ఫిఫా' ర్యాంక్: 5
అర్హత: యూరోప్‌లో గ్రూప్–1 విజేత హోదాలో. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఇంగ్లండ్ అజేయంగా నిలిచింది. అదే జోరును ప్రధాన టోర్నీలోనూ కొనసాగించాలని పట్టుదలతో ఉంది. 2018 రష్యాలో జరిగిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ సెమీఫైనల్లో ఓడి, ఆ తర్వాత ప్లే ఆఫ్ మ్యాచ్‌లో బెల్జియం చేతిలోనూ ఓడి నాలుగో స్థానంలో నిలిచింది. కెప్టెన్ హ్యారీ కేన్‌తోపాటు జాక్ గ్రేలిష్, డెక్లాన్ రైస్, ట్రెంట్ అలెగ్జాండర్, జాన్ స్టోన్స్, కైల్ వాకర్‌లాంటి స్టార్ ఆటగాళ్లతో ఇంగ్లండ్ పటిష్టంగా ఉంది. ఓవరాల్‌గా 16వసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించి రెండోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉంది. .


ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్

ఇరాన్

ప్రపంచకప్ అత్యుత్తమ ప్రదర్శన: గ్రూప్ దశ
ఇతర ఘనతలు: ఆసియా విజేత (1968, 72, 76)
'ఫిఫా' ర్యాంక్: 20
అర్హత: ఆసియా క్వాలిఫయింగ్ మూడో రౌండ్ గ్రూప్ 'ఎ' విన్నర్
ఓవరాల్‌గా ఆరోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఇరాన్ ఏనాడూ గ్రూప్ దశలో తొలి రౌండ్‌ను దాటలేకపోయింది. ఆసియా క్వాలిఫయింగ్‌లో ఆడిన 18 మ్యాచ్‌ల్లో 14 విజయాలు అందుకున్న ఇరాన్ ప్రధాన టోర్నీలో ఈసారైనా తొలి రౌండ్ దాటాలని పట్టుదలతో ఉంది. సర్దార్ అజ్మౌన్, అలీరెజా, మాజిద్ హుస్సేన్‌లాంటి స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనపై ఇరాన్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

అమెరికా

ప్రపంచకప్ అత్యుత్తమ ప్రదర్శన: మూడో స్థానం (1930) **ఇతర ఘనతలు:** కాన్ఫడరేషన్స్ కప్ రన్నరప్ (2009) **'ఫిఫా' ర్యాంక్:** 16
అర్హత: ఉత్తర, మధ్య అమెరికా, కరీబియన్ క్వాలిఫయింగ్‌లో మూడో రౌండ్‌లో మూడో స్థానం.

నాలుగేళ్ల క్రితం రష్యాలో జరిగిన ప్రపంచకప్‌కు అర్హత పొందలేకపోయిన అమెరికా ఓవరాల్‌గా 11వసారి ఈ మెగా టోర్నీలో ఆడనుంది. పులిసిక్, వెస్టన్ మెకెనీ, రేనాలాంటి కీలక ఆటగాళ్లు రాణిస్తే నాకౌట్ దశకు చేరుకునే అవకాశముంది.

వేల్స్

ప్రపంచకప్ అత్యుత్తమ ప్రదర్శన: క్వార్టర్ ఫైనల్ (1958) **ఇతర ఘనతలు:** యూరో టోర్నీలో మూడో స్థానం (2016) **'ఫిఫా' ర్యాంక్:** 19
అర్హత: యూరోపియన్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్ విన్నర్. 1958 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించిన వేల్స్ జట్టు ఆశలన్నీ గ్యారెత్ బేల్, డానియల్ జేమ్స్, ఆరోన్ రామ్సేలాంటి స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనపై ఆధారపడి ఉన్నాయి.

–సాక్షి క్రీడావిభాగం

ఆఖరి పోరాటం

26 అక్టోబర్, 2022:
ఐర్లాండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన ఇంగ్లండ్
27 అక్టోబర్, 2022:
జింబాబ్వే చేతిలో స్వయంకృతంతో ఓడిన పాక్

టి20 ప్రపంచకప్‌లో ఈ మ్యాచ్‌ల తర్వాత ఈ రెండు జట్లపై సహజంగానే విమర్శలు చుట్టుముట్టాయి... టోర్నీలో ముందుకెళ్లడంపై సందేహాలు కనిపించాయి. కానీ అటు పాక్, ఇటు ఇంగ్లండ్ మళ్లీ ఉవ్వెత్తున ఎగిసాయి. తమలోని అసలు సత్తాను చూపిస్తూ దూసుకొచ్చాయి. ఇప్పుడు నవంబర్ 13, 2022న ప్రపంచకప్ ఫైనల్లో తలపడేందుకు సిద్ధమయ్యాయి. అన్ని అంచనాలను దాటి, ఫేవరెట్‌లను వెనక్కి నెట్టి విశ్వ విజేతగా నిలిచేందుకు పోటీ పడుతున్నాయి. ఈ మెగా టోర్నీని ఇప్పటికే చెరోసారి గెలుచుకున్న టీమ్‌లలో ఎవరి ఖాతాలో రెండోసారి ట్రోఫీ వెళుతుందో చూడాలి. ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికపై ఐసీసీ టోర్నీలో ఫైనల్లో ఈ రెండు జట్లు ముఖాముఖిగా ఎదుర్కోవడం ఇది రెండోసారి. 1992 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై పాక్ గెలవగా... మూడు దశాబ్దాల తర్వాత అదే పునరావృతమవుతుందా లేక భిన్నమైన ఫలితం వస్తుందా అనేది ఆసక్తికరం.


టి20 ప్రపంచకప్ ట్రోఫీతో బాబర్ ఆజమ్, బట్లర్

మెల్‌బోర్న్: అనూహ్య ఫలితాలు, హోరాహోరీ మ్యాచ్‌లు, సంచలన ప్రదర్శనలతో ఆసక్తికరంగా సాగిన 2022 టి20 ప్రపంచకప్ ఆఖరి సమరానికి రంగం సిద్ధమైంది. 42 గ్రూప్ మ్యాచ్‌లు, 2 నాకౌట్ మ్యాచ్‌ల తర్వాత 45వ పోరులో విశ్వ విజేత ఎవరో తేలనుంది. నేడు జరిగే ఫైనల్లో మాజీ చాంపియన్లు పాకిస్తాన్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. ప్రస్తుత బలాబలాలు, ఫామ్‌ను బట్టి చూస్తే ఇరు జట్లు సమ ఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. సెమీఫైనల్ మ్యాచ్‌లలోనూ రెండు జట్లూ ఏకపక్ష విజయాలు సాధించి తుది పోరుకు అర్హత సాధించాయి. పాకిస్తాన్ గడ్డపై ఇటీవలే ఇరు జట్ల మధ్య దాదాపు ఇదే ఆటగాళ్లతో 7 టి20 మ్యాచ్‌ల సిరీస్ జరిగింది కాబట్టి ప్రత్యర్థి గురించి ఆయా జట్టుకు మంచి అవగాహన ఉంది.

మార్పుల్లేకుండా...

సెమీస్‌లో అన్ని విధాలా సత్తా చాటిన పాకిస్తాన్ ఫైనల్ కోసం ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు. కెప్టెన్ బాబర్ ఆజమ్, రిజ్వాన్ విజయవంతమైన ఓపెనింగ్ జోడీగా గుర్తింపు తెచ్చుకున్నారు. మిడిలార్డర్‌లో మసూద్, ఇఫ్తికార్, నవాజ్‌లతో జట్టు బ్యాటింగ్ మెరుగ్గానే ఉంది. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'కి పోటీ పడుతున్న లెగ్‌స్పిన్నర్ షాదాబ్ ఆల్‌రౌండర్ పాత్రలో జట్టుకు టోర్నీ ఆసాంతం అండగా నిలిచాడు. అన్ని మ్యాచ్‌లలాగే పాక్ నలుగురు రెగ్యులర్ పేసర్లతో బరిలోకి దిగడం ఖాయం. షాహిన్ అఫ్రిది గాయం నుంచి కోలుకున్న తర్వాత ప్రమాదకరంగా మారడం సానుకూలాంశం. నసీమ్, వసీమ్ కూడా తమ పరిధిలో రాణిస్తుండగా రవూఫ్‌పై కూడా పాక్ ఆశలు పెట్టుకుంది. బిగ్‌బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున ఆడిన అతడిని ఎదుర్కోవడం ఇంగ్లండ్‌కు అంత సులువు కాదు.

ఓపెనర్లే కీలకం...

సెమీస్‌లో హేల్స్, కెప్టెన్ బట్లర్ ఆటను చూస్తే వారిద్దరు ఎలాంటి విధ్వంసం సృష్టించగలరో తెలుస్తుంది. అయితే వీరిద్దరు మినహా ఇంగ్లండ్ మిడిలార్డర్‌లో ఎవరు కూడా టోర్నీ మొత్తంలో ఒక సిక్స్‌కు మించి కొట్టలేదు! స్టోక్స్, బ్రూక్స్, లివింగ్‌స్టోన్ కూడా తమపై ఉన్న అంచనాలకు అనుగుణంగా రాణించలేకపోయారు. ఈ బలహీనతపై తమ స్పిన్‌తో పాక్ దెబ్బ కొట్టగలిగితే ఇంగ్లండ్‌కు కష్టం కావచ్చు. అయితే ఓపెనర్లే ఆటను ఏకపక్షంగా మార్చేయగలరు కాబట్టి వారిద్దరే కీలకం కానున్నారు. ఆరంభంలో షాహిన్‌ని సమర్థంగా ఎదుర్కోగలిగితే హేల్స్, బట్లర్ ఆపై ఆధిపత్యం ప్రదర్శించగలరు. జట్టులో దాదాపు అందరూ బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్నవారే అయినా అదే దూకుడుతో వికెట్లు కూడా చేజార్చుకోగలరు. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్లు మొయిన్ అలీ, వోక్స్, స్యామ్ కరన్‌లపై అదనపు బాధ్యత ఉంది. అయితే టోర్నీలోనే ఫాస్టెస్ట్ బౌలర్‌గా ఉన్న మార్క్ వుడ్ టీమ్‌లో లేకపోవడం జట్టుకు కొంత సమస్యగా మారింది. సెమీస్‌లో కూడా అతను ఆడలేదు. ఫైనల్‌కు అతను వస్తే జట్టు బౌలింగ్ బలం పెరుగుతుంది. టోర్నీలో చక్కటి ప్రభావం చూపించిన కరన్ కూడా రాణిస్తే పాక్ బ్యాటర్లకు కష్టాలు తప్పవు. మొత్తంగా చూస్తే ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో బలంగా ఉండగా, బౌలింగ్‌లో పాకిస్తాన్‌ది పైచేయిగా కనిపిస్తోంది. ఇంగ్లండ్ గెలిస్తే ఒకే సమయంలో వన్డే, టి20 వరల్డ్‌కప్‌లను తమ వద్ద ఉంచుకున్న తొలి జట్టుగా నిలుస్తుంది.

- నేడు టి20 ప్రపంచకప్ ఫైనల్
- అమీతుమీకి ఇంగ్లండ్, పాకిస్తాన్ సిద్ధం
- మ్యాచ్‌కు వర్షం ముప్పు!
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

పిచ్, వాతావరణం

ఫైనల్‌కు పెద్ద సమస్య వర్షం రూపంలోనే పొంచి ఉంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఆదివారం 100 శాతం వర్ష సూచన ఉంది. అయితే మెల్‌బోర్న్ వాతావరణం అనిశ్చితికి మారుపేరు. భారత్, పాక్ మ్యాచ్‌కు ముందు కూడా ఇలాగే భావించినా, ఒక్క చుక్క వర్షం పడలేదు! ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది. అయితే నిబంధనల ప్రకారం రెండో ఇన్నింగ్స్‌లో కనీసం 10 ఓవర్ల ఆట జరిగితే అది వారమే ఫలితం తేలిపోతుంది. అంతకన్నా తక్కువకే ఆట ఆగిపోతే, సోమవారం అదే స్కోరు నుంచి కొనసాగిస్తారు. పిచ్ ఆరంభంలో పేస్, బౌన్స్‌కు అనుకూలంగా ఉంటుంది. అయితే బ్యాటర్లు దానిని అధిగమిస్తే భారీ స్కోరుకు అవకాశం ఉంది.

9 పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 28 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 9 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ నెగ్గగా... 17 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచింది. ఒక మ్యాచ్ 'టై' అయింది. మరో మ్యాచ్ రద్దయింది.

2 టి20 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరగ్గా... రెండింటిలోనూ ఇంగ్లండే విజయం సాధించింది.

3 ఇంగ్లండ్, పాకిస్తాన్ జట్లకిది మూడో టి20 ప్రపంచకప్ ఫైనల్. 2007లో పాక్ రన్నరప్‌గా నిలిచి, 2009లో టైటిల్ సాధించింది. ఇంగ్లండ్ 2010లో చాంపియన్‌గా నిలిచి, 2016లో రన్నరప్‌తో సంతృప్తి పడింది.

5 ఇప్పటి వరకు ఏడు టి20 ప్రపంచకప్ ఫైనల్స్ జరగ్గా... ఛేజింగ్ చేసిన జట్లు ఐదుసార్లు... తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు రెండుసార్లు గెలిచాయి.

ఫైనాన్స్ కమిటీ చైర్మన్‌గా జై షా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ కమిటీకి చైర్మన్‌గా బీసీసీఐ కార్యదర్శి జై షా ఎంపికయ్యారు. అయితే ప్రస్తుతానికి జై షా ఎఫ్ అండ్ సీఏలో సభ్యుడిగా మాత్రమే ఉంటారు. మార్చి 2023 నుంచి రాస్ మెకల్లమ్ స్థానంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారు. ఐసీసీ చైర్మన్‌గా న్యూజిలాండ్‌కు చెందిన గ్రెగ్ బార్క్లే మరో రెండేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగుతారు.

రోహిత్ రాయుడు, తిలక్ వర్మ సెంచరీలు



న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో శనివారం జరిగిన ఎలైట్ గ్రూప్ 'ఎ' తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ వీజేడీ పద్ధతిలో 17 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. రోహిత్ రాయుడు (156; 12 ఫోర్లు, 8 సిక్స్‌లు), తిలక్ వర్మ (132; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కడంతో... తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 50 ఓవర్లలో 3 వికెట్లకు 360 పరుగులు సాధించింది. అనంతరం హిమాచల్ 48 ఓవర్లలో 9 వికెట్లకు 335 పరుగులు చేసింది. ఈ దశలో వెలుతురు మందగించడంతో ఆటను నిలిపి వేశారు. వీజేడీ పద్ధతిలో హిమాచల్ లక్ష్యాన్ని లెక్కించగా 353 పరుగులుగా వచ్చింది. దాంతో హైదరాబాద్ 17 పరుగులతో విజయాన్ని ఖాయం చేసుకుంది. బెంగళూరులో ఆంధ్ర, గోవా జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

రజతంతో శివ థాపా రికార్డు



అమ్మాన్ (జోర్డాన్): ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పురుషుల 63.5 కేజీల విభాగంలో భారత బాక్సర్ శివ థాపా రజత పతకం సాధించాడు. రుస్లాన్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన ఫైనల్లో థాపా గాయం తో బౌట్ మధ్యలోనే వైదొలిగాడు. తాజా పతకంతో ఈ టోర్నీ చరిత్రలో అత్యధికంగా ఆరు పతకాలు గెలిచిన బాక్సర్‌గా థాపా చరిత్ర సృష్టించాడు.

సినిమా

"నేటి యువత చదువు, నా కుటుంబం, నా ఉద్యోగం, నా సంపాదన అంటూ ఉరుకులు పరుగులు పెడుతోంది. అలాంటి యువతరానికి విలువల గురించి చెప్పాలని తీసిన చిత్రం 'కవి సమ్రాట్'. విలువల కోసం యువత పరుగులు పెడితే భారతదేశం గతం కంటే వంద రెట్లు బాగుంటుంది" అని ప్రముఖ రచయిత, నటుడు ఎల్బీ శ్రీరామ్ అన్నారు. పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, కవి విశ్వనాథ సత్యనారాయణ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'కవి సమ్రాట్'. ఎల్బీ శ్రీరామ్ టైటిల్ రోల్‌లో నటించి, నిర్మించారు. సవిత్ సి. చంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబర్ 22 నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా ఎల్బీ శ్రీరామ్ పంచుకున్న విశేషాలు.

అందుకే అరవై షార్ట్ ఫిలింస్ తీశా! - ఎల్బీ శ్రీరామ్

● పాఠశాల స్థాయిలోనే నాటకాలు రాసి, దర్శకత్వం వహించి, నటించేవాణ్ణి. సామాజిక అంశాలపైనే నా నాటక రచనలు ఉండేవి. ఆ తర్వాత నటుడు కావాలని ఇండస్ట్రీకి వచ్చాను. అయితే నటుల మధ్య ఎక్కువ పోటీ ఉండటంతో పన్నెండేళ్ల పాటు రచయితగా చేశాను. నా గురువు ఈవీవీ సత్యనారాయణగారి వద్ద చాలా సినిమాలకు రచయితగా చేశాను. ● ఈవీవీగారి 'చాలా బాగుంది' నటుడిగా నాకు బ్రేక్ ఇచ్చింది. అయితే 'అమ్మో ఒకటో తారీఖు' సినిమాలో నా పాత్ర సీరియస్‌గా ఉండటంతో అలాంటి పాత్రలే ఎక్కువగా వచ్చేవి. ఒకే రకమైన పాత్రలు చేయడం నాకు ఇష్టం లేదు. డైరెక్టర్లు చెప్పినట్లు చేస్తే డబ్బులు వస్తాయి.. కానీ, డబ్బుకన్నా సంతృప్తి ముఖ్యం. దాంతో చాలా సినిమాలు వదులుకున్నాను. నా మనసుకు నచ్చిన, విలువలతో కూడిన అంశాలను ప్రేక్షకులకు చూపించాలనుకున్నాను. అందుకే అరవై షార్ట్ ఫిలింస్ తీశాను. ● భారతదేశంలోని ధ్వజస్తంభాల్లాంటి మహనీయుల్లో కొందరి చరిత్రలైనా చెబుదామనిపించింది. ఈ క్రమంలో యువతని ప్రోత్సహించాలనుకున్నాను. ప్రతిభావంతులైన తొమ్మిది మందిని ఎంచుకుని, కథలు రాయమన్నాను. వాటిల్లో విశ్వనాథ సత్యనారాయణగారిపై సవిత్ సి. చంద్ర రాసిన కథ నచ్చడంతో తన దర్శకత్వంలోనే 'కవి సమ్రాట్' నిర్మించాను. తన తాతగారు సి. సుందరరామ శర్మగారు విశ్వనాథ సత్యనారాయణగారిపై రాసిన పుస్తకం ఆధారంగా సవిత్ 'కవి సమ్రాట్' కథని రాసి, అద్భుతంగా తెరకెక్కించాడు. ● విశ్వనాథ సత్యనారాయణగారి ఆశీర్వాదాలతోనే ఆయన పాత్రలో నటించి, నిర్మించాను. విశ్వనాథ సత్యనారాయణగారిపై కథ రాసుకుని నా వద్దకు వచ్చిన సవిత్‌కి, ఇలాంటి విలువలున్న చిత్రాన్ని 'ఆహా'లో విడుదల చేసే అవకాశం కల్పించిన అల్లు అరవింద్‌గారికి, ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ● నేటి యువత తమను తాము నిరూపించుకోవాలనే ఆకాంక్షతో ఇండస్ట్రీకి వస్తున్నారు. అయితే వారు తమ ఆకాంక్షను బలమైన సంకల్పంగా మార్చుకున్నప్పుడే విజయం సాధిస్తారు. ప్రస్తుతం నా టీమ్‌లో నేను తప్ప మిగిలిన వారందరూ పాతికేళ్లలోపు కుర్రాళ్లే. వారి కొత్త ఆలోచనలకు నేను తోడుగా నిలబడి నటించడంతో పాటు నిర్మించి వారికి ధైర్యం ఇస్తున్నా. ● ముప్పై ఏళ్ల నా సినీ ప్రయాణంలో ఒక నటుడిగా ఇప్పటికీ నన్ను నేను నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. సినిమాలు మాత్రమే చేయాలనే ఆలోచన నాకు లేదు. అందుకే.. షార్ట్ ఫిలింస్ ద్వారా సమాజానికి ఉపయోగపడే కథలను ప్రేక్షకులకు చెబుతున్నాను. సినిమాల్లో సంపాదించిన డబ్బుని షార్ట్ ఫిలింస్‌కి ఖర్చు చేసేశాను. ఈ జర్నీలో లాభ, నష్టాల గురించి ఆలోచించను.. ఈ ప్రయాణాన్ని ఆపను. మూడు నాలుగు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. అవి రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. మరికొన్ని కథలు వింటున్నాను.



● గతంలో నేను పోటీ పడ్డ తోటి హాస్య నటుల్లో చాలామంది ఇప్పుడు లేరు. అలాగే నాకు విరివిగా అవకాశాలు ఇచ్చి, ప్రోత్సహించిన దర్శకులు కూడా లేరు. పైగా గతంతో పోలిస్తే ప్రస్తుత సినిమాల్లో హాస్యనటులకు ప్రాధాన్యం ఉండటం లేదు.. అలా వచ్చి, వెళ్లిపోయే చిన్న చిన్న పాత్రలు రాస్తున్నారు. ఈ మధ్య నాకు వస్తున్న పాత్రలు మూస ధోరణిలో ఉండటంతో ఒప్పుకోవడం లేదు.. అందుకే నేను బిజీగా ఉండటం లేదు (నవ్వుతూ). వైవిధ్యమైన పాత్రలొస్తే నేనెప్పుడూ సిద్ధమే.

విదేశాల్లో అన్వేషణ


● శ్రుతీహాసన్

గ్రీస్‌లో బిజీ బిజీగా ఉంటున్నారు శ్రుతీహాసన్. ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' కోసమే అంత బిజీగా ఉన్నారు. మార్క్ రౌలీ, శ్రుతీహాసన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సైకలాజికల్ చిత్రం 'ది ఐ'. డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం గ్రీస్‌లో జరుగుతోంది. అలాగే ఏథెన్స్‌లోని లొకేషన్స్‌లో కూడా ఈ సినిమా షూటింగ్‌ను జరుపుతున్నారు. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథతో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ చిత్రంలో భర్త మరణానికి దారి తీసిన కారణాల కోసం అన్వేషించే యువతి పాత్రలో శ్రుతి కనిపిస్తారని టాక్. ఇక ఈ సినిమా కాకుండా తెలుగులో చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', ప్రభాస్ 'సలార్' చిత్రాల్లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

ట్రైలర్ అద్భుతంగా ఉంది


● విజయ్

"వాట్ ఏ గ్రేట్ ట్రైలర్. అద్భుతంగా ఉంది. సూపర్బ్‌గా కట్ చేశారు. 'మసూద'కు నా మద్దతు ఉంటుంది. ఇలాంటి కొత్త కథలను, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహిస్తున్న రాహుల్ యాదవ్‌గారికి అభినందనలు'' అన్నారు విజయ్ దేవరకొండ. రాహుల్ యాదవ్ నిర్మించిన చిత్రం 'మసూద'. ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాత 'దిల్' రాజు విడుదల చేస్తున్నారు. ట్విట్టర్ వేదికగా ట్రైలర్‌ని విడుదల చేసి, శుభాకాంక్షలు అందజేశారు విజయ్ దేవరకొండ. సంగీత, తిరువీర్, కావ్య కల్యాణ్ రామ్, శుభలేఖ సుధాకర్ ముఖ్య తారలుగా నటించిన ఈ చిత్రం ద్వారా సాయికిరణ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

థ్రిల్లింగ్ రాబరీ

రావణ్ నిట్టూరు, శ్రీ నిఖిత హీరో హీరోయిన్లుగా నటించిన రాబరీ థ్రిల్లర్ 'అలిపిరికి అల్లంత దూరంలో..'. జె. ఆనంద్ దర్శకత్వంలో రమేష్ డబ్బుగొట్టు, రెడ్డి రాజేంద్ర పి. నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలకానుంది. శనివారం దర్శకుడు మారుతి ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రావణ్ మాట్లాడుతూ– ''నాటక రంగంలో అనుభవం ఉన్న నాకు యాక్టర్‌గా వెండితెరపై ఇది తొలి చిత్రం'' అన్నారు. ''తిరుమలలో షాపు సంపాదించుకోవాలనుకునే ఓ యువకుడి జీవితంలో జరిగిన సంఘటనల సమాహారమే ఈ చిత్రం. ఈ చిత్రంలోని ప్రతి సీన్‌లో వెంకటేశ్వరస్వామి రిఫరెన్స్ ఉంటుంది'' అన్నారు ఆనంద్. జె. ''డివైన్ ఎలిమెంట్స్‌తో థ్రిల్లింగ్‌గా సాగే రాబరీ డ్రామా ఈ చిత్రం'' అన్నారు నిర్మాతలు రమేష్, రాజేంద్ర.


● రమేష్, రావణ్, శ్రీ నిఖిత, రాజేంద్ర, ఆనంద్

పాప పేరు.. దేవి బసు సింగ్ గ్రోవర్



నటి బిపాసా బసు శనివారం ఓ పాపకు జన్మనిచ్చారు. 2016లో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్, బిపాసా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ''మా ప్రేమకు ప్రతి రూపం మా పాప. దేవి బసు సింగ్ గ్రోవర్ (పాపకు పెట్టిన పేరు)'' అని సోషల్ మీడియా ద్వారా కుమార్తె పేరు చెప్పారు బిపాసా, కరణ్.

గణేష్‌కి మరో విజయం దక్కాలి - దర్శకుడు వీవీ వినాయక్

బెల్లంకొండ గణేష్, అవంతిక జంటగా నటించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. కృష్ణచైతన్య కథ, స్క్రీన్ ప్లేతో రాఖీ ఉప్పలపాటి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేసిన దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. ఈ సినిమాతో గణేష్‌కు మరో విజయం దక్కాలి. 'నాంది' వంటి సినిమాను నిర్మించిన సతీష్ వర్మ సంస్థలో గణేష్ సినిమా చేయడం హ్యాపీగా ఉంది. దర్శకుడు రాఖీతో పాటు చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''నా తొలి చిత్రం 'స్వాతిముత్యం'తోనే ప్రేక్షకులు నన్ను యాక్సెప్ట్ చేయడం సంతోషంగా అనిపించింది. అయితే ఆ సినిమా రిలీజ్ కాక ముందే నన్ను నమ్మి, 'నేను స్టూడెంట్ సర్'ను నిర్మించిన సతీష్‌గారికి ధన్యవాదాలు. ఈ కథలో మంచి కంటెంట్ ఉంది. అందుకే యాక్సెప్ట్ చేశాను'' అన్నారు గణేష్. ''నిర్మాతగా నా తొలి చిత్రం 'నాంది' సక్సెస్ అయ్యింది. 'నేను స్టూడెంట్ సర్'లో కూడా మంచి కంటెంట్ ఉంది'' అన్నారు సతీష్ వర్మ. ''గణేష్ కథతో పాటే ట్రావెల్ చేస్తారు. సతీష్‌గారి లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం'' అన్నారు రాఖీ.


● రాఖీ, బెల్లంకొండ గణేష్, వీవీ వినాయక్, అవంతిక, సతీష్ వర్మ

సినిమా అనేది పుట్టుకతో సమానం - దర్శకుడు నాగ్ అశ్విన్


● క్రాంతి కిరణ్, నాగ్ అశ్విన్, వెంకట్ కల్యాణ్

''మా ఫ్యామిలీకి సన్నిహితుడైన క్రాంతి కిరణ్ నిర్మించిన 'చెడ్డి గ్యాంగ్ తమాషా' టీజర్ బాగుంది. సినిమా అనేది పుట్టుకతో సమానం. ఒక తల్లి నవమాసాలు మోసి జన్మించేవరకు పడే తపనే సినిమా. ఈ సినిమా టీజర్ చూస్తుంటే మేం యంగ్ టీమ్‌తో చేసిన 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమా గుర్తుకు వస్తోంది. 'చెడ్డి గ్యాంగ్..' సినిమా కూడా ఆ సినిమా అంతటి విజయం సాధించాలి'' అని అన్నారు దర్శక–నిర్మాత నాగ్ అశ్విన్. వెంకట్ కల్యాణ్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. ఈ చిత్రంలో గాయత్రి పటేల్ హీరోయిన్‌గా నటించారు. సీహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకలో నాగ్ అశ్విన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ''హీరో, డైరెక్టర్.. ఈ రెండింటిని వెంకట్ బాగా బ్యాలెన్స్ చేశాడు. ఈ సినిమా నిడివి నాలుగు గంటలు వచ్చింది. దీన్ని రెండు గంటల 40 నిమిషాలకు తగ్గించేందుకు మేం గర్భశోకం అనుభవించాం'' అన్నారు క్రాంతి కిరణ్. ''యాక్టర్ కావాలన్న నా పదిహేను సంవత్సరాల కల ఈ సినిమాతో నేరవేరింది'' అన్నారు వెంకట్.

యశోద కథ అందరికీ తెలియాలి


● కల్పిక, ప్రియాంక, దివ్య

సమంత టైటిల్ రోల్ చేసిన చిత్రం 'యశోద'. హరి–హరీష్ తెరకెక్కించిన ఈ సినిమాలో వరలక్ష్మీ శరత్‌కుమార్, ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలు పోషించగా, కల్పికా గణేష్, దివ్య శ్రీపాద, ప్రియాంకా శర్మ కీలక పాత్రలు చేశారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కల్పికా గణేష్ మాట్లాడుతూ– ''కొన్ని సినిమాల్లో నేను లీడ్ రోల్స్ చేస్తున్నప్పటికీ 'యశోద' వంటి కథ అందరికీ తెలియాలని ఈ సినిమాలో గర్భవతిగా ముఖ్య పాత్ర చేసేందుకు ఒప్పుకున్నాను'' అన్నారు. ''యశోద'లాంటి కథలు అరుదుగా వస్తాయి'' అన్నారు ప్రియాంకా శర్మ. ''లీల క్యారెక్టర్ బాగా చేశావని సమంతగారు చెప్పడాన్ని నేను బెస్ట్ కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను'' అన్నారు దివ్య శ్రీపాద.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

దళితులపై టీడీపీ నేతల దాష్టీకం

- భూముల ఆక్రమణను అడ్డుకున్న వారిపై విచక్షణారహితంగా దాడి
- రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



మహిళలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

లక్కిరెడ్డిపల్లి: అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామంలో టీడీపీ రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి సహా పలువురు నాయకులు దళితులపై దాడికి తెగబడ్డారు. తమ భూములను ఆక్రమించవద్దని అడ్డుకున్నందుకు మహిళలు అని కూడా చూడకుండా వారిపై దాడికి పాల్పడ్డారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా, బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగు చూసింది. ఎస్‌ఐ వినోద్ కుమార్, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల అప్పలరాజుగారిపల్లె సబ్ స్టేషన్ ప్రాంతంలోని కొత్త మాదిగ పల్లెలో 30 ఏళ్లుగా దళితులు డీకేటీ పట్టాలు పొంది భూములు సాగు చేసుకుంటున్నారు. ఆ భూములను ఆక్రమించేందుకు రమేష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తన అనుచరులతో అక్కడకు వెళ్లారు. దీంతో వారిని అడ్డుకుని తమ భూములను ఆక్రమించవద్దని దళితులు ప్రాధేయపడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఇక్కడ సుమారు 30 ఎకరాల వరకు భూములను తాను కొనుగోలు చేసినట్టు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు.

20 ఏళ్ల క్రితం పట్టా ఇచ్చారు..

20 సంవత్సరాల క్రితం ఇచ్చిన పట్టా భూమిలో తాము బోరు వేసుకొని మామిడితోట సాగు చేస్తున్నామని కొత్త మాదిగపల్లెకు చెందిన దళితులు సానిపాయి శివనారాయణ, నాగరత్నమ్మ తెలిపారు. తమ భూములు అమ్మకపోయినా డీకేటీ ప్రభుత్వ భూముల నుంచి ఉన్న మట్టిరోడ్డు మూయించేందుకు అడ్డంగా బండలు వేశారని బాధితులు తెలిపారు. తాము పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయించడమే కాకుండా తమపై రమేష్‌కుమార్‌రెడ్డి, అతని అనుచరులు దాడికి పాల్పడి కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల దుస్తులు కూడా చింపారని బాధితులు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దేశ రాజకీయాల్లో ములాయం స్థానం సుస్థిరం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ములాయంసింగ్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): సామాజిక విప్లవకారుడు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన యూపీ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ దేశ రాజకీయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ములాయం సంస్మరణ సభలో కారుమూరి మాట్లాడారు. సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడిగా ఆది నుంచి వెనుకబడిన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ సమసమాజం కోసం ఉద్యమించారని చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ మండల్ రిజర్వేషన్ కోసం పోరాడారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ములాయంసింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ భారత దేశ రాజకీయాల్లో నూతన ఒరవడిని తీసుకువచ్చిన అరుదైన వ్యక్తి ములాయం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మండల్–2 కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ్‌వాది పార్టీ నేత పీ మధు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులు రఘువీరారెడ్డి, యనమల రామకృష్ణుడు, కె. రామకృష్ణ, బీసీ సంఘాల నాయకులు పాల్గొని ములాయం సింగ్ యాదవ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

'ప్రీమియం' రిజిస్ట్రేషన్ రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయనున్నారు. పైలట్ ప్రాజెక్టుగా విశాఖపట్నం, శ్రీకాకుళంలో రెండు సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుపై ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. విశాఖ మధురవాడ సెజ్‌లోని టవర్‌-బిలో ఏర్పాటు చేసిన తొలి ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్ ఇప్పటికే అన్ని హంగులతో సిద్ధమైంది. దీనిని త్వరలోనే ప్రారంభించనున్నారు. ఆ తర్వాత శ్రీకాకుళంలో రెండోది ఏర్పాటు చేస్తారు. అనంతరం విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కడపలో ఏర్పాటుచేస్తారు. సోమవారం దీనిపై ముఖ్యమంత్రితో అధికారులు సమావేశమవనున్నారు. ఆయన అంగీకరించిన వెంటనే విశాఖలో పైలట్ ప్రాజెక్టు మొదలు పెడతారు. ఈ సెంటర్ల పనితీరు, ప్రజల నుంచి వచ్చిన స్పందననుబట్టి దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్.. సింగిల్ విండో రిజిస్ట్రేషన్లు

ఈ సెంటర్లలో ఫ్రంట్ ఎండ్ (ముందు భాగం)లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉంటారు. బ్యాక్ ఎండ్‌లో సబ్ రిజిస్ట్రార్, ఇతర సిబ్బంది పనిచేస్తారు. మొదట కొద్ది రోజులు ఆఫ్‌లైన్ సేవలు అందించినా, ఆ తర్వాత అన్నీ ఆన్‌లైన్ సేవలే ఉండేలా వీటిని డిజైన్ చేశారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. దాని ప్రకారం సెంటర్‌కు వెళ్లి సింగిల్ విండో కింద రిక్వెస్ట్ పెడితే ఆన్‌లైన్‌లో సంబంధిత సేవా ప్రక్రియ మొదలవుతుంది. వినియోగదారులే తమ సమాచారాన్ని నమోదు (డేటా ఎంట్రీ) చేసుకోవచ్చు. అది ఆన్‌లైన్‌లోనే సబ్ రిజిస్ట్రార్‌కి వెళుతుంది. సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి ఆధార్ వెరిఫికేషన్ చేస్తారు. అనంతరం ప్రోపర్టీ వెరిఫికేషన్‌ను సంబంధిత ప్రభుత్వ శాఖ వెబ్‌సైట్ ద్వారా పరిశీలిస్తారు. అది సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేస్తారు. ఇక్కడ డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం ఏమాత్రం ఉండదు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చేయించుకున్న వారికి పూర్తయినట్లు మెసేజ్ వెళుతుంది. రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ మదింపు, ఈసీలు, సీసీలు, స్టాంపుల అమ్మకాలన్నీ ఇక్కడే జరుగుతాయి. స్టాంప్ డ్యూటీ కలెక్షన్లను స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ నిర్వహిస్తుంది. ఇందుకోసం ఆ సంస్థ అక్కడ ఒక బ్రాంచిని ఏర్పాటు చేస్తుంది. దాని ద్వారా అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయొచ్చు. ప్రస్తుతానికి ఇప్పటికే పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని వినియోగించనున్నారు. ఈ సెంటర్లలో వినియోగదారుల కోసం విశ్రాంతి గది, కెఫెటేరియా వంటి సదుపాయాలుంటాయి.

అవినీతి రహితంగా, సులభంగా రిజిస్ట్రేషన్లు

అవినీతి రహిత రిజిస్ట్రేషన్ సేవలు అందించడమే ప్రీమియం సెంటర్ల ప్రధాన ఉద్దేశం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభంగా రిజిస్ట్రేషన్ సేవలు అందుతాయి. మధ్యవర్తుల ప్రమేయం ఉండదు.

– డాక్టర్ రజత్ భార్గవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

క్లుప్తంగా

ఉన్నత విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఎం.వెంకటరమణ

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు మేరకు నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ చైర్మన్‌గా రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.వెంకటరమణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు మేరకు జస్టిస్ ఎం. వెంకటరమణ నియామకం చేసినట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. చైర్‌పర్సన్‌గా మూడేళ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిట్ అధ్యాపకుడు సందీప్‌కు జాతీయ అవార్డు



ఎంపీ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీ నిట్ అధ్యాపకుడు సందీప్

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఉద్దంటి సందీప్ జాతీయస్థాయిలో ఉత్తమ యువజన ఇంజనీరింగ్ అవార్డును అందుకున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా, ఐఈఐ కోల్‌కతా వారు ఇంజనీరింగ్ విభాగంలో పలు పరిశోధనలు చేసి అద్భుత ప్రతిభ కనబరచిన 35 సంవత్సరాలలోపు వారికి ఉత్తమ యువ ఇంజనీర్ అవార్డులను ఇస్తున్నారు. దీనిలో భాగంగా 2021–22 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు సందీప్ ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో శనివారం ప్రారంభమైన 37వ ఎలక్ట్రికల్ ఇంజనీర్ల జాతీయ సమావేశంలో ఈ పురస్కారాన్ని సందీప్‌కు ఎంపీ గవర్నర్ మంగూభాయ్ పటేల్ అందజేశారు. సందీప్‌ను నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి, డీన్‌లు జి.ఆర్.కె.శాస్త్రి, ఎస్.జయరామ్, టి.కురుమయ్య, బి.బి.వీరేష్‌కుమార్ అభినందించారు.

కోస్టుగార్డు అదుపులో శ్రీలంక జాలర్లు



పట్టుబడ్డ శ్రీలంక జాలర్లు

కాకినాడ క్రైం: అనుమతులు లేకుండా భారత జలాల్లోకి ప్రవేశించిన శ్రీలంక జాలర్లను భారత కోస్టుగార్డు అదుపులోకి తీసుకుంది. 11 మంది సభ్యుల ఈ బృందం కళింగపట్టణానికి 175 నాటికల్ మైళ్ల దూరంలో చేపలు వేటాడుతుండగా ఈ నెల 10వ తేదీన భద్రతా సిబ్బందికి పట్టుబడింది. వీరిని శనివారం కాకినాడ జిల్లా కాకినాడ కోస్టుగార్డు కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం అధికారుల విచారణ కొనసాగుతుంది. రెండు బోట్లలో పట్టుబడ్డ ఈ 11 మందికీ ఎటువంటి అనుమతులు లేవని కాకినాడ కోస్టుగార్డు అధికారుల విచారణలో తేలింది. ప్రాథమిక విచారణ అనంతరం ఆదివారం వీరిని కాకినాడ మెరైన్ పోలీసులకు అప్పగించనున్నారు. కోస్టుగార్డుతో పాటు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ, కస్టమ్స్, ఇంటెలిజెన్స్ బ్యూరోల సంయుక్త భద్రతా పర్యవేక్షణలో శ్రీలంక జాలర్లను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

• హైవేపై ‘విమానం’



సింగరాయకొండలోని జాతీయ రహదారిపై ఆగిన విమానాన్ని తీసుకుని వెళ్తున్న ట్రాలీ.. ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

యుద్ధ విమానాలు అత్యవసరంగా దిగేందుకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై శనివారం విమానం ఆగింది. ఇది కేరళ రాష్ట్రం త్రివేండ్రం నుంచి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా షామీర్‌పేటకు వెళుతోంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కనుమళ్ల జంక్షన్ వద్ద జాతీయరహదారిపై ఆగిన దీనిని వాహనదారులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సెల్ఫీలు తీసుకున్నారు. అయితే ఇదో పాత విమానం. హైదరాబాద్ పిస్తాహౌస్ వారు దీనిని కొనుగోలు చేశారు. కేరళ ప్రభుత్వం నిర్వహించిన వేలంలో పాత ఎయిర్ బస్ విమానాన్ని కోటీ యాభై లక్షల రూపాయలకు కొన్నారు. దీనిని షామీర్ పేటలో ఉన్న పిస్తాహౌస్ బ్రాంచికి భారీ ట్రాలీలో తరలిస్తున్నారు. అందులో బార్ అండ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. కాగా, బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్ వద్ద అండర్‌పాస్‌లోంచి వెళ్లాల్సి వచ్చింది. కానీ విమానం పైభాగం అండర్‌పాస్‌కు తగులుతుండటంతో ఎటూ పోలేక ట్రాలీ లారీని అక్కడే రోడ్డు పక్కన నిలిపేశారు.

– సింగరాయకొండ/మేదరమెట్ల

• జర్మనీ అమ్మాయి.. ఆంధ్రా అబ్బాయి..

పెళ్లి సాక్షిగా ఒక్కటైన ప్రేమ జంట



వధూవరులు జర్మనీ యువతి సోఫియా, డాక్టర్ వెంగల్

దేశాలు వేరైనా.. వారి అభిప్రాయాలు కలవడంతో వారి మనసులు కలిశాయి. ప్రేమ చిగురించింది. దీంతో వివాహ బంధంతో ఆ జంట ఒక్కటయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల పంచాయతీ పరిధిలోని జొన్నలగరువుకు చెందిన డాక్టర్ విజయప్రసాద్, కృష్ణకుమారి దంపతుల కుమారుడు డాక్టర్ వెంగల్.. సౌత్ ఆఫ్రికాలో 2016లో ఎంఎస్ చేశారు. అక్కడ లాప్రోస్కోపిక్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. అక్కడే ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. అదే సమయంలో జర్మనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోఫియా ఓ సెమినార్‌లో పాల్గొనేందుకు సౌత్ ఆఫ్రికా వచ్చారు. వీరిద్దరి అభిప్రాయాలు కలవడంతో గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారు. 2021లో వీరి వివాహం సౌత్ ఆఫ్రికాలో జరిగింది. కరోనా కారణంగా రాష్ట్రానికి వచ్చేందుకు అప్పట్లో వీలు కాలేదు. ఈ నేపథ్యంలో శనివారం జొన్నలగరువులోని డాక్టర్ వెంగల్ స్వగృహంలో బంధువులు, స్నేహితుల సమక్షంలో క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో వీరు వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం సోఫియా జర్మనీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీఈవోగా పనిచేస్తున్నారు. వీరి వివాహానికి జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై ఆశీర్వదించారు.

– పాలకొల్లు అర్బన్

• 24 గంటల్లో 6931 క్యూబ్స్



రూబిక్స్ క్యూబ్‌ను సాల్వ్ చేయడానికి మీకెంత సమయం పడుతుంది?. కంటిన్యూయస్‌గా ఎన్ని క్యూబ్స్‌ని సాల్వ్ చేయగలరు? ఇప్పుడు ట్రై చేద్దాం అనుకుంటున్నారా! ముందు ఇది చదివి, ఆ తరువాత ప్రయత్నించండి. రూబిక్స్ క్యూబ్స్ పరిష్కరించడంపై అనేక రికార్డ్స్ ఉన్నాయి. అతి తక్కువ సమయంలో ఒకరు.. కాళ్లు, చేతులతో ఒకరు.. సైకిల్ తొక్కుతూ ఇంకొకరు.. ఇలా రకరకాల రికార్డులు నెలకొల్పారు. బ్రిటన్‌కు చెందిన ఈ 20 ఏళ్ల యువకుడు జార్జ్ స్కోలే మాత్రం అంతకుమించి. 24 గంటల్లో 6,931 రూబిక్స్ క్యూబ్స్‌ని సాల్వ్ చేసి.. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించాడు. 2013లో 24 గంటల్లో 5,800 క్యూబ్స్‌ను పరిష్కరించిన కెనడాకు చెందిన ఎరిక్ లైమ్‌బ్యాక్ రికార్డును బద్దలు కొట్టాడు.

ప్రభుత్వ గ్రాంట్‌తోనే 60 ఎయిడెడ్ కాలేజీలు నడుస్తున్నాయి

- ఓ పత్రిక తప్పుడు కథనంతో గందరగోళం సృష్టిస్తోంది
- అనుబంధ కళాశాలల అధ్యాపక సంఘం స్పష్టీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఇస్తున్న నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 60 ఎయిడెడ్ కళాశాలలు పూర్తిస్థాయి వసతులతో విద్యార్థులకు బోధన చేస్తున్నాయని అనుబంధ కళాశాలల అధ్యాపక సంఘ (ఆక్టా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండ్రు మోహనరావు, డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ‘తేలనున్న ఎయిడెడ్ కళాశాలల భవితవ్యం, 17న రానున్న స్పష్టత, కొనసాగిస్తారా, కలిపేసుకుంటారా’ అనే శీర్షికతో శుక్రవారం ఒక దినపత్రికలో (సాక్షి కాదు) ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమైనదన్నారు. ఇటువంటి నిరాధార వార్తలతో గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 17న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ అధ్యక్షతన మంగళగిరిలోని కార్యాలయంలో ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో నిర్వహిస్తున్న సమావేశం పూర్తిగా విద్యాపరమైన విషయాలను చర్చించేందుకే అని స్పష్టం చేశారు.

‘బాలోత్సవ్’తో నైపుణ్యానికి మెరుగు

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో ప్రపంచ తెలుగు బాలల పండగ బాలోత్సవ్–2022 వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు ఆంధ్ర, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. బాలోత్సవ్ వేడుకలను ‘నవరత్నాలు’ అమలు విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, కొత్తగూడెం బాలోత్సవ్ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి రమేష్ ప్రారంభించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ బాలోత్సవ్‌లో 59 విభాగాల్లో 30 వేదికలపై 20 అంశాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కోడూరు అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.







2025 నుంచి సీబీఎస్‌ఈ ప్యాట్రన్‌లో

టెన్త్ పరీక్షలు



ఈ ఏడాది 8వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ ప్రవేశపెట్టిన విద్యాశాఖ

- ఈ విద్యార్థులు 2025 నాటికి సీబీఎస్‌ఈ తొలి బ్యాచ్
- అప్పటినుంచి ఏటా ఇదే విధానం
- సీబీఎస్‌ఈ గుర్తింపు ఉన్న స్కూళ్లకు ఆ బోర్డు ద్వారా పరీక్షలు
- మిగిలిన విద్యార్థులకు ఎస్సెస్సీ బోర్డు ద్వారా అదే ప్యాట్రన్‌లో..
- అంతర్గత ప్రాజెక్టులకు 20 మార్కులు
- సీసీఈ విధానం టెన్త్‌కు అమలయ్యేలా ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2025 విద్యాసంవత్సరం నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో సమూల మార్పులు రానున్నాయి. ఆ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విధానంలో జరగనున్నాయి. రాష్ట్రంలో సీబీఎస్‌ఈ విధానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతోపాటు ఈ విద్యాసంవత్సరం 8వ తరగతి నుంచి అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ విద్యాసంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ తరహాలో పాఠ్యపుస్తకాలను అందించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీటిని ద్విభాషా (బైలింగ్యువల్) విధానంలో ముద్రించి ఇచ్చారు. ఈ విద్యార్థులు 2025లో టెన్త్ పబ్లిక్ పరీక్షలను రాయనున్నారు. వీటిని సీబీఎస్‌ఈ ప్యాట్రన్‌లో నిర్వహించనున్నారు. ఆతరువాత నుంచి వచ్చే బ్యాచ్‌ల విద్యార్థులు సీబీఎస్‌ఈ ప్యాట్రన్‌లోనే అభ్యసనం సాగించనున్నందున వారికి పరీక్షలు కూడా అదే విధానంలో నిర్వహించేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. 2022–23, 2023–24 విద్యాసంవత్సరపు విద్యార్థులకు మాత్రమే ప్రస్తుతం నిర్వహిస్తున్న తరహా పరీక్షలు ఉంటాయి. ఆతరువాత నుంచి పూర్తిగా సీబీఎస్‌ఈ విధానంలోనే పరీక్షలు కొనసాగనున్నాయి.

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అంతర్గత మార్కులు తప్పనిసరి

ప్రస్తుతం ఎస్సెస్సీ బోర్డు ద్వారా నిర్వహిస్తున్న పబ్లిక్ పరీక్షలను.. అంతర్గత మార్కులు 20 కలపకుండా నేరుగా 100 మార్కులకు నిర్వహిస్తున్నారు. సీబీఎస్‌ఈ విధానంలో 80 మార్కులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించి మిగిలిన 20 అంతర్గత మార్కులను పరిగణనలోకి తీసుకుంటున్నారు. సమగ్ర నిరంతర మూల్యాంకనం (కాంప్రహెన్సివ్, కంటిన్యూ ఇవాల్యుయేషన్ – సీసీఈ) విధానం ప్రకారం గతంలో ఎస్సెస్సీ పరీక్షల్లో అంతర్గత మార్కులు ఉండేవి. అంతర్గత ప్రాజెక్టులకు 20 మార్కులు, పబ్లిక్ పరీక్షలను 80 మార్కులకు నిర్వహించేవారు. అయితే అంతర్గత మార్కుల విషయంలో ప్రైవేటు స్కూళ్లు అడ్డగోలుగా వ్యవహరిస్తూ తమ విద్యార్థులకు 20కి 20 మార్కులు వేసుకుంటున్నాయన్న విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం గతంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల నుంచి అంతర్గత మార్కులను తొలగించింది. పూర్తిగా 100 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తోంది. సీబీఎస్‌ఈ విధానాన్ని అనుసరించనున్నందున 2025 నుంచి జరిగే టెన్త్ పరీక్షల్లో ఎస్సెస్సీ బోర్డు కూడా ఆ తరహాలోనే అంతర్గత మార్కులను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అంతర్గత మార్కులను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వవలసి ఉంటుందని ఎస్సెస్సీ బోర్డు వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో ఏటా ఆరులక్షల మందికిపైగా విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2022–23)లో కూడా ఆరులక్షల మందికిపైగా విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు.


2015 నుంచి టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సంఖ్య ఇలా..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2015	5,54,536
2016	5,83,266
2017	5,60,253
2018	5,71,175
2019	5,87,765
2020	6,29,545
2021	6,24,367
2022	6,22,537

తొలివిడతగా 1,092 స్కూళ్లకు రానున్న సీబీఎస్‌ఈ గుర్తింపు

రాష్ట్రంలో సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నందున ప్రభుత్వ హైస్కూళ్లకు సీబీఎస్‌ఈ గుర్తింపునకోసం విద్యాశాఖ ఇప్పటికే ఆ బోర్డుకు ప్రతిపాదనలు పంపింది. సీబీఎస్‌ఈ నిబంధనలకు అనుగుణంగా ఉండే 1,092 స్కూళ్లకు తొలివిడతగా ఈ గుర్తింపు రానుంది. ఈ స్కూళ్ల విద్యార్థులకు సీబీఎస్‌ఈ విధానాలను అనుసరించి పరీక్షలు ఉంటాయి. నేరుగా ఆ బోర్డే ఈ స్కూళ్ల విద్యార్థులకు పరీక్షలు పెడుతుంది. సీబీఎస్‌ఈ గుర్తింపు లేకున్నా దాని సిలబస్, ప్యాట్రన్‌ను మిగిలిన స్కూళ్లలో అనుసరించనున్నందున ఆ స్కూళ్ల పదోతరగతి విద్యార్థులకు మాత్రం ఎస్సెస్సీ బోర్డు ద్వారా.. సీబీఎస్‌ఈ ప్యాట్రన్‌లోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.

మరో 6,965 గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలు



స్థల సేకరణ కోసం కలెక్టర్లకు ఆదేశాలు

- ఏడాదిన్నర క్రితమే 3,960 లైబ్రరీల నిర్మాణం ప్రారంభం
- ఒక్కొక్కటి రూ. 16 లక్షలతో నిర్మాణం
- గ్రామ సచివాలయం ఉన్న ప్రతి చోటా ఓ డిజిటల్ లైబ్రరీ

సాక్షి, అమరావతి: వర్క్ ఫ్రం హోం చేసుకొనే ఐటీ ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలు, విద్యార్థులకు ఆన్‌లైన్, డిజిటల్ క్లాసులు, వారికి అవసరమైన సమాచారాన్ని గ్రామ గ్రామాన అందుబాటులో ఉంచేలా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష వేగంగా కార్యరూపం దాలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 3,960 డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు జరుగుతోంది. వీటిలో కొన్ని పూర్తవగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసిన ప్రతి చోటా డిజిటల్ లైబ్రరీ ఉండాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కొత్తగా మరో 6,965 గ్రామాల్లో వీటి ఏర్పాటుకు అనుమతి తెలిపింది. వీటితో మొత్తం 10,925 గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో అత్యాధునిక సౌకర్యాలు, ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తారు. ఉద్యోగులు.. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు ఇవి వరమనే చెప్పాలి. వర్క్ ఫ్రంహోమ్ చేసే ఉద్యోగులు వారి స్వగ్రామం నుంచే ఉద్యోగం చేసుకొనే వెసులుబాటు కలుగుతుంది. విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు హాజరవడానికి, వారికి అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్, డిజిటల్ పద్ధతుల ద్వారా సేకరించుకోవడానికి ఈ లైబ్రరీలు ఉపయోగపడతాయి. ఒక్కొక్క లైబ్రరీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షలు ఖర్చు చేస్తోంది. ఇతరత్రా సదుపాయాలకు మరింత ఖర్చు పెడుతోంది. వీటి భవనాలకు స్థల సేకరణ చేయాలని ఆ శాఖ కమిషనర్ కోన శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కేవలం డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణానికే ప్రభుత్వం రూ. 1,114 కోట్లు ఖర్చు చేస్తోంది. వీటితో కలిపి గత మూడున్నర సంవత్సరాల్లో రూ. 9,630 కోట్ల ఖర్చుతో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, వంటి వాటితో కలిపి గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 44 వేల భవన నిర్మాణాలు సాగుతున్నట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, జిల్లా గ్రంథాలయాల్లో వేడుకలు
- లైబ్రరీల ప్రాముఖ్యతను తెలియజేసేలా కార్యక్రమాలు
- ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

సాక్షి, అమరావతి: నేటి తరానికి గ్రంథాలయాల ప్రాముఖ్యత, సేవలను తెలియజేసే విధంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు తెలిపారు. విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ఉదయం పది గంటలకు రాష్ట్రస్థాయిలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, జిల్లా గ్రంథాలయాల్లోనూ వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. గ్రంథాలయాల ప్రాధాన్యం, సామాజిక స్పృహ, విద్య ప్రాధాన్యతను చాటిచెప్పేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ, ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల బలోపేతానికి ఈ వారోత్సవాలు దోహదపడాలని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

16న అంబేడ్కర్ వర్సిటీ బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న బీఈడీ కోర్సులో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ నెల 16వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు యూనివర్సిటీ సహాయ సేవా కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి 500 సీట్లకు రెండు విడతలు కౌన్సెలింగ్ నిర్వహించగా, 53 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల మధ్య హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న యూనివర్సిటీ అకడమిక్ బ్లాక్ వద్ద కౌన్సెలింగ్‌కు ర్యాంక్ కార్డు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు మరో ప్రోగ్రాం సెంటర్‌కు మారాలనుకుంటే (స్లైడింగ్) నిబంధనలకు లోబడి అనుమతిస్తామని ఆయన తెలిపారు. స్లైడింగ్ కోసం విద్యార్థులు 16వ తేదీన ఉదయం 10 నుంచి 11.30 గంటల మధ్య కౌన్సెలింగ్ కేంద్రానికి రావాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ (www.bsoauac.in)ను సందర్శించాలని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.